www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆల్మట్టి నుంచి సాగర్ దాకా గేట్లు బంద్

కృష్ణా బేసిన్‌లో వరదలు తగ్గుముఖం పట్టడంతోనే..

అన్ని ప్రాజెక్టుల్లోనూ సంతృప్తికర స్థాయిలో నిల్వలు

తుంగభద్రలో గేట్లన్నీ ఓపెన్

99,567 క్యూసెక్కుల ఔట్ ఫ్లో

స్టాప్‌లాక్ బిగింపునకు 4 రోజులు

ముంపు లేకుండా రోజుకు

లక్ష క్యూసెక్కులు దిగువకు విడుదల

12

మంగళవారం | 13-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 136
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 9.31 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ ఉ. 10.44 తదుపరి అనూరాధ; వర్జ్యం: మ.2.58-4.40, దుర్ముహూర్తం: ఉ.8.32-9.23, రా.10.21-11.05; అమృతఘడియలు: రా.1.10-2.52; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.38
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పెట్టుబడులకు కొరియా సిద్ధం

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దక్షిణ కొరియా పెట్టుబడులు

టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలత

ఆ దేశ పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ సమావేశం

తెలంగాణలో హ్యుందయ్ మెగా టెస్టింగ్ సెంటర్

విద్యుత్తు, గ్యాస్, బ్యాటరీల తయారీలో ఎల్ఎస్ కార్పొరేషన్..

అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు సమకూర్చాం

అన్నివిధాలా సహకరిస్తాం

మా రాష్ట్రానికి రండి

ప్రతినిధులతో సమావేశాల్లో ముఖ్యమంత్రి పిలుపు



దక్షిణ కొరియా పర్యటనలో పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్/వరంగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా పలువురు పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలను ఆకర్షించడంలో విజయవంతమైన సీఎం రేవంత్‌రెడ్డి.. దక్షిణ కొరియాలోనూ దానిని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించినా.. పరిశ్రమలు రాని వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో దక్షిణ కొరియా నుంచి పెట్టుబడులను సాధించగలిగారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వం సమకూరుస్తున్న సౌకర్యాలను అక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం వివరించారు. దీంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధమని కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ప్రతినిధులు తెలిపారు. అమెరికా పర్యటన ముగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం శనివారం కొరియాకు చేరుకున్నారు. అక్కడ పలు కంపెనీలు, వివిధ వ్యాపార, వాణిజ్య సముదాయాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ చైర్మన్ కియాక్ సంగ్, వైస్‌చైర్మన్ సొయాంగ్ జూ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగ విస్తృతికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణ.. స్థానిక కంపెనీలతోపాటు ప్రపంచ స్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కు సహా తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో

మిగతా 13వ పేజీలో...



చెరువుకు రక్ష

హైడ్రా త్రిముఖ వ్యూహం!

ఆక్రమణలు దశలవారీగా కూల్చివేత.. ముందుగా కట్టడి

నీటి వనరుల పునరుజ్జీవానికి పక్కా ప్రణాళిక అమలు

హుస్సేన్‌సాగర్ సహా హైదరాబాద్‌లో అన్నిచోట్లా కబ్జాలే

చెరువుల్లో 20 నుంచి 90 శాతం వరకు తగ్గిన విస్తీర్ణం

దిగ్భ్రాంతికి గురిచేస్తున్న ఎన్ఆర్ఎస్‌సీ నివేదిక

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలను కూల్చేస్తాం

అనుమతులిచ్చిన అధికారులు, ప్లాట్లు చేసినవారిపై కేసులు

త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్: కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముత్యాలనగరం అనే కాదు.. మన హైదరాబాద్‌కు లేక్ సిటీగానూ పేరుంది! నాలుగు దశాబ్దాల క్రితం హుస్సేన్‌సాగర్ సహా నగరం వ్యాప్తంగా నీటితో కళకళలాడిన చెరువులన్నీ కూడా కాలక్రమేణా కబ్జాలకు గురై కుచించుకు పోతుండటంతో హైదరాబాద్ ఇప్పుడు 'లేక్ లెస్ సిటీ'గా మారుతోంది. ఎక్కడ చూసినా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఇప్పుడన్నీ కాలనీలు, బస్తీలే కనిపిస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ వాస్తవ విస్తీర్ణం 5.97 చదరపు కిలోమీటర్లయితే ప్రస్తుత విస్తీర్ణం 4.71 చదరపు కిలోమీటర్లే. సుమారు 1.25 చ.కిమీ.ల మేర అంటే 310 ఎకరాల మేర (21 శాతం) హుస్సేన్ సాగర్ ఆక్రమణలకు

మిగతా 12వ పేజీలో...



కౌటాల వద్ద తుమ్మిడిహెట్టి నిర్మించే ప్రాంతం

తుమ్మిడిహెట్టిపై సర్కారు నజర్

వ్యాప్కోస్ నివేదిక పునః పరిశీలన

దాని ఆధారంగా డీపీఆర్ తయారీ!

సుందిళ్లకు గ్రావిటీతో నీటికి కొత్త ప్లాన్?

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అందిన తరువాతే

కాళేశ్వరం బ్యారేజీలపై నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కంటే తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారానే తక్కువ ఖర్చుతో గోదావరి జలాలను ఎత్తిపోయవచ్చని ముందు నుంచీ వాదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా ఆ ప్రాజెక్టును నిర్మించేందుకు అడుగులు వేస్తోంది. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై బ్యారేజీ నిర్మించేందుకు సన్నాహాలను ప్రారంభించింది. ఈ క్రమంలో తుమ్మిడిహెట్టిపై కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ గతంలో చేసిన సర్వే ఫలితాలను పునః పరిశీలన చేయించే పనిలో పడింది. ఆ ఫలితాల ఆధారంగా డీపీఆర్‌కు తుదిరూపు ఇచ్చి, అనుమతుల కోసం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లో దాఖలు చేయనుంది.. గతంలో తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ప్రతిపాదించగా.. తాజాగా గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీకి నీటిని తరలించాలనే కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం తెరమీదకి తెచ్చింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రతిపాదిత ప్రాంతం

మిగతా 12వ పేజీలో...

వర్సిటీల్లో నాసి విద్య



పడిపోతున్న ఉస్మానియా, కాకతీయ, జేఎన్‌టీయూ ప్రమాణాలు

విశ్వవిద్యాలయాల్లో నియామకాల్లేవు.. పరిశోధనలు కరువు!

ఏళ్ల తరబడి ఖాళీలు.. సకాలంలో భర్తీ కానీ వీసీ పోస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితి నానాటికీ దిగజారిపోతోంది. ఏళ్ల తరబడి ఖాళీలను భర్తీ చేయకపోవడం, రీసెర్చ్‌కు సమృద్ధిగా నిధులు లేకపోవడం వంటి కారణాలతో యూనివర్సిటీల్లో నాణ్యత క్రమంగా తగ్గిపోతోంది. ఫలితంగా ఇతర రాష్ట్రాల్లోని విద్యాసంస్థలతో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలలు పోటీ పడలేకపోతున్నాయి. తాజాగా కేంద్ర విద్యా శాఖ ప్రకటించిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు దీనికి అద్దం పడుతున్నాయి. వివిధ కేటగిరీల్లో ఈ సారి ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, జేఎన్‌టీయూల స్థానాలు దిగజారాయి. యూనివర్సిటీలు, విద్యా సంస్థల్లోని నాణ్యతను అంచనా వేసి ఎన్ఐఆర్ఎఫ్ తాజాగా ర్యాంకులు ప్రకటించింది. వీటిలో రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఇతర విద్యా సంస్థలకు చెప్పుకోదగ్గ స్థానాలు లభించలేదు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐఐటీలు, యూనివర్సిటీలకే వివిధ కేటగిరీల్లో మెరుగైన

మిగతా 14వ పేజీలో...

వైద్య విద్య.. నాణ్యత మిథ్య

ప్రైవేటులో పుట్టగొడుగుల్లా మెడికల్ కాలేజీలు 14

ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 60..

70% ప్రొఫెసర్లు లేనివే అధికం

రోగులు లేకుండానే ప్రాక్టికల్స్

ఐఐటీ మద్రాస్ అత్యుత్తమం 2

ఆరోసారీ ఈ సంస్థే టాప్‌లో

ఐఐఎస్‌సీ బెంగళూరు ఉత్తమం

ర్యాంకులు ప్రకటించిన కేంద్రం

మరోసారి ఆకర్ష.. ఆకర్ష!

- కాంగ్రెస్‌లోకి జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేలు
- సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి తిరిగి రాగానే చేరికలు
- బీజేపీతో బీఆర్ఎస్ నేతలు టచ్‌లోకి వెళ్లారన్న ప్రచారంతో అప్రమత్తం
- కొందరు నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బీజేపీతో టచ్‌లోకి వెళ్లారన్న వార్తల నేపథ్యంలో ఆపరేషన్ ఆకర్ష్‌కు సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి పదును పెట్టనున్నారా? జీహెచ్ఎంసీ పరిధిలోని అరడజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారా? ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న సీఎం.. హైదరాబాద్‌కు తిరిగి రాగానే మరో విడత చేరికలుంటాయా? అంటే.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. వాస్తవానికి సీపీఐ ఎమ్మెల్యేతో కలిపి 65 మంది సభ్యుల మద్దతుతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కాలం నిలవబోదంటూ కేసీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్య నేతలు చేసిన ప్రకటనలతో అప్రమత్తమైన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే దానం నాగేందర్ మొదలుకుని పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దశల వారీగా కాంగ్రెస్‌లో చేరారు. గతంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా శాసన సభా పక్షం ఏర్పాటు చేయించి బీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయించుకున్న తీరుగానే.. బీఆర్ఎస్‌కు చెందిన 26మంది ఎమ్మెల్యేలతో శాసనసభా పక్షాన్ని ఏర్పాటు చేయించి సీఎల్పీలో విలీనం చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళిక రచించారన్న ప్రచారం జరిగింది. బడ్జెట్ సమావేశాలకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలనుకున్న సీఎం రేవంత్‌రెడ్డి .. ఆ దిశగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులూ జరిపారు. కొంత మందితో ముఖాముఖి సమావేశమై హామీలూ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం లేని గ్రేటర్ హైదరాబాద్, శివారు నియోజకవర్గాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే

మిగతా 13వ పేజీలో...

12

కమలంలో కుర్చీ పోరు!

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

రేసులో ఈటల, రాంచందర్‌రావు!

ఎత్తులకు పైఎత్తుల్లో ఆశావహులు

ముఖ్యనేతల మధ్య సయోధ్య లేమి

అచితూచి జాతీయ నాయకత్వం

కొత్త ఇన్‌చార్జిపైనా సందిగ్ధం

సెబీ చైర్మన్ అక్రమ పెట్టుబడులపై..

కాంగ్రెస్, బీజేపీ ఢీ



జేపీసీతో విచారణకు మోదీకి భయమెందుకు?

మాధవి బుచ్ రాజీనామా చేయరేం?: రాహుల్

20 వేల కోట్లకు పైగా బినామీ లావాదేవీలు: జైరాం

జేపీసీ వేయకుంటే ఆందోళనలు: కేసీ వేణుగోపాల్

మాధవి వైదొలగాలి: ఇండియా ఎంపీలు, నేతలు

ఆమెకు అండగా.. సెబీ, బీజేపీ, అదానీ గ్రూప్

సోరోస్ ఏజెంట్‌గా రాహుల్ వ్యవహరిస్తున్నారు

ఆర్థిక అరాచక వ్యాప్తికి కాంగ్రెస్ కుట్ర: రవిశంకర్

రాహుల్ సంపద 59% పెరిగింది: మాలవీయ

న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అదానీ గ్రూప్‌లో సెబీ చైర్మన్ మాధవి బుచ్ విదేశాల్లో అక్రమ పెట్టుబడులు పెట్టారంటూ హిండెన్‌బర్గ్ సంస్థ చేసిన ఆరోపణ.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర వాగ్యుద్ధానికి కారణమైంది! ప్రతిపక్షాలన్నీ ఈ విషయంలో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నాయి. అదానీ వ్యవహారంపై సెబీ దర్యాప్తు చేస్తుండగానే ఈ వివరాలు బయటపడ్డాయని.. దీన్ని బట్టి భారీ కుంభకోణం జరిగిందని భావించవచ్చునని

మిగతా 2వ పేజీలో...



హత్యాచార నిందితుడిని శిక్షించాలంటూ ఢిల్లీలో మెడికోల ధర్నా

ఉరి తీసుకోండి!

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి

పాల్పడ్డ నిందితుడి బరితెగింపు వ్యాఖ్యలు

ఆ ఘోరానికి ముందు రెడ్‌లైట్ ఏరియాకు..

హత్యాచారం తర్వాత ఇంటికి వెళ్లి.. నిద్ర 2

లేచాక సాక్ష్యాధారాల ధ్వంసానికి యత్నం

అతడి బూట్లపై రక్తం.. గుర్తించిన పోలీసులు

వారం రోజుల్లో కేసును ఛేదించండి: మమత

లేదంటే సీబీఐకిస్తానని పోలీసులకు హెచ్చరిక

చైనా ఆదేశాలతోనే రాహుల్ మౌనం

బంగ్లా హిందువులపై దాడుల గురించి

అందుకే ఆయన స్పందించట్లేదు

దేశాన్ని కులాల పేరుతో విభజించే కుట్ర

కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి బండి ఫైర్



కరీంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై రాహుల్ గాంధీ నోరు విప్పకపోవడానికి ఆయనకు చైనా నుంచి వచ్చిన ఆదేశాలే కారణమని, చైనా ఆలోచనలను రాహుల్ భారత్‌లో అమలు చేస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో హర్ ఘర్ తిరంగా యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్

మిగతా 14వ పేజీలో...

మస్తాన్ సాయి అరెస్టు

లావణ్య, రాజ్‌తరుణ్ కేసులో కదిలిన డ్రగ్స్ డొంక

వారికి మాదకద్రవ్యాలు అందించింది అతడే?

విజయవాడలో విచారిస్తున్న సెబ్ అధికారులు

ఢిల్లీ నుంచి డ్రగ్స్ తెచ్చి గుంటూరు, బెజవాడ, హైదరాబాద్‌లో కొన్ని హోటళ్ల ద్వారా దందా

డ్రగ్స్ వ్యవహారంలో ఇప్పటికే నలుగురి అరెస్ట్

విజయవాడ, గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రాజ్‌తరుణ్, లావణ్య కేసులో డ్రగ్స్ వ్యవహారం నిజమేనని తేలింది. వారికి మాదకద్రవ్యాలు సరఫరా చేసిన కీలక నిందితుడు.. టికీ రావి సాయి మస్తాన్‌రావును (మస్తాన్ సాయి(35)) విజయవాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు సోమవారం గుంటూరులో అరెస్టు చేశారు. వాస్తవానికి వేరొక కేసులో ఈ నిందితుడిని అరెస్టు చేస్తే.. అందులోకి



మస్తాన్‌సాయి (ఫైల్)

మిగతా 13వ పేజీలో...

13

26 ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డీ-అడిక్షన్ కేంద్రాల్లో 12 ప్యానెల్ డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఉండాలి: టీజీ న్యాబ్

జపోరిజియా న్యూక్లియర్ ప్లాంటులో మంటలు



న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఐరోపా ఖండంలోనే అతిపెద్ద న్యూక్లియర్ విద్యుత్తు కేంద్రమైన జపోరిజియాలో ఆదివారం భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ఉక్రెయిన్ జరిపిన క్షిపణి దాడుల వల్లే ప్లాంట్‌లో మంటలు చెలరేగాయని రష్యా ఆరోపించగా.. ప్లాంట్‌లో కూలింగ్ టవర్స్‌లో మంటలకు రష్యానే కారణమని ఉక్రెయిన్ పేర్కొంది. అయితే, ప్లాంటు నుంచి న్యూక్లియర్ రేడియేషన్ బయటకు రావడం లేదని రెండు దేశాలూ తెలిపాయి. మంటలను సోమవారానికల్లా ఆర్పివేసినట్లు రష్యా ప్రకటించింది. జపోరిజియా న్యూక్లియర్ ప్లాంటు ఉక్రెయిన్‌లో ఉంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా ఈ ప్లాంటును 2022లోనే తన అధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి అక్కడ విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అణు రియాక్టర్లను కోల్డ్ షట్‌డౌన్‌లో పెట్టారు. కాగా, జపోరిజియా ప్లాంటులో మంటలకు ముందు అక్కడ కొన్ని పేలుళ్లు సంభవించాయని అక్కడే విధుల్లో ఉన్న ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ(ఐఏఈఏ) ప్రతినిధులు తెలిపారు.

గ్రీస్‌లో కార్చిచ్చు బీభత్సం



కార్చిచ్చులో కాలిపోతున్న ఇల్లు

ఏథెన్స్, ఆగస్టు 12: గ్రీస్‌ను కార్చిచ్చు కమ్మేసింది. మంటలు రాజధాని ఏథెన్స్‌ను వేగంగా సమీపిస్తున్నాయి. దీంతో అక్కడి ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలను ఆర్పేందుకు దాదాపు 700 అగ్నిమాపక సిబ్బంది కష్టపడుతున్నారు. 17 వాటర్ డ్రాపింగ్ విమానాలు, 16 హెలికాప్టర్లను మోహరించారు. అయినా అగ్నికీలలు అదుపులోకి రావడంలేదని సోమవారం అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది, ముగ్గురు పౌరులు గాయపడ్డారని చెప్పారు. "ఆదివారం మధ్యాహ్నం వరకు మంటలు ఏథెన్స్ నగరానికి 35 కిమీ దూరంలో ఉన్నాయి. బలమైన గాలులు వీస్తుండడంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. గాలుల కారణంగా మంటలను అడ్డుకోవడం కష్టంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అగ్ని కీలలు 25 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడుతున్నాయి. దట్టమైన పొగ కారణంగా స్థానికులు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలిస్తున్నాం. దేశంలో సగం ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేశాం" అని అధికారులు తెలిపారు. కాగా, గత సంవత్సరం కూడా కార్చిచ్చు కారణంగా 20 మంది వరకు మరణించారు.

లోకం తీరు



విపత్తు దృశ్యాలపై తేదీ, సమయం ఉండాలి!

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాల దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు వాటిపై తేదీ, సమయానికి సంబంధించిన స్టాంపు ప్రసారమయ్యేలా చూడాలని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు టీవీ న్యూస్ చానళ్లను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సమాచార ప్రసార మాధ్యమాల మంత్రిత్వశాఖ సోమవారం ఒక సూచనను జారీ చేసింది. ప్రకృతి విపత్తులు, భారీ ప్రమాదాలు సంభవించినప్పుడు టీవీ చానళ్లు రోజుల తరబడి నిరంతర కవరేజీ ఇస్తుంటాయని, అయితే, తొలిరోజు దృశ్యాలను ఫుటేజ్‌లో చూపిస్తూనే ఉండటం వల్ల వీక్షకులకు అనవసర గందరగోళం, భయాందోళనలు కలిగే అవకాశం ఉందని తెలిపింది. 'అందువల్ల వీక్షకులను అనవసరపు అపార్థాలకు గురిచేయకుండా నివారించేందుకు అలాంటి దృశ్యాలను ప్రసారం చేసేటప్పుడు ఫుటేజీ పైభాగంలో తేదీ, సమయం స్టాంపును ప్రముఖంగా ప్రదర్శించాలని అన్ని ప్రైవేటు శాటిలైట్ టీవీ చానళ్లకు సూచిస్తున్నాం' అని ఆ సూచనలో స్పష్టం చేసింది.

బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ ముసాయిదా బిల్లు వెనక్కి

న్యూఢిల్లీ, ఆగస్టు 12: వివాదాస్పద బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్ (రెగ్యులేషన్) ముసాయిదా బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సోమవారం ప్రకటించింది. ముసాయిదా బిల్లు రివైజ్డ్ వెర్షన్‌ను కొందరికే రహస్యంగా ఇచ్చారంటూ విపక్షాలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అన్ని వర్గాల నుంచి వచ్చిన ప్రతిస్పందనల మేరకు ముసాయిదా బిల్లుపై అక్టోబరు 15వ తేదీ వరకు మరిన్ని సూచనలు, సలహాలు తీసుకుంటామని సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ ఏడాది నవంబరు 11న మళ్లీ ప్రజల ముందు ఉంచుతామని తెలిపింది.

డీకే శివకుమార్ కేసులో తీర్పు రిజర్వు


బెంగళూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై సీబీఐ నమోదుచేసిన అక్రమాస్తుల కేసుకు సంబంధించి ప్రభుత్వం అనుమతులను వాపసు తీసుకోవడంపై దాఖలైన కేసు విచారణ సోమవారం ముగిసింది. దీనిపై తీర్పును హైకోర్టు ధర్మాసనం రిజర్వులో పెట్టింది. డీకే శివకుమార్ అక్రమాస్తులు కలిగి ఉన్నారని గత బీజేపీ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. అందుకు అనుగుణంగా సీబీఐ దర్యాప్తు చేసింది. కేసు దర్యాప్తు దాదాపు తుదిదశకు చేరిన సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. కేసు విచారణకు బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ లిస్టింగ్‌ను పరిశీలిస్తాం

న్యూఢిల్లీ, ఆగస్టు 12: మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ నమోదు చేసిన కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను లిస్టింగ్ చేయడాన్ని పరిశీలిస్తామని సోమవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇదే ఆరోపణపై ఈడీ నమోదు చేసిన కేసుల్లో నిందితుల బెయిల్ పిటిషన్లను లిస్టింగ్ చేసినందున, కేజ్రీవాల్ వినతిని కూడా లిస్ట్ చేయాలని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ "ఈ-మెయిల్ పంపండి. చూస్తాను" అని అన్నారు.

ఎల్జీకి కేజ్రీవాల్ లేఖ అధికార దుర్వినియోగమే

న్యూఢిల్లీ, ఆగస్టు 12: జైలు నుంచి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వీకే సక్సేనాకు లేఖ రాయడం అధికార దుర్వినియోగానికి పాల్పడటమేనని తిహాడ్ జైలు అధికారులు సీఎం కేజ్రీవాల్ చర్యల్ని తప్పుబట్టారు. అది నిబంధనలను అతిక్రమించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను జైల్లో ఉన్నందున.. ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తన స్థానంలో మంత్రి అతిశీకి జెండా ఎగురవేసేందుకు అనుమతినివ్వాలని ఎల్జీకి ఇటీవలే సీఎం కేజ్రీవాల్ లేఖ రాశారు. అయితే జైలు నిబంధనల ప్రకారం.. జైల్లో ఉన్న వ్యక్తి వ్యక్తిగత విషయాలను మాత్రమే లేఖలో పేర్కొనాల్సి ఉంటుందని, కానీ ఎల్జీకి లేఖ రాయడం ఢిల్లీ జైలు నిబంధనలకు విరుద్ధమని అందుకే దానిని పంపలేదని అధికారులు కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో వెల్లడించారు.



ఆ పగడపు ద్వీపం ఇవ్వనందుకే!

- హసీనా పదవీచ్యుతికి సెయింట్ మార్టిన్సే కారణం?

ఢాకా, ఆగస్టు 12: బంగాళాఖాతంలో అదొక అందాల పగడపు దీవి.. మొత్తం విస్తీర్ణం మూడు చదరపు కిలోమీటర్లే.. కానీ, సైనికపరంగా అత్యంత వ్యూహాత్మక ప్రాంతం..! దీంతో అమెరికా కన్నుపడింది.. అక్కడ స్థావరం ఏర్పాటు చేస్తామంటూ బంగ్లాదేశ్‌ను కోరింది. అయితే, దేశాధినేత ససేమిరా అన్నారు. తన ప్రతిపాదనను కాదన్నందుకు ఆమెపై అగ్రరాజ్యం పగబట్టింది. పదవి నుంచి దించేసేవరకు నిద్రపోలేదు. ఇదంతా బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతి వెనుక ఉన్న నేపథ్యం అంటూ తాజాగా కథనాలు వస్తున్నాయి. హసీనా కూడా ఇదే విషయం చెప్పినట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. సెయింట్ మార్టిన్స్ ద్వీపం బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక వాణిజ్య ఓడరేవు అయిన కాక్స్ బజార్‌కు కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉంది. బంగ్లాదేశ్‌కు ఉన్న ఏకైక పగడపు దీవి అయిన సెయింట్ మార్టిన్.. అరుదైన జీవజాతులతో పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతం. సెయింట్ మార్టిన్స్ జనాభా 3,800 మాత్రమే. చేపల వేట, వరి, కొబ్బరి తోటలు, సీ వీడ్ సాగు వీరి జీవనాధారం. సహజ సౌందర్యం కారణంగా ఇటీవలి కాలంలో ఈ ద్వీపం పర్యాటక ప్రాంతంగానూ మారింది. కాగా, 1947లో భారత్ విభజన సమయంలో పాకిస్థాన్‌కు, 1971లో బంగ్లాదేశ్ పరిధిలోకి వెళ్లింది. అయితే, మయన్మార్‌కు కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో సముద్ర సరిహద్దులు, చేపల వేట విషయంలో బంగ్లా-మయన్మార్ మధ్యన తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి.

అమెరికా కన్ను అందుకే..

మయన్మార్‌కే కాక, ప్రపంచంలోనే సముద్ర వాణిజ్యానికి అత్యంత కీలకమైన మలక్కా జలసంధికి అతి సమీపంలో ఉండడంతో సెయింట్ మార్టిన్స్ ప్రాధాన్యంగా మారింది. ఇక కాక్స్‌బజార్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) కింద చైనా నౌకాశ్రయాన్ని అభివృద్ధి చేస్తోంది. అందుకే సెయింట్ మార్టిన్స్‌లో సైనిక స్థావరం ఏర్పాటు చేసి చైనా, మయన్మార్, భారత్‌పైనా ఉంచాలని అమెరికా భావించింది. హిందూ మహా సముద్రంలో చైనా ఆధిపత్యాన్ని మరింత పెంచేలా బీఆర్ఐలో బంగ్లా చేరడం కూడా ఆ దేశానికి ఆందోళన కలిగించింది.

కావాలంటే ఉరి తీసుకోండి!

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడ్డ నిందితుడి వ్యాఖ్యలు

- ఆ ఘోరానికి పాల్పడడానికి ముందు 2సార్లు రెడ్‌లైట్ ఏరియాకు
- హత్యాచారం తర్వాత ఇంటికి వెళ్లి.. నిద్ర



కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 12: విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై దారుణంగా అత్యాచారం చేసి.. ఆమె ప్రాణాన్ని బలిగొన్నానన్న దోష భావన లేదు! దొరికిపోతే శిక్ష పడుతుందన్న భయం లేదు!! పోలీసులు తనను పట్టుకున్నప్పుడు కూడా అతడి కళ్లల్లో ఎలాంటి పశ్చాత్తాపమూ లేదు! వారు తనను ప్రశ్నిస్తున్నప్పుడు నిర్వికారంగా సమాధానాలు చెప్పాడు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడడానికి ముందు రెండుసార్లు రెడ్‌లైట్ ఏరియాలకు (కాళీఘాట్, సోవాబజార్) వెళ్లినట్లు చెప్పాడు. తాను చేసిన నేరాన్ని ఒప్పుకొని.. "అమీ ఫాసీ దీయే దీ (కావాలంటే నన్ను ఉరి తీసుకోండి)" అని చెప్పాడు!! కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పీజీ ట్రైనీ డాక్టర్(31)పై హత్యాచారం జరిపిన నిందితుడు సంజయ్ రాయ్ తీరు ఇది! అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దాన్ని పరిశీలించగా.. దాన్నిండా అశ్లీల చిత్రాలే కనిపించాయి. ఆమెపై హత్యాచారం జరిపిన తర్వాత నింపాదిగా ఇంటికి వెళ్లిన సంజయ్‌రాయ్.. హాయిగా నిద్రపోయి, ఉదయం 9 గంటలకు లేచి.. రక్తపుమరకలున్న తన దుస్తులను తీరిగ్గా ఉతుక్కున్నాడని కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ తెలిపారు. అయితే, అతడి బూట్లపై రక్తపు మరకలను తాము గుర్తించామని ఆయన వెల్లడించారు. సంజయ్‌రాయ్ ఆమెను తొలుత హత్య చేసి.. అనంతరం మృతదేహంపై లైంగికదాడికి పాల్పడ్డాడనడానికి కొన్ని ఆధారాలున్నట్టు మరో పోలీసు అధికారి చెప్పడం గమనార్హం. అతడి చేతిలో హత్యాచారానికి గురైన ఆ జూనియర్ వైద్యురాలు.. ఆరోజు రాత్రి 12 గంటల సమయంలో తన తోటి ట్రైనీ డాక్టర్లు మరో ముగ్గురితో కలిసి ఒలింపిక్స్‌లో నీరజ్‌చోప్రా రజత పతక ప్రదర్శనను కూడా చూసింది. రాత్రి భోజనం పూర్తయ్యాక వారు ముగ్గురూ తమ విధులు నిర్వర్తించడానికి వెళ్లగా.. ఆమె చదువుకోవడానికి సెమినార్‌హాల్లోనే ఒంటరిగా ఉండిపోయింది. అదే సంజయ్ రాయ్‌కి అవకాశంగా మారింది.



సంజయ్ రాయ్

సివిల్ వాలంటీర్..

సంజయ్ రాయ్ అసలు ఆర్జీ కర్ ఆస్పత్రి ఉద్యోగి కాదు. కోల్‌కతా పోలీసు విభాగంలో సివిక్ వాలంటీర్‌గా పనిచేసేవాడు. సివిక్ వాలంటీర్ అంటే.. కాంట్రాక్ట్ సిబ్బంది. ట్రాఫిక్ నిర్వహణ, విపత్తు స్పందన విభాగాల్లో రూ.12 వేల జీతానికి వీరిని నియమిస్తారు. సంజయ్‌రాయ్ అలా తొలుత విపత్తు స్పందన విభాగంలో వాలంటీర్‌గా 2019లో చేరాడు. తర్వాత అతణ్ని పోలీస్ సంక్షేమ విభాగానికి మార్చారు. తర్వాత.. ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలోని పోలీస్ ఔట్‌పోస్టులో డ్యూటీ వేశారు. అక్కడ అతను.. రోగుల నుంచి డబ్బులు తీసుకుని బెడ్ ఇప్పించడం వంటి దందాలు చేసేవాడు. ఈ క్రమంలోనే ట్రైనీ డాక్టర్‌పై కన్నేశాడు. కాగా, ఈ కేసును వీలైనంత త్వరగా ఛేదించాలని పోలీసులను బెంగాల్ సీఎం మమత ఆదేశించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన ఆమె.. "వచ్చే ఆదివారం కల్లా కేసును ఛేదించలేకపోతే.. దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తాం. సీబీఐకి ఇవ్వడానికి మాకేమీ అభ్యంతరం లేదుగానీ.. ఆ సంస్థ విజయాల శాతం చాలా తక్కువ" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇంత ఘోరానికి పాల్పడినవారికి మరణ శిక్ష పడేలా చేస్తానన్నారు. ఈ కేసు విచారణ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో జరగాలని పేర్కొన్నారు. ఇక.. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ కలకత్తా హైకోర్టులో మూడు ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలయ్యాయి. మంగళవారం అవి విచారణకు రానున్నాయి. కాగా.. జాతీయ మహిళా కమిషన్‌కు చెందిన ఇద్దరు సభ్యుల బృందం సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాకు చేరుకుని నగర పోలీసు కమిషనర్‌తో మాట్లాడారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

గాంధీలో నిరసన

ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు కొవ్వత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలోని ఎయిమ్స్, ఆర్ఎంఎల్ సహా పలు ఆస్పత్రుల్లోని రెసిడెంట్ డాక్టర్లు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. ఈ దీక్ష జరిగినన్నాళ్లూ ఓపీ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, వార్డు డ్యూటీలను నిలిపివేస్తామని 'ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్' వెల్లడించింది. అత్యవసర వైద్యసేవలను మాత్రం అందిస్తామని తెలిపింది. ఆర్జీ కర్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను తక్షణం తొలగించాలని, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేసింది. అయితే.. తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ ప్రకటించారు.

రాక్షసి పీడ వదిలింది

- హసీనాపై మహమ్మద్ యూనుస్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌కు పట్టిన రాక్షసి పీడా వదిలిందని కొన్ని రోజుల క్రితం దేశం వదిలి పారిపోయిన గత ప్రభుత్వాధినేత హసీనాను అభివర్ణిస్తూ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ సారధి మహమ్మద్ యూనుస్ అన్నారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని తాను గౌరవిస్తున్నానని, వారు చెప్పినందువల్లే తాను ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోకుండా తాను సారథ్యం వహిస్తున్న తాత్కాలిక ప్రభుత్వం పనిచేస్తుందని యూనుస్ ధీమా వ్యక్తం చేశారు. కాగా, బంగ్లాదేశ్ ప్రభుత్వ తాత్కాలిక సారధిగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ యూనుస్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడ నివసిస్తున్న హిందువులు, ఇతర మైనారిటీల భద్రతకు ఢోకా లేకుండా చూడాలని కోరారు. బంగ్లాదేశ్ అభివృద్ధికి భారత్ అన్ని రకాలుగా సహకరిస్తుందని మోదీ హామీ ఇచ్చారు.

విగ్రహాల ధ్వంసం విచారకరం: థరూర్

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కొత్తగా ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సోమవారం కోరారు. బంగ్లాదేశ్‌లో భారతీయ సాంస్కృతిక కేంద్రం, మందిరాలు, హిందువుల ఇళ్లపై దాడులు అవమానకరమన్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు చేయడాన్ని బట్టి చూస్తే కొందరు ఆందోళనకారుల అజెండా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బంగ్లాదేశ్ విమోచనానికి సంబంధించిన దృశ్యాలతో ముజిబ్‌నగర్‌లోని 1971 షాహిద్ మెమోరియల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి పరిణామాలు విచారకరమన్నారు. హసీనాకు ఆశ్రయం కల్పించి కేంద్రం సరైన నిర్ణయమే తీసుకుందని శశిథరూర్ అన్నారు.

మోదీ.. పదకొండోస్సారి!

- 15న ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేయనున్న ప్రధాని



న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశ రాజధానిలో ఎర్రకోటపై వరుసగా 11వ సారి జాతీయ జెండా ఎగురవేసిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించనున్నారు. ఇంతకుముందు కాంగ్రెస్ నుంచి జవహర్‌లాల్ నెహ్రూకు మాత్రమే ఈ ఘనత సాధించారు. వచ్చే సంవత్సరం మళ్లీ జెండా ఎగురవేస్తానని గతేడాది ఆగస్టు 15న ప్రకటించిన మోదీ జోస్యం ఇప్పుడు నిజం కానుంది. అప్పట్లో ఆయన గత దశాబ్ద కాలంలో తాను సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తుకు రోడ్ మ్యాప్‌తో తిరిగి వస్తానని జాతికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాబోయే ఐదేళ్లకు ఆయన ఎలాంటి విజన్‌ను ప్రకటిస్తారోనని ఆసక్తి నెలకొంది. భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నది ఆయన దీర్ఘకాలిక లక్ష్యం అయినప్పటికీ, మారుతున్న రాజకీయ ముఖచిత్రం కొత్త సవాళ్లను తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్, ప్రతిపక్షాలను ఉద్దేశించి మోదీ ప్రసంగించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఢిల్లీ అంతటా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

యూజీసీ నెట్ రద్దుపై దావా తిరస్కరణ

న్యూఢిల్లీ, ఆగస్టు12: పేపర్ లీకైందన్న కారణంతో కేంద్ర ప్రభుత్వం యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. జూన్ 18న జరగాల్సిన ఈ పరీక్షను వాయిదా వేసి, ఈ నెల 21న నిర్వహించనున్నారని గుర్తు చేసింది. దీనిపై అభ్యర్థులకు ఇప్పటికే ఒక స్పష్టత వచ్చి ఉంటుందని, అందువల్ల చివరి క్షణంలో ఈ పిటిషన్‌ను స్వీకరించడం అంటే గందరగోళాన్ని సృష్టించడమే అవుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



సెబీ చైర్మన్ అక్రమ పెట్టుబడులపై..
కాంగ్రెస్, బీజేపీ ఢీ

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోమవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. అదానీ గ్రూపులో రూ.20 వేల కోట్లకు పైగా బినామీ లావాదేవీలు జరిగాయని, విద్యుత్, బొగ్గు పరికరాల్లో అధిక ధరల్లో ఇన్వాయిస్‌లు జారీ చేశారని... భారీ ఎత్తున నగదు అక్రమ చలామణీ జరిగిందని ఆయన మండిపడ్డారు. దేశంలోని కీలక మౌలిక రంగాలను అదానీకి అప్పగించారని.. శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో అదానీ వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా విదేశాంగ వ్యవహారాలను నిర్వహించారని ఆయన ఆరోపణలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ, జేపీసీ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాక.. సెబీ చైర్ పర్సన్‌గా కొనసాగుతూనే ఆమె కన్సల్టెంట్ సంస్థలను నిర్వహించారని, అలా నిర్వహిస్తూనే అదానీ గ్రూప్ సంస్థలపై దర్యాప్తు చేశారని ఆ సంస్థ వెల్లడించింది. కాగా.. ఈ వ్యవహారంపై జేపీసీ విచారణ జరిపించకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ హెచ్చరించారు. మరోవైపు.. మాధవి బుచ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా, శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆప్ నేత, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో పాటు విపక్షాలకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేశారు. "సెబీ చైర్మన్ ఎందుకు రాజీనామా చేయరు? జేపీసీ విచారణకు ప్రధాని ఎందుకు భయపడుతున్నారు?" అని రాహుల్ ప్రశ్నించారు. ఏ నిధులపై విచారణ జరిపించాలో ఆ నిధులనే సెబీ చైర్మన్ పెట్టుబడులుగా పెట్టారని మహువా మొయిత్రా ఆరోపించారు.

ఇది వ్యక్తిత్వ హననమే

హిండన్‌బర్గ్ నివేదిక, ప్రతిపక్షాల ఆగ్రహం నేపథ్యంలో.. సెబీ చైర్మన్ మాధవికి సెబీ, బీజేపీ, అదానీ గ్రూప్ రక్షణగా నిలిచాయి. ప్రతిపక్షాలు తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నాయని మాధవి బుచ్, ఆమె భర్త ఖండించారు. అదానీ గ్రూప్ పై వచ్చిన అన్ని ఆరోపణలపై తాము విచారణ జరిపించామని.. తన పెట్టుబడుల వివరాలను ఆమె ఎప్పుడూ దాచిపెట్టలేదని, వాటిపై విచారణ జరిగిన సందర్భాల్లో ఆమె విచారణ నుంచి తప్పుకొన్నారని సెబీ వివరణ ఇచ్చింది. మాధవి బుచ్, ఆమె భర్త నిబంధనల ప్రకారమే పెట్టుబడులు పెట్టారని.. అదానీ గ్రూప్ పెట్టుబడుల నిర్ణయాల్లో ఆమె హస్తం లేదని.. మొత్తం తమ పెట్టుబడుల్లో వారి పెట్టుబడులు 1.5 శాతం మాత్రమేనని అదానీ గ్రూప్ తెలిపింది. దేశంలో పెట్టుబడులను నిలిపివేసేందుకు కాంగ్రెస్ కుట్రకు పాల్పడుతోందని మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. దేశంలో ఆర్థిక అరాచకత్వాన్ని వ్యాపింపజేసేందుకు రాహుల్ ఆధ్వర్యంలో కుట్ర జరుగుతోందన్నారు. హిండెన్ బర్గ్ సంస్థలో ప్రధాన వాటాదారుడైన జార్జ్ సోరోస్ ఏజెంట్‌గా రాహుల్ వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఇక.. రాహుల్‌గాంధీ సంపదలో 43% సంపద భారత స్టాక్ మార్కెట్‌లో ఉందని, 2019లో రాహుల్ చరాస్తుల విలువ 59% మేర పెరిగిందని బీజేపీ నేత అమిత్ మాలవీయ అన్నారు.



చైనాలో అతిపెద్ద రవాణా డ్రోన్ పరీక్ష విజయవంతం

బీజింగ్, ఆగస్టు 12: చైనా అతిపెద్ద మానవరహిత రవాణా డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఆదివారం సిచువాన్ ప్రావిన్స్‌లో జరిగిన ఈ ప్రయోగం సందర్భంగా దాదాపు ఇరవై నిమిషాల పాటు ఈ డ్రోన్ ప్రయాణించింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో సిచువాన్ టెంగ్డెన్ సైన్స్ టెక్ ఇన్నోవేషన్ సంస్థ తయారు చేసిన ఈ డ్రోన్ రెక్కల పొడవు 16 మీటర్లు ఉండగా ఎత్తు 15 అడుగులు ఉంది. ఇది రెండు ఇంజిన్లతో పనిచేస్తుంది. దాదాపు 2 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. చైనా ప్రభుత్వం ఇటీవలి కాలంలో తక్కువ ఎత్తులో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్‌లు, చిన్న విమానాల ద్వారా ప్రయాణికులను, సరుకులను రవాణా చేయనున్నట్లు పేర్కొంది.

పాక్ ఐఎస్ఐ మాజీ చీఫ్ అరెస్టు

ఇస్లామాబాద్, ఆగస్టు 12: ఐఎస్ఐ మాజీ చీఫ్ జనరల్ ఫయాజ్ హమీద్‌ను పాకిస్థాన్ ఆర్మీ అరెస్టు చేసింది. హౌసింగ్ స్కీమ్ కుంభకోణంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ఆయనపై వచ్చిన ఆరోపణల దృష్ట్యా సుప్రీం కోర్టు ఆదేశాలతో అదుపులోకి తీసుకుంది. ఈ మేరకు సోమవారం ఐఎస్ఐ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఓ ప్రకటన విడుదల చేసింది. "టాప్ సిటీ కేసు(హౌసింగ్ స్కీమ్)లో ఫయాజ్‌పై వచ్చిన ఆరోపణలు నిరూపితం అయ్యాయి. పాక్ ఆర్మీ, సుప్రీం కోర్టు ఆదేశాలతో అదుపులోకి తీసుకున్నాం" అని తెలిపింది. 2023 నవంబర్‌లో ఫయాజ్‌పై పిటిషన్ దాఖలైంది.

ఐఐటీ మద్రాస్ అత్యుత్తమం

ఆరోసారీ ఈ సంస్థకే తొలి ర్యాంకు.. బోధన, సిబ్బంది, సౌకర్యాల్లో టాప్



- విద్యాసంస్థలకు కేంద్రం ర్యాంకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: దేశంలోని ఉత్తమ విద్యాసంస్థలకు కేంద్రప్రభుత్వం సోమవారం ర్యాంకులు ప్రకటించింది. వరుసగా ఆరో ఏడాది కూడా ఐఐటీ మద్రాస్ అత్యుత్తమ విద్యాసంస్థగా టాప్‌లో నిలిచింది. బోధన, సిబ్బంది, సౌకర్యాలు.. ఇలా అన్ని అంశాల్లో ముందు వరుసగా నిలిచింది. ఉత్తమ విద్యాసంస్థల జాబితాలో ఐఐఎస్సీ బెంగళూరుకు మొదటి ర్యాంకు లభించింది. ఈ ఏడాది కొత్తగా స్టేట్ పబ్లిక్ వర్సిటీల విభాగం చేర్చారు. ఈ జాబితాలో ఆంధ్రా వర్సిటీకి ఏడో ర్యాంకు లభించింది. న్యాయ విద్యాలయాల జాబితాలో హైదరాబాద్‌లోని నల్సార్‌కు మూడో ర్యాంకు లభించింది. ఇక, వరుసగా ఆరో ఏడాది కూడా ఐఐటీ మద్రాస్ దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది. 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్- 2024' కింద కేంద్ర విద్యాశాఖ ఈ ర్యాంకులను ప్రకటించింది.

అన్నింటా బెస్ట్ : ఎనిమిది ఐఐటీలు, ఎయిమ్స్ ఢిల్లీ, జేఎన్‌యూలు చోటు దక్కించుకున్నాయి. వరుసగా ఐఐటీ మద్రాస్, ఐఐఎస్సీ బెంగళూరు, ఐఐటీ బెంగళూరు టాప్‌లో నిలిచాయి.

ఇంజనీరింగ్ కాలేజీలు : తొమ్మిది ఐఐటీలను ఎంపిక చేశారు. ఐఐటీ మద్రాస్ (వరుసగా ఇది తొమ్మిదోసారి), ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే వరుసగా మూడు ర్యాంకులు దక్కించుకున్నాయి. ఐఐటీయేతర సంస్థల్లో నిట్, తిరుచిరాపల్లి విద్యాసంస్థలు టాప్ టెన్‌లో నిలిచాయి.

మేనేజ్‌మెంట్ కాలేజీలు : ఐఐఎమ్ అహ్మదాబాద్, ఐఐటీ బెంగళూరు, ఐఐటీ కోజికోడ్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మేనేజ్‌మెంటు కోర్సుల విభాగంలో ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ మొదటి రెండు ర్యాంకులు కైవసం చేసుకున్నాయి.

కాలేజీల కేటగిరీ : ఢిల్లీ యూనివర్సిటీ అనుబంధ హిందూ కాలేజీ, మిరిండా హౌస్ తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. సెయింట్ స్టీఫెన్ కాలేజీకు మూడో ర్యాంకు దక్కింది.

న్యాయ విద్యాలయాలు : నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ-బెంగళూరు, నేషనల్ లా యూనివర్సిటీ-ఢిల్లీ, నల్సార్- హైదరాబాద్‌కు వరుసగా మూడు ర్యాంకులు లభించాయి. ఆర్కిటెక్చర్ ప్లానింగ్‌లో ఐఐటీ రూర్కీ, ఐఐటీ ఖరగ్‌పూర్, నిట్ కాలికట్ వరుసగా మూడు ర్యాంకులు సాధించాయి.

మెడికల్ కాలేజీలు : ఎయిమ్స్-ఢిల్లీకి తొలి ర్యాంకు లభించింది. పీజీఐఎమ్ఈఆర్-చండీగఢ్, సీఎమ్‌సీ- వెల్లూరు మిగతా రెండు స్థానాల్లో నిలిచాయి.

కాల్ సెంటర్ కాదు.. రోడ్ సెంటర్‌కు వస్తారు

» హరీశ్ రావుపై పొన్నం ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కలెక్షన్ సెంటర్లు నడిపిన హరీశ్‌రావు.. ఇప్పుడు కాల్ సెంటర్ల పేరిట హడావుడి చేస్తున్నారని, ప్రజోపయోగ పనులు చేస్తున్న కాంగ్రె‌స్‌ను విమర్శిస్తే త్వరలో రోడ్ సెంటర్‌లో నిలబడాల్సి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు రుణ మాఫీ చేయకుండా నానా తిప్పలు పెట్టిన హరీశ్.. ఇపుడు తమను తప్పుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రుణ మాఫీ కాక, కొత్త రుణాలు పుట్టక వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారిలో ఒక్క కుటుంబాన్నైనా హరీశ్ పరామర్శించారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు రైతు ఆత్మహత్యలపై గగ్గోలు పెడుతున్న హరీశ్.. అప్పట్లోనే ఈ పని చేస్తే బాగుండేదని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట మేరకు తమ ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్డరిచ్చిన బస్సులకు తాము రిబ్బన్లు కట్ చేస్తున్నామంటూ హరీశ్ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని విమర్శించారు. వారి పాలనలో ఒక్క కొత్త బస్సునూ కొనుగోలు చేయలేదన్నారు. కాగా, మునుగోడు నియోజకవర్గంలోని 21 రూట్లలో కొత్తగా బస్సులు నడపాలని మంత్రి పొన్నంను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రాల్లో బస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

అప్పుడు అడ్డుకొని.. ఇప్పుడు రిబ్బన్ కట్ చేస్తారా?

» బీఆర్ఎస్ పాలనలోనే సీతారామ నిర్మాణం పూర్తయింది

» ఆ క్రెడిట్ కొట్టేసేందుకే కాంగ్రెస్ హడావుడి: హరీశ్‌రావు



హైదరాబాద్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ప్రాజెక్టును నిర్మించాలని కేసీఆర్ తలపెట్టిన సమయంలో కోర్టుల్లో కేసులు వేసి కాంగ్రెస్ అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు రిబ్బన్ కట్ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సీతారామలోని 5 ప్యాకేజీలు తమ హయాంలోనే పూర్తయ్యాయని, మరో మూడింటిలో 80శాతం పనులు చేశామని వెల్లడించారు. అన్ని కష్టాలు అధిగమించి బీఆర్ఎస్ హయాంలో నిర్మాణం పూర్తి చేస్తే.. ఆ క్రెడిట్ కొట్టేసేందుకు కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ప్రారంభానికి సన్నాహక సమావేశం పేరిట కాంగ్రెస్ నేతలు హడావుడి చేస్తున్నారని, రోజుకో మంత్రి ప్రాజెక్టు సందర్శనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఆర్డరిచ్చిన బస్సులకు జెండాలు ఊపుతూ, తాము మంజూరు చేసిన పథకాలకు చెక్కులు పంచుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం కాలం గడుపుతోందని ఎద్దేవా చేశారు. కలుషిత ఆహారం కారణంగానే సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నారని, గ్రామాల్లో పారిశుధ్యం కొరవడడంతో డెంగీ ప్రబలుతోందని అన్నారు.



సిరిసిల్లలో తయారవుతున్న జెండాలు

సిరిసిల్లలో 'హర్ ఘర్ తిరంగా' జెండాల తయారీ

» వందలాది మంది మహిళలకు లభిస్తున్న ఉపాధి

» పలు రాష్ట్రాలకు ఇక్కడి నుంచి జెండాల సరఫరా

సిరిసిల్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ జెండాల తయారీతో సిరిసిల్లలో ముందే స్వాతంత్ర్య దినోత్సవ సందడి నెలకొంది. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేందుకు చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం కోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో జాతీయ జెండాల తయారీ జోరుగా సాగుతోంది. ఇక్కడ తయారైన పాలిస్టర్ బట్ట హైదరాబాద్‌లో ప్రాసెసింగ్, జాతీయ జెండా రంగులు అద్దుకుని తిరిగి సిరిసిల్లకు వచ్చాక మహిళలతో జెండాలను కుట్టిస్తున్నారు. దీంతో వందలాది మంది మహిళలకు ఉపాధి లభిస్తోంది. ఒక్కో మహిళ రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదించగలుగుతున్నారు. ఇక సిరిసిల్లలో తయారవుతున్న జెండాలు ఆంధ్రా, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలకు అర్డర్లపై వెళ్తున్నాయి. గత ఆగస్టులో టెస్కో ద్వారా 53 లక్షల మీటర్ల పాలిస్టర్ వస్త్రాన్ని కొని కోటి జెండాలను తయారు చేయించారు. ఇందులో సిరిసిల్లలోనే 75 లక్షల జెండాలు తయారు కాగా గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, వరంగల్‌లో మిగతా జెండాలు తయారయ్యాయి.

గాంధీభవన్‌లో రాజీవ్ జ్యోతియాత్రకు ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ నుంచి ఈ నెల 8న ప్రారంభమైన రాజీవ్‌గాంధీ జ్యోతియాత్ర సోమవారం గాంధీభవన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావ్ తదితరులు యాత్రికులకు ఘనస్వాగతం పలికారు. గాంధీభవన్ నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, నాగ్‌పూర్‌ల మీదుగా కొనసాగనున్న జ్యోతియాత్ర.. ఈ నెల 20న ఢిల్లీలోని రాజీవ్ వీర్‌భూమి వద్దకు చేరుకోనుంది. అక్కడ సోనియా, రాహుల్‌లకు రాజీవ్‌జ్యోతిని యాత్రికుల బృందం అందజేయనుంది.

మధ్యాహ్న భోజనం వికటించి 24మంది విద్యార్థులకు అస్వస్థత

» బీబీపేట పాఠశాలలో ఘటన.. హెడ్మాస్టర్ సస్పెన్షన్

కల్హేర్, ఆగస్టు 12: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం బీబీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం తిన్న గంటన్నర తర్వాత కొందరు విద్యార్థులు కడుపు నొప్పితో విలవిలలాడగా, మరికొందరు వాంతులు చేసుకున్నారు. వారిని ఉపాధ్యాయులు నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేసిన తర్వాత విద్యార్థులు కోలుకోగా వారిని ఇళ్లకు పంపించారు. నాసిరకం భోజనంతో పాటు ఉడకని గుడ్లు పెట్టడం వల్లే ఇలా జరిగి ఉంటుందని వైద్య సిబ్బంది తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకుని ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ఫోన్‌లో విద్యార్థులను పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి శంకర్ ఆస్పతికి వచ్చి విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. ఎంఈవో శంకర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రధానోపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరు తెలిపారు.

జీవో 33తో స్థానికులకూ అనర్హత ముప్పు

» హైకోర్టులో పిటిషన్లపై వాదనలు.. రేపు మళ్లీ విచారణ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జూలై 19న జారీచేసిన జీవో 33ను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు మొదలయ్యాయి. యూజీ- నీట్ రాసిన విద్యార్థులు బసవ శ్రీదత్త శ్రీకాంత్, కల్లూరి నాగనర్సింహ అభిరాం సహా 60 మంది ఈ పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. జీవో 33 ద్వారా అడ్మిషన్స్ రూల్స్‌లోని రూల్ 3 (ఏ)కు సవరణలు తెచ్చారని తెలిపారు. దీంతో తరతరాలు తెలంగాణ స్థానికత కలిగిన వారు సైతం ఒకటి లేదా రెండేళ్ల బయటి రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన స్థానికులు కాకుండా పోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నీట్ పరీక్ష రాయడానికి ముందు ఇంటర్ రెండేళ్లు, తొమ్మిది, పది తరగతులు మొత్తం వరుసగా నాలుగేళ్ల స్థానికంగా తెలంగాణలో చదివి ఉండాలని, నాలుగేళ్లలో ఒక్క ఏడాది బయటి రాష్ట్రాల్లో చదివినా స్థానికుల కిందికి రారని జీవోలో పేర్కొన్నారని తెలిపారు. స్థానికతపై గతేడాది హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా జీవో జారీ చేశారని వివరించారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, కాళోజీ హెల్త్ వర్సిటీ తరఫు న్యాయవాది ఏ ప్రభాకర్‌రావు వాదిస్తూ..ప్రవేశాల దరఖాస్తుల చివరి తేదీని ఈనెల 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణ ఈ నెల 14న చేపడుతామని వెల్లడించింది.

శ్రీశైలం ప్రాజెక్టు.. జలవిద్యుత్తు కోసమే!

బేసిన్ ప్రాజెక్టులకు రక్షణ కల్పించాలి: తెలంగాణ.. బచావత్ ట్రిబ్యునల్ తీర్పును సమీక్షించవద్దు

» పాత వినియోగానికి రక్షణ ఉంది: ఆంధ్రప్రదేశ్

» కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు కౌంటర్ దాఖలు చేసిన రెండు రాష్ట్రాలు

» 15 రోజుల్లోగా రీజాయిండర్లు.. 28, 29న విచారణ



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల పంపిణీ చేపట్టాలంటూ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ వద్ద వాదన వినిపిస్తున్న తెలంగాణ రాష్ట్రం.. మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేసింది. శ్రీశైలంప్రాజెక్టును నిర్మించిందే జలవిద్యుత్తు ఉత్పాదన కోసమని, బచావత్ ట్రిబ్యునల్ కూడా ఆ ఉద్దేశంతోనే ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిందని గుర్తు చేసింది. ఈ ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో పాటు పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు 173.5 టీఎంసీల నీళ్ల అవసరమని పేర్కొంది. కానీ, ఏపీ.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీలను చెన్నై తాగునీటి అవసరాల కోసం జరిగిన ఒప్పందాన్ని ఆధారంగా చేసుకొని తెలుగుగంగ కాలువలను వ్యవసాయ అవసరాల కోసం వాడుకుంటోందని ఆరోపించింది. దీంతోపాటు కృష్ణా జలాలను ఇతర బేసిన్‌లో ఉన్న హంద్రీనీవా కింద 40 టీఎంసీలు, గాలేరు నగరి కింద 38 టీఎంసీలు, వెలిగొండ కింద 43.5 టీఎంసీలను తరలిస్తున్నారని ఆక్షేపించింది. ఈ మేరకు కృష్ణా జలాలను ఏ విధంగా పంచాలనే దానిపై గతంలోనే దాఖలు చేసిన స్టేట్ ఆఫ్ కేస్ (ఎస్‌వోసీ)లో తెలంగాణ వివరించింది. అయితే కృష్ణా జలాలను కొత్తగా పంచడానికి వీల్లేదంటూ ఏపీ కూడా ఎస్‌వోసీ దాఖలు చేసింది. దీనికి తెలంగాణ కౌంటర్ దాఖలు చేయగా.. సోమవారం ఏపీ కూడా కౌంటర్ వేసింది. ఇక ఆయా కౌంటర్‌లపై 15 రోజుల్లోగా రెండు రాష్ట్రాలు రీజాయిండర్లు దాఖలు చేయాల్సి ఉంది.

ఒక్క ఏడాది కోసమే 66:34 నిష్పత్తి..

ఏపీ వాదనను వ్యతిరేకిస్తూ తెలంగాణ దాఖలు చేసిన కౌంటర్‌లో.. రాష్ట్రం ఏర్పడ్డాక ఏడాది కాలానికిగాను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు 66:34 నిష్పత్తితో తాత్కాలిక ప్రాతిపదికన నీటిని పంచుకున్నామని తెలిపింది. అయితే ఆ ఒప్పందం ఒక్క ఏడాదికే పరిమితమని గుర్తు చేసింది. అనంతరం కృష్ణా జలాలను 50:50 శాతం నిష్పత్తితో పంచాలని కోరుతూ 2023 మే 13న కృష్ణా బోర్డుకు లేఖ రాశామని పేర్కొంది. దీంతోపాటు బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టులకు రక్షణ కల్పించాల్సిందిగా ట్రిబ్యునల్‌ను కోరింది. మరోవైపు.. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఇదివరకు ఉన్న వినియోగాన్ని సమీక్షించడానికి వీల్లేదని ఏపీ తెలిపింది. 75 శాతం డిపెండబిలిటీ (నాలుగేళ్లలో కచ్చితంగా మూడేళ్లు వచ్చే వరద ఆధారంగా ప్రామాణికం చేసుకున్నది) ఆధారపు కేటాయింపులను సమీక్షించడానికి వీల్లేదని తెలిపింది. గోదావరి జలాల తరలింపుతో ముడిపడిన ఏ అంశంపై కూడా విచారణ జరిపే అధికారం కృష్ణా ట్రిబ్యునల్‌కు లేదని, దీనిపై కొత్తగా ఏర్పడే గోదావరి ట్రిబ్యునల్ మాత్రమే విచారణ జరపాల్సి ఉంటుందని వివరించింది.

ఒక్క సంవత్సరం కోసమే కాదు..!

కృష్ణా జలాల పంపిణీ కోసం 2015లో జరిగిన ఒప్పందం.. గత పదేళ్లుగా నీటి వినియోగం ఆధారంగా అమలులో ఉందని ఏపీ గుర్తు చేసింది. ఈ ఒప్పందం పరిపాలన సౌలభ్యం కోసం చేసుకున్నది కాదని, దీనికి చట్టబద్ధత ఉందని గుర్తు చేస్తూ.. ఈ విషయంలో తెలంగాణ వాదనను తోసిపుచ్చాలని కోరింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పుపై పునఃసమీక్ష వద్దని, ఆ తీర్పు ప్రకారం తెలంగాణ వినియోగం 298.96 టీఎంసీలు మాత్రమేనని స్పష్టం చేసింది. పాత ప్రాజెక్టులకు 301.54 టీఎంసీల వినియోగం ఉందన్న తెలంగాణ వాదనలో హేతుబద్ధత లేదని తెలిపింది. ఆసిఫ్‌నహర్ ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులూ లేవని పేర్కొంది. కృష్ణా జలాలను ఇతర బేసిన్‌లలో 150 ఏళ్ల కన్నా ముందు నుంచి వినియోగిస్తున్నామని, దీనికే రక్షణ కల్పించాలని కోరింది. రాయలసీమతోపాటు ప్రకాశం తదితర జిల్లాల్లో కరువుపీడిత ప్రాంతాలున్నాయని, రాయలసీమ అవసరాలకు అదనంగా జలాలు అవసరమని తెలిపింది.

గురుకులాలను పట్టించుకునే వారే కరువు

8 నెలల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారు

» ఆయా కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి

» ఇప్పటికీ 500 మంది జ్వరంతో బాధ పడుతున్నారు

» అధ్యయనానికి ఆర్ఎస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో కమిటీ: కేటీఆర్

» సిరిసిల్ల జిల్లాలో విద్యార్థి అనిరుధ్ కుటుంబానికి పరామర్శ



బొప్పాపూర్‌లో విద్యార్థి అనిరుధ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న కేటీఆర్

హైదరాబాద్/సిరిసిల్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో ఎనిమిది నెలలుగా గురుకులాలు, హాస్టళ్లను పట్టించుకునే వారు కరువయ్యారు. 36 మంది విద్యార్థులు చనిపోయారు. ఇప్పటికీ 500 మంది విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీని వేస్తున్నాం. ఆ కమిటీ ఇచ్చే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఎడమల అనిరుధ్ ఇటీవల జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పాము కాటుతో మృతి చెందాడు. ఆ విద్యార్థి కుటుంబాన్ని కేటీఆర్ సోమవారం పరామర్శించారు. అనంతరం బొప్పాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో కల్తీ ఆహారం, పాముకాట్ల కారణంగా విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కలెక్టర్లు, ఐపీఎస్‌లు ఒక్కొక్కరు.. రెండు, మూడు హాస్టళ్లను దత్తత తీసుకునేలా చూడాలని, వారంలో ఒక రోజు అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. తద్వారా ఆహారం విషయంలో సిబ్బంది ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తారని అన్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళనకరం: కేటీఆర్

ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగం విధ్వంసానికి గురైందని, ఈ ఏడాది సాగు విస్తీర్ణం 15.30 లక్షల ఎకరాల మేర తగ్గడం ఆందోళనకరమని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో సాగుకు స్వర్ణయుగమని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా ఎదిగిందని గుర్తు చేశారు. గత ఎనిమిది నెలల్లోనే ఎందుకింత సంక్షోభం ఏర్పడిందో కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని 'ఎక్స్' వేదికగా సోమవారం డిమాండ్ చేశారు. సుంకిశాల వద్ద ప్రమాదం జరిగి పది రోజులైనా చర్యలు ఎందుకు చేపట్టలేదని, దీనిపై స్పందించాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు.

నెగ్గిన అవిశ్వాసం..

నకిరేకల్ మునిసిపల్ చైర్మన్ పదవిని కోల్పోయిన బీఆర్ఎస్

నకిరేకల్, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా నకిరేకల్ మునిసిపాలిటీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ (బీఆర్ఎస్)పై సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మునిసిపాలిటీ పరిధిలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 16 మంది అవిశ్వాస తీర్మానికి మద్దతు తెలపడంతో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పదవిని కోల్పోయింది. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లు హాజరుకాలేదు. 2019లో మునిసిపాలిటీగా ఏర్పడిన నకిరేకల్‌లో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు నలుగురు, కాంగ్రెస్‌కు 16 మంది వార్డు సభ్యులు ఉన్నారు. కొంత కాలంగా చైర్మన్ వార్డుల్లో జరిగే అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, తమకు సమాచారమివ్వడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 22వ తేదీన ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. నల్లగొండ ఆర్డీవో, ప్రొసీడింగ్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో మునిసిపల్ చైర్మన్‌గా ఉన్న రాచకొండ శ్రీనివాస్ గౌడ్ తన పదవిని కోల్పోయారు. బీసీ గౌడ సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గడంతో ఎమ్మెల్యే వేముల వీరేశం అదే సామాజిక వర్గానికి చెందిన చెవుగోని రజితను చైర్మన్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.

9 గ్రామాలను తిరిగి నిజామాబాద్‌లో కలపాలి

» ప్రజాభిప్రాయ సేకరణలో డిమాండ్

కమ్మర్‌పల్లి, ఆగస్టు 12: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని గిరిజన గ్రామం మానాలతో పాటే నూతంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలోని ఎనిమిది తండాలను గతంలో మాదిరిగానే నిజామాబాద్‌లో కలపాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం తొమ్మిది గ్రామాల ప్రజలు, నాయకులు ప్రజాభిప్రాయసేకరణ చేపట్టారు. తమ గ్రామాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉండడంతో అటు ఉద్యోగపరంగా.. ఇటు రాజకీయపరంగా నష్టపోతున్నామని 8 తండాలకు చెందిన ప్రజలు వాపోయారు. తండాలను గ్రామాలుగా మార్చి రాజన్న సిరిసిల్లా జిల్లాలో కలిపారని, కానీ అసెంబ్లీ నియోజకవర్గం బాల్కొండ, పార్లమెంట్ నియోజకవర్గం నిజామాబాద్‌గానే కొనసాగుతున్నాయన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తమ ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అభిప్రాయ సేకరణలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆ రెండింటిని ఒకే జిల్లా చేయాలి!

వరంగల్, హనుమకొండలను కలపాలని డిమాండ్

» కలిపేసి వరంగల్ జిల్లాగా మార్చాలి

» నేడు కాజీపేటలో సదస్సు

» పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలనీ ఆందోళనలు

వరంగల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపేసి.. వరంగల్ జిల్లా పేరుతో ఒకే జిల్లా చేయాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో విభజన ప్రక్రియ శాస్త్రీయంగా జరగలేదనే అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జిల్లాల విభజనపై న్యాయ నిపుణులతో కమిటీ వేస్తామని, కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లాల విభజనను సమీక్షిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాలను వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని చరిత్రకారులు, తెలంగాణ ఉద్యమకారులు అంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం.. చారిత్రక ప్రాధాన్యం ఉన్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించడంపై అప్పట్లోనే తెలంగాణ ఉద్యమకారుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రధానంగా వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా విభజించటంపై ప్రజల్లో నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఫలితంగా గత ప్రభుత్వం 2021 ఆగస్టు 12న వరంగల్ అర్బన్ జిల్లాను హనుమకొండ జిల్లాగా, వరంగల్ రూరల్ జిల్లాను వరంగల్ జిల్లాగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో వరంగల్ మహానగరాన్ని రెండుగా చీల్చి రెండు జిల్లాలకు హెడ్‌క్వార్టర్‌ను చేసింది. వరంగల్ జిల్లా కలెక్టరేట్, ఇతర కార్యాలయాలు కూడా హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఆ కలెక్టరేట్ పక్కనే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లా కార్యాలయాలు పక్కపక్కనే హనుమకొండలోనే ఉండటంతో రెండు జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు ఒరిగిందేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పైగా రెండు జిల్లాలకు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లతో పాటు ప్రతి శాఖకు సంబంధించి ఇద్దరేసి చొప్పున అధికారులుంటారని.. వారికి జీత భత్యా ల రూపంలో ఇది ప్రభుత్వానికి భారం కాదా? అనే వాదనను తెరపైకి తెస్తున్నారు. వరంగల్, హనుమకొండలను వేర్వేరు జిల్లాలుగా చేయడాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలతో పాటు బీఆర్ఎస్‌లోని ఓ వర్గం వ్యతిరేకిస్తోంది. జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా రెండు జిల్లాలను వరంగల్ జిల్లాగా ఉమ్మడిగా ఉంచాలనే అంశానికి మద్దతిస్తున్నట్లు సమాచారం. కాగా గత ప్రభుత్వం హయాంలో జరిగిన జిల్లాల విభజను సమీక్షిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ పేరుతో ఒకే జిల్లాగా చేస్తారని ప్రజలు భావించారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎటూ తేల్చకపోవటంతో మరోసారి హనుమకొండ, వరంగల్ జిల్లాల ఏకీకరణపై ఉద్యమాలకు శ్రీకారం చుట్టుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు, తెలంగాణవాదులు, వివిధ సంఘాల నేతృత్వంలో మంగళవారం కాజీపేటలో వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై సదస్సును ఏర్పాటు చేశారు. ఇక తెలంగాణ సాయుధ పోరాటం తో మరో జలియన్‌వాలాబాగ్‌గా పేరుగాంచిన పరకాల కేంద్రంగా అమరువీరుల జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్ తీవ్రమవుతోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భళా పారిస్!

ఫ్యాషన్ నగరి పారిస్ ఆతిథ్యమిచ్చిన ఒలింపిక్ క్రీడలు పరిసమాప్తమయ్యాయి, విజయవంతమైనాయి. వ్యయనియంత్రణ, భద్రత, మౌలిక సదుపాయాలవంటి అంశాల్లో తాజా క్రీడలు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాయి. రాబోయే రోజుల్లో ఒలింపిక్స్ నిర్వహించబోయే దేశాలకు ఇవి దిశానిర్దేశం చేస్తాయి. కొత్త స్టేడియాలు నిర్మించడం, ఆర్భాటపు ఖర్చులు చేయడం వంటి విషయాల్లో పారిస్ జాగరూకతతో వ్యవహరించింది. ఒలింపిక్స్ నిర్వహించిన దేశాలు ఆ తరువాత అప్పులకుప్పల్లా మారడం గతంలో చూశాం. ఈ తరహా అనుభవాలతో పారిస్ ముందు చూపు ప్రదర్శించింది.

ఇక పతకాల పట్టికలో అగ్రస్థానం కోసం అమెరికాతో చైనా హోరాహోరీగా తలపడింది. ఈ పోరాటం నువ్వానేనా అన్నట్టుగా చివరిదాకా సాగింది. ఆఖరి ఈవెంట్‌గా జరిగిన మహిళల బాస్కెట్‌బాల్ మ్యాచ్‌లో పసిడి పతకాన్ని గెలవడం ద్వారా అమెరికా ఊపిరిపీల్చుకుంది. ఇరు దేశాల స్వర్ణ పతకాలు 40–40తో సమమైనా రజతాలు, మొత్తం మెడల్స్‌లో అమెరికాదే పైచేయి. 126 పతకాలతో అది అగ్రస్థానంలో ఉంటే, చైనా 91 మెడల్స్‌తో రెండో స్థానానికి పరిమితమైంది. జపాన్, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో కొలువుదీరాయి. ఆతిథ్య ఫ్రాన్స్ అద్భుత ఆటతీరుతో ఐదో స్థానం దక్కించుకుంది. ఇక తాజా క్రీడల్లో పలువురు ఆటగాళ్లు అమేయమైన ఆటతీరుతో అందరిదృష్టినీ ఆకర్షించారు. అమెరికా స్టార్లు నోవా లైల్స్, సిమోన్ బైల్స్, కేటీ లెడెకీ, స్వీడన్‌కు చెందిన డుప్లాంటిస్, కెన్యా రన్నర్ కిప్యొగె, ఫ్రాన్స్‌కు చెందిన లియాన్ మర్చండ్ తదితరులు పారిస్‌ను ఉర్రూతలూగించారు.

పతకాల పట్టికలో భారత జట్టు ఏకంగా 71వ స్థానంలో నిలవడం అభిమానుల్ని తీవ్రంగా నిరాశపరచింది. 117 మంది సభ్యుల భారీ బృందం కనీసం రెండంకెల్లో పతకాలు తేకపోదా అని ఆశించినవారిని టీమిండియా ఉసూరుమనిపించింది. ఖాయంగా పతకం కొట్టేస్తారని భావించిన ఆటగాళ్లు రిక్తహస్తాలతో వెనుదిరగడం క్రీడాభిమానికి మింగుడుపడని విషయం. నిస్సందేహంగా పతకాలు సాధిస్తారనుకున్న బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గోహైన్, బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ జోడీ, వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను తీవ్రంగా నిరాశపరిచారు. గత క్రీడల చాంపియన్ నీరజ్ చోప్రాకు మళ్లీ పసిడి పతకం ఖాయమని భావించారంతా. అయితే పాకిస్థాన్ త్రోయర్ అర్షద్ నదీమ్ నమ్మశక్యంకాని త్రో వేయడం నీరజ్ ఆశల్ని వమ్ముచేసింది. ఇక రెజ్లర్ వినేష్ ఫొగట్ సంగతి సరేసరి. 100 గ్రాముల అదనపు బరువు ఒక పతకాన్ని దూరం చేసింది. ఆ బౌట్‌లో ఆమె తలపడి నెగ్గివుంటే భారత్‌కు స్వర్ణం వచ్చిపడేది. ఇలా అనూహ్య పరాజయాలతో పతకాలు చేజార్చుకున్న వారి సంగతి అది. నాణేనికి మరోవైపు–స్వప్నిల్ కుసాలే వంటి ఆటగాళ్లు పతకాలతో అబ్బురపరచారు. మనుభాకర్ వ్యక్తిగతంగా ఒకటి, సరబ్‌జ్యోత్‌తో కలిసి మరో కాంస్యం సాధించగా, కుస్తీలో అమన్ సెహ్రావత్, పురుషుల హాకీ జట్టు కూడా పోడియంపై సగర్వంగా నిలిచారు. ఇక ఈసారి తెలుగు అథ్లెట్లు అంచనాలను అందుకోలేకపోయారు.


ఈ ఒలింపిక్స్ సన్నాహాల కోసం భారత ప్రభుత్వం సుమారు 470 కోట్ల రూపాయలు ఖర్చుచేసింది. అయినా ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడం బాధాకరం. మొత్తం 92 జట్లలో మనం 71వ స్థానంలో ఉన్నాం. 2008 నుంచి జరిగిన ఐదు ఒలింపిక్స్‌లోనూ మన జట్టు ఇంతగా దిగజారింది లేదు. 2008లో 50, 2012లో 55, 2016లో 67, 2020లో 48వ స్థానంతో భారత్ పర్వాలేదనిపించింది. మన ఆటగాళ్ల ప్రదర్శన ఎంతోబాగున్నా పతకాలు రాకపోవడం బాధాకరమన్న వాదన ఒకటి వినిపిస్తోంది. ఒలింపిక్ పోటీల అంతిమలక్ష్యం పతకాల సాధన తప్ప మరోటికాదు. అలాంటప్పుడు ఎంత అద్భుతంగా ఆడినా పతకం రాకపోతే ఏం ప్రయోజనం? మనవాళ్ల శ్రమను తక్కువ చేయడం కాదు కానీ, అద్భుత ఆటకు–పతక సాధనకు మధ్య ఉన్న సన్నటిగీతను దాటగలిగితే కనీసం మరో అరడజను పతకాలు మనకు దఖలుపడేవి. ఏదేమైనా పారిస్ క్రీడల్లో భారత ఆటగాళ్ల ప్రదర్శన మాత్రం నిరుత్సాహకరమే. మిగతా ప్రపంచంతో పోలిస్తే మన క్రీడారంగం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందన్న వాస్తవం పారిస్ క్రీడల ద్వారా అవగతమవుతోంది. మరో నాలుగేళ్ల తర్వాత జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లోనైనా భారత్ రెండంకెల స్కోరు సాధిస్తుందని ఆశిద్దాం.

నా నల్గొండను బంగారు కొండ చేయగల టన్నెల్!

నల్గొండతో నాది పేగుబంధం, ప్రేమబంధం. నేను ఎక్కడున్నా నల్గొండ పేరు వినబడితే, నల్గొండ మనిషి కనబడితే ఎమోషన్ అయిత. నల్గొండ క్లాక్ టవర్ నుంచి స్టాట్యూ ఆఫ్ లిబర్టీ దాక ఒకటే ఫీలింగ్. అందుకే నాకు పదవులకన్నా నల్గొండ ప్రజలు ముఖ్యం. అందరికీ రాజకీయం కావాలి, గెలుపోటములు కావాలి. కానీ, నాకు నల్గొండ కావాలి, నా నల్గొండ జనం కావాలి. నా ముప్పై యేండ్ల ప్రజాజీవితంలో ఏనాడు నల్గొండ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయలేదు. అది నా రక్తంలోనే లేదు.

ఆనాడు టీడీపీ ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు కట్టి నల్గొండను ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తే తీవ్రంగా ప్రతిఘటించిన. కేసులు పెడితే జైలుకు పోయిన. కోర్టు మెట్లెక్కిన. ఆనాడు టీడీపీ ప్రభుత్వం నల్గొండ ప్రజల ఉసురుపోసుకుంటున్నదని భావించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడం కోసం అహర్నిశలు శ్రమించిన. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన. కానీ పదవుల కోసం ఏనాడు వెంపర్లాడలేదు. పైపెచ్చు చంద్రబాబు ప్రారంభించిన పులిచింతల ప్రాజెక్టును ఆనాడు స్వర్గీయ డా.వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రారంభించేందుకు పూనుకుంటే, ముఖ్యమంత్రి అనికూడా చూడకుండా, నా నల్గొండకు నష్టం జరుగుతుందని ప్రశ్నించిన. కొందరు ముఖ్యమంత్రిని అలా ఎదురించి మాట్లాడుతారా... అంటూ దీర్ఘాలు తీసినా వెనకడుగు వేయలేదు. వైయస్ఆర్‌ను పట్టుకొని మీరు పులిచింతల కడితే నా నల్గొండకు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (యస్.యల్.బీ.సీ) టన్నెల్ తవ్వి నీళ్లు ఇవ్వాలని నిలదీసిన. "వెంకట్ రెడ్డి గారు అది సాధ్యమయ్యే పనికాదు. ఇంకా ఏదైనా అడిగితే చేస్తా," అని చెప్పగానే నా రాజీనామాను ఆమోదించమని అడిగిన. అప్పుడు వైయస్ఆర్– "వెంకట్ రెడ్డి మొండిఘటం ఉన్నడు. నీటిపారుదల ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేయండి" అని సీఎంఓ అధికారులకు ఆదేశాలిచ్చారు. మరుసటి సమావేశంలో ప్రాజెక్టుకు ఆమోదం తెలపడమే కాదు, 11.08.2005 రోజున రూ.2,292 కోట్లు మంజూరీ చేస్తూ జీవో ఎం.ఎస్ నెం.147 ఇచ్చారు.

ఇది నా గురించి నేను చెప్పుకుంటున్న విషయం కాదు. దశాబ్దాలుగా ఫ్లోరైడ్ రక్కసికి బలవుతున్న నా తోటి నల్గొండ బిడ్డలను జీవచ్ఛవాలుగా చూడలేక బ్రతికించుకోవాలని ప్రారంభమైన నా రాజకీయ ఆశయానికి దట్టీ కట్టిన సందర్భం. చేండ్లన్నీ బీళ్లుగా మారి, ఉపాధి లేక ఊపిరి విడుస్తున్న మూగజీవాల బాధ చూడలేక అందుకున్న పోరాటానికి దక్కిన ప్రతిఫలం. నేను రాజకీయ మార్గం ఎంచుకోవడానికి ప్రధాన కారణం నా జిల్లా ప్రజలను కరువు నుంచి, ఫ్లోరైడ్ నుంచి విముక్తి లభించాలనే. అందుకే, ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైయస్. రాజశేఖర్ రెడ్డి ఎస్.ఎల్.బీ.సీ జీవో విడుదల చేయాలని అధికారులను ఆదేశించినప్పుడు నేను పడిన సంతృప్తి నా గుండెల్లో ఇంకా తడిగానే ఉంది. అయితే దేవుడు వరమిస్తే కాలం శాపం పెట్టినట్టు వైయస్ మరణం, ఆ తర్వాత వచ్చిన కిరణ్ కుమార్ రెడ్డితో, తెలంగాణ కోసం పోరాట వైరం, స్వరాష్ట్రం కోసం మంత్రి పదవికి రాజీనామా చేయడం వల్ల ప్రాజెక్టు ఇబ్బందుల్లో పడింది. ఆ సంగతి అటుంచితే పోరాడి సాధించుకున్న రాష్ట్రంలోనైనా నా ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పూర్తవుతుందనుకుంటే నా మీద రాజకీయ కక్షతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో పట్టుమని పది రూపాయలు ఇవ్వకుండా టన్నెల్ పనులను పడావు పెట్టారు. నల్గొండ నుంచి అసెంబ్లీ దాక నేను అడగని వేదిక లేదు, చెయ్యని పోరాటం లేదు. రాజకీయంగా ఎన్నో పదవులు పొందినా, అసెంబ్లీ నుంచి పార్లమెంట్ దాక ఎన్నో కమిటీల్లో మెంబర్‌గా ఉన్నా ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పూర్తి కాలేని బాధ మాత్రం నన్ను నిత్యం వేధించేది.



ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పూర్తయితే 3 లక్షల ఎకరాలు, ఉదయ సముద్రం ద్వారా మరో లక్ష ఎకరాలు మొత్తంగా 4 లక్షల ఎకరాల భూములకు ఎలాంటి పంపింగ్ లేకుండా కేవలం గ్రావిటీ ద్వారా నీటి సదుపాయం కలుగుతుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత నా నల్గొండ భూములు కోనసీమను మరిపిస్తయి.

మంచి తలిస్తే భగవంతుడే పూనుకుంటాడనే పెద్దల మాట నా విషయంలో నిజం అయ్యింది. అనుకున్నట్టుగానే డిసెంబర్ 2023లో తెలంగాణ ప్రజలు తిరుగులేని మెజార్టీతో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నా గుండెను తొలుస్తున్న ఎస్.ఎల్.బీ.సీ పెండింగ్ గాయానికి ఎన్నికల ఫలితాలు చికిత్స చేసినట్టే అనిపించింది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు "వెంకన్నా! సోనియమ్మ, రాహుల్‌గాంధీ గారు నీకు మంత్రి పదవి ఇవ్వమన్నరు నీకు నచ్చిన రోడ్లు భవనాల శాఖతో పాటు సినిమాటోగ్రఫీ శాఖ ఇస్తున్నా" అని చెప్పగానే వారికి ఒకటే విజ్ఞప్తి చేసిన, "నాకు మంత్రిపదవి కన్నా నా నల్గొండ బిడ్డల గుండల్లో నన్ను నిలబెట్టే ఎస్.ఎల్.బీ.సీ ప్రాజెక్టు కావాలి" అని అడిగిన. యువకుడైనా, మాజీ ముఖ్యమంత్రి వైయస్.ఆర్ లా హృదయం కలిగిన నాయకుడు రేవంత్‌రెడ్డి గారు. ఆయన ఒక్కటే మాట చెప్పిండు, "నీ ఎస్.ఎల్.బీ.సీ ప్రాజెక్టు పూర్తయ్యేంతవరకు నీ వెనక ప్రభుత్వం ఉంటుంది," అని భరోసా ఇచ్చారు. అనడమే కాదు; పనులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా గ్రీన్ ఛానెల్‌కు ఆదేశాలు ఇచ్చారు. అంతేకాదు– ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై రివ్యూలు నిర్వహించారు. నేను కూడా నీతోవచ్చి ఎస్.ఎల్.బీ.సీ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తానని చెప్పారు. చెప్పడమే కాదు సొరంగం పనులు ఆగిపోవడానికి ప్రధాన కారణమైన బేరింగ్, రింగ్ గేర్, అడాప్టర్ అమెరికాలో దొరుకుతుందంటే– స్వయంగా వారి అమెరికా టూర్ డెలిగేషన్‌లో నన్ను రమ్మని అమెరికాకు తీసుకు వచ్చారు.

నేను ఎన్నో మీటింగుల్లో పాల్గొన్నా, ఎందరో మహానాయకులతో వేదికలను పంచుకున్నా, ఎన్నో అంశాలపై అసెంబ్లీలో, పార్లమెంట్‌లో నా గళం వినిపించాను. కానీ ఇవ్వాల ఒహాయోలో రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ కంపెనీ సీఈఓ లాక్ హోమ్‌తో జరిగిన ఈ సమావేశం నా జీవితంలో మరిచిపోలేనిది. రాబిన్స్ కంపెనీ ఇవ్వాళ్టిది కాదు. 1952లో అమెరికాలో ఓహే డ్యాం ప్రాజెక్టు టన్నెల్ నిర్మించేందుకు తొలిసారి మెషినరీ తయారు చేసింది. 1956లో ప్రపంచంలో మొట్టమొదటిసారి రాక్‌సాల్ట్‌తో కూడిన టన్నెళ్లను తవ్వగలిగే మిషనరీని తయారు చేశారు. 1964లో ప్రపంచంలో తొలిసారి కంప్రెస్డ్ ఎయిర్ టన్నెలింగ్ మెషినరీని తయారు చేసి ఫ్రాన్స్‌లో 2.9 కిలోమీటర్ల భారీ టన్నెల్‌ను నిర్మించారు. 1972లో డబుల్ షీల్డ్ టన్నెల్ బోరింగ్ మిషన్ తయారు చేసి ఇటలీలోని ఓర్చెల్లా టన్నెళ్లలో మట్టి రాలిపడి చనిపోతున్న కార్మికుల మరణాలకు పరిష్కారం చూపించడంతో పాటు వేగంగా లైనింగ్ నిర్మించేలా చేశారు. అమెరికాలో ఇరవయ్యే శతాబ్దపు అతి పెద్ద స్వచ్ఛమైన నీటి పర్యావరణ ప్రాజెక్టు 'చికాగో టన్నెల్ మరియు రిజర్వాయర్ ప్లాన్ (టార్ప్)' కోసం 20 ఏళ్లపాటు జరిగిన తవ్వకాల్లో రాబిన్స్ ప్రధాన భూమిక పోషించింది. ఇవన్నీ ఒకెత్తయితే మన దేశంలోని జమ్మూ & కశ్మీర్‌లో



1963లోనే 11.20 మీటర్ల డయామీటర్ మెయిన్ బీమ్‌తో అప్పటికి ప్రపంచంలోనే అతిపెద్ద టన్నెల్ బోరింగ్ మిషన్‌తో బొగ్గు పరిశ్రమలో కన్వేయర్ సిస్టం ద్వారా పనులు చేసి మన దేశ ప్రజల మనసు గెలుచుకుంది. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే– ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ కోసం నేను ఎంత పరిశోధించి ఈ నిర్ణయం తీసుకున్నానో చెప్పడం కోసం. ఇది నా ఆశయం మాత్రమే కాదు, నా నల్గొండ బిడ్డల మోముల్లో చిరునవ్వులు చూడలనే తపన. కరెంటు లేకుండా, బోర్లు లేకుండా, గట్టు మలుపుకుంటే పొలంలో నీరు పారితే చూడాలనే ఆశ. దేశంలో ఫ్లోరైడ్ ప్రాంతాల మ్యాప్‌లో నా నల్గొండ జిల్లా కనిపించకూడదనే పట్టుదల నన్ను హైదరాబాద్ నుంచి ఇవ్వాల ఒహాయోలో లాక్ హోమ్‌తో సమావేశం జరిగేదాకా తీసుకువచ్చింది. నా దశాబ్దాల ఎస్.ఎల్.బీ.సీ పోరాటం గురించి చెప్పగానే లాక్ హోమ్ ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. "మీ ఆశయం గొప్పది.. అది లక్షల మంది రైతుల జీవితాలను బాగు చేస్తుంది. మీ వెంట మేముంటాం," అన్నారు.

ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పూర్తయితే 3 లక్షల ఎకరాలు, ఉదయ సముద్రం ద్వారా మరో లక్ష ఎకరాలు మొత్తంగా 4 లక్షల ఎకరాల భూములకు ఎలాంటి పంపింగ్ లేకుండా కేవలం గ్రావిటీ ద్వారా నీటి సదుపాయం కలుగుతుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత నా నల్గొండ భూములు కోనసీమను మరిపిస్తయి. ప్రతీ ఇంటి ముందట ధాన్యపు రాసులతో ఇండ్లన్నీ నిండుకుండలైతయి. పండిన పంటలతో నా రైతన్నల అప్పుల బాధలు ఆవిరి అయిపోతయి. బీడు భూములు సాగుబాట పడతయి. దశాబ్దాలుగా పిచ్చి మొక్కలతో నిండిన కాలువలు జలరాశులను నింపుకొని చేపపిల్లలకు బ్రతుకునిస్తయి. భయపెట్టిన ఫ్లోరైడ్ రక్కసి జలజలా పారే నీటి సవ్వడి శబ్దానికి భయపడి పారిపోతది. వైకల్యం చరిత్ర అయితది. కరువు కాలగర్భంలో కలిసిపోతది. నల్గొండ బంగారు కొండ అయితది. నేను చూడాలనుకుంటున్న నా నల్గొండ.. మరో రెండేళ్లలో సాక్షాత్కారం కాబోతుంది.

లాక్ హోమ్‌తో జరిగిన సమావేశం విజయవంతం అవడం, మరికొద్ది రోజుల్లో టన్నెల్ బోరింగ్ మిషన్ బేరింగ్ రానుండటం, పనులు పట్టాలెక్కడం సంతోషం కలిగిస్తుంది. ఇన్ని రోజుల నా ప్రయాణంలో నన్ను నమ్మిన నల్గొండ ప్రజలకు శిరస్సువంచి నమస్కరిస్తూ, ఆ యాదగిరి నరసింహ స్వామి ఆశీస్సులతో ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పూర్తయి, కాకతీయులు తవ్వించిన ఉదయసముద్రం నిండి ఉరకలెత్తాలి. చెరువులు కుంటలు నిండాలి, పంటలు పండాలి, రైతన్నల గుండెల నిండా సంతోషం ఉప్పొంగాలి!

■ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

(అమెరికాలోని ఒహాయోలో ఉన్న రాబిన్స్ కంపెనీ కార్యాలయంలో సీఈఓ లాక్ హోమ్‌తో సమావేశానంతరం రాసిన వ్యాసం)


'రాజ్యాంగం పూతల' మీద 'దాడి' అవసరమే!

"అందరూ రాజ్యాంగ రక్షకులే! కానీ..." అనే నా వ్యాసం (జూలై 7) మీద, 'బడుగు భాస్కర్ జోగేష్' రాసిన 'రాజ్యాంగంపై 'కుడి ఎడమల' దాడి!'కి (జూలై 26) నా జవాబు ఇది.

(1) నేను "శ్రామిక ప్రజల ప్రయోజనాల వంకన" ఆ వ్యాసం రాసినట్టు జోగేష్ తేల్చారు. 'వంక' పెట్టుకుని రాసినా, 'ముసుగు' తగిలించుకుని రాసినా, రాజ్యాంగంలో వున్న సూత్రాలలోనే వున్న వర్గ వైరుధ్యాల్ని అవతలి వ్యక్తి ఎత్తి చూపినప్పుడు, ఆ విమర్శని అంగీకరించనివారు, ఆ సూత్రాలు ఎలా సరైనవో చెప్పాలి. అంతేగానీ, అవతలి వ్యక్తి 'కుట్రలు' చేసినట్టు ఆరోపించడం జవాబు అవ్వదు.

(2) నేను నా వ్యాసంలో ఎక్కడా 'అంబేడ్కర్' అన్న పేరే ప్రస్తావించలేదు. 'రాజ్యాంగ రచయితలు' అని బహువచనంతోనే అన్నాను. జోగేషేమో, అంబేడ్కర్ పేరుని నాలుగుసార్లు రాసి, "బాపూజీ కేవలం రాజ్యాంగ రచయితపైనే దోషమంతా నెట్టే పనికి పూనుకున్నారు" అని అంటున్నారు! అంబేడ్కర్ పేరుని నేను ఒక్కసారి కూడా ఎత్తనప్పుడు, రాజ్యాంగ రచనలో, తన పాత్ర గురించి, అంబేడ్కర్ స్వయంగా చెప్పిన విషయాల సారాంశాన్ని ఇక్కడ ప్రస్తావించడం అవసరం. (అంబేడ్కర్ రచనలు, 13, 15 సంపుటాల నించీ.)

అంబేడ్కర్ : "రాజ్యాంగం డ్రాఫ్టుని ఎంతో కష్టపడి తయారుచేసిన" బి.ఎన్.రావుకీ, ఎస్.ఎన్. ముఖర్జీకీ, వారి ఆఫీసు సిబ్బందికీ కృతజ్ఞతలు. అలా తయారైన డ్రాఫ్టుని, ఏడుగురు సభ్యుల కమిటీ పరిశీలించింది. కమిటీ చేసిన పని ఏమిటంటే, "అసెంబ్లీ కార్యాలయం తయారు చేసిన రాజ్యాంగం డ్రాఫ్టుని పరిశీలించడమూ, అవసరమైన మార్పులు సూచించడమూనూ" (అంబేడ్కర్ రచనలు, సంపుటి-13, పేజీ-29). "నన్ను అందరూ రాజ్యాంగాన్ని తయారు చేసినవాడిగా (మేకర్ ఆఫ్ ది కాన్‌స్టిట్యూషన్) అంటారు. నా జవాబు ఏమిటంటే, నేను ఒక కిరాయి మనిషిగా (హాక్) ఉండినాను. నన్ను ఏమి చెయ్యమంటే అది చేశాను. నా ఇష్టానికి వ్యతిరేకంగా చాలా చేశాను." (సంపుటి-15, పేజీ-860).



నేను చేసింది కుట్ర కాదు. శ్రామికవర్గ ప్రజల (ప్రత్యేకించి ఖైర్లాంజీ దళిత బాధితుల) ప్రయోజనాలకి వ్యతిరేకమైన 75 ఏళ్ళ వయసున్న రాజ్యాంగం మీద, 75 ఏళ్ళ వయసున్న పౌరుడిగా నేను చేసిన విమర్శే 'దాడి' అయితే, 'రాజ్యాంగం పూతల' మీద ఆ దాడి అత్యవసరమే!

(3) 'భూమినీ, ఇతర కీలక పరిశ్రమలనీ జాతీయం చేయాలని' అంబేడ్కర్ కోరుకున్నారని జోగేష్ వాదన. అంబేడ్కర్ వ్యక్తిగత అభిప్రాయాలను నేను ప్రస్తావించనే లేదు. అలాంటప్పుడు, నేనేదో అన్యాయంగా అంబేడ్కర్‌ని విమర్శించినట్టు జోగేష్ రాయడం అసందర్భం. దానికి నా జవాబు ఏమిటంటే, అంబేడ్కర్ గారి కోరిక అదే అయితే, "మొత్తం ప్రైవేటు ఆస్తిని నష్టపరిహారాలు లేకుండానే జాతీయం చెయ్యడానికి ఈ రాజ్యాంగం వీలు నివ్వదనీ" అందుకే 'సోషలిస్టులు, ఈ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నారు' అనీ, అంబేడ్కర్, సోషలిస్టుల్ని ఎందుకు విమర్శించారు? (సంపుటి-13, పేజీ-1210).

(4) ఆస్తి హక్కుకి సంబంధించిన "ఆర్టికల్ 31 పరమ వికృతమైన అంశం. దాని వంక చూడడమే నాకు పరమ అసహ్యం" అని అంబేడ్కర్ తన ఆవేదనని 1955 మార్చి 19న ప్రసంగంలో వ్యక్తం చేశారని జోగేష్ వివరణ. మరి, ఆ ఆర్టికల్‌ని చేర్చినది 1949లో గదా? అప్పుడు నెహ్రూ మంత్రివర్గంలో అంబేడ్కర్ న్యాయశాఖా మంత్రిగా ఉన్నారు గదా? ఆయనకి ఆ ఆర్టికల్ మీద అంత 'పరమ అసహ్యం' ఉంటే, మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి రావాలి గదా? రాజీనామా చేయడానికి 1951 సెప్టెంబరు 27 దాకా ఆగడమా?

(5) నా వ్యాసంలో, రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్ర గురించి ఒక్క మాటంటే ఒక్క మాట రాయకపోయినా, నేను కుట్రపూరితంగా ఆ వ్యాసం రాశానని ఆరోపిస్తున్నారు జోగేష్ ఇలా: "రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రనూ, రాజ్యాంగ విశ్వసనీయతనూ ఏకకాలంలో దెబ్బతీయటం... బాపూజీ ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది!" అని నా విమర్శని కుట్రలాగా చిత్రించారు జోగేష్! నా విమర్శకు ప్రేరణ, ఆంధ్రజ్యోతిలో, గుంటూరు ఏసుపాదం అనే కవి రాసిన 'ఖైర్లాంజీ' అనే దీర్ఘ కవిత. ఖైర్లాంజీ అనే గ్రామంలో, ఆ గ్రామంలోని కొందరు ఓబీసీలు, ఒక దళిత కుటుంబంలోని తల్లీ కూతుళ్ళను అతి దారుణంగా అత్యాచారానికి గురిచేసి, కొడుకుల్ని హింసించి, అందరినీ అతి క్రూరంగా హత్య చేసిన సందర్భంలో రాసిన కవిత అది. ఆ కవితలో, ఆ కవి ఇలా అంటాడు: "రాజ్యాంగం పూతలకు, రాకాసి పుండ్లు మానవని తెలుసు/ పునాదిలేని పునరుత్థానాలు పచ్చి అబద్ధాలని తెలుసు/ తెలిసి తెలిసీ, మనుధర్మాన్ని ప్రశ్నిస్తూ/ మనువాదులతో మంతనాలు!... రిజర్వేషన్ల పేర, వనరులన్నీ నరాధములకే వదిలి/ జోలె మాత్రం మా మెడలకు తొడిగి/ నిత్య పరాధీనత్వంలో/ మమల్నిలా పాతరేసిపోవడాలు/ సారీ అంబేడ్కర్/ యూ ఆర్ ఎ ఫెయిల్యూర్!" – ఇదీ దళిత సామాజిక నేపథ్యం నించీ వచ్చిన ఆ కవి రాసినది!

(6) "ఈ కుట్రలను గ్రహించలేని దశను భారతీయ దళిత, పౌరసమాజం ఎప్పుడో దాటిపోయిందని వ్యాస రచయిత గ్రహించాలి!" అని జోగేష్ నాకు హెచ్చరిక చేశారు. దళిత సమాజానికంతా తానే ప్రతినిధిగా చెప్పుకుంటున్నారు జోగేష్! కానీ దళిత మేధావులలో, నాయకులలో అనేకులు ఈ నాడు, పాలకవర్గ పార్టీల అనుచరులుగానే మసలుతున్నారు. అలా లేని వారు చాలా అరుదు. అలాంటి వారి గురించి, ఏసుపాదం కవితలో ఇలా ఉంది: "ఎటు చూసినా/ దళిత దళారీ/ దళిత బూర్జువా/ పీడిత జన విమోచనకు వీళ్లా సారథులు/ వారసులు?!"

ఇంతకీ నేను చేసింది కుట్ర కాదు. శ్రామికవర్గ ప్రజల (ప్రత్యేకించి ఖైర్లాంజీ దళిత బాధితుల) ప్రయోజనాలకి వ్యతిరేకమైన 75 ఏళ్ళ వయసున్న రాజ్యాంగం మీద, 75 ఏళ్ళ వయసున్న పౌరుడిగా నేను చేసిన విమర్శే 'దాడి' అయితే, 'రాజ్యాంగం పూతల' మీద ఆ దాడి అత్యవసరమే!

○ బి.ఆర్. బాపూజీ

ఆ కళాశాలల్లోనే ఉపాధ్యాయులు శూన్యం!

ఉపాధ్యాయుడిని తయారుచేసే విద్యాకేంద్రాలు డైట్, బి.ఎడ్, ఐఏఎస్ఈ కళాశాలలు. తెలంగాణలో ఈ కళాశాలల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. రాష్ట్రంలో పది ప్రభుత్వ డైట్ కళాశాలలున్నాయి. వీటిలో ప్రతీ కళాశాలకు పద్దెనిమిది మంది సగటున ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ఒక్క ఆదిలాబాద్ డైట్ కాలేజీలో ఇద్దరు అధ్యాపకులు మాత్రమే, అదీ డిప్యుటేషన్‌లో ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఉన్న మిగతా అన్ని డైట్ కాలేజీలలో వందకు వంద శాతం ఉపాధ్యాయులు లేరు. వీటితో పాటు వరంగల్, మహబూబ్‌నగర్, నాగార్జునసాగర్ ప్రభుత్వ బీఈడీ కళాశాలలు(కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్–సీటీఈ), హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ ఇన్ ఎడ్యుకేషన్(ఐఏఎస్ఈ–ప్రభుత్వ ఎంఈడీ కళాశాల)లలో నూరు శాతం అధ్యాపకులు లేకపోవడం శోచనీయమైన విషయం. అయినా వీటిలో ప్రతీ సంవత్సరం వంద శాతం విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారు, ఉత్తీర్ణత సాధిస్తున్నారు, అంటే వాటిలో తయారవుతున్న విద్యార్థి ఉపాధ్యాయుల ప్రామాణికత ఎంతో మనం అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో ఏకీకృత సర్వీస్ నిబంధనల కేసు గత దశాబ్దన్నర కాలంగా ఎటూ తేలకపోవడంతో రాష్ట్రంలోని ఈ కళాశాలల్లో పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రత్యక్ష నియామకాల ద్వారా డైట్ కాలేజీలలో 23 సీనియర్ అధ్యాపకులు, 65 అధ్యాపకుల ఖాళీలు, ఎస్సీఈఆర్టీ/సీటీఈ/ఐఏఎస్ఈలలో మరో 22 పోస్టులు కలిపి మొత్తం 110 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. వీటికి 2022 నవంబరులో గత ప్రభుత్వం ఆర్థిక శాఖ అనుమతి కూడా ఇచ్చింది. అయినా ఇప్పటివరకు నోటిఫికేషన్ వెలువడలేదు. వీటితో పాటు ఎల్పీసెట్ (టిపిటి, హెచ్‌పిటి) కూడా దశాబ్దకాలంగా వెలువడలేదు.

గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రం విద్యలో దేశంలోనే అట్టడుగు స్థానానికి చేరింది. విద్యా వ్యవస్థలో ఉద్యోగాలను భర్తీ చేయడం, వసతులు కల్పించడం, నాణ్యతను పాటించడం వంటివి గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. కనీసం విద్యా శాఖపై వాస్తవమైన సమీక్షలు జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా ఏర్పడింది. విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతోంది. అందుకే విద్యా వ్యవస్థకు మూలస్తంభాలైన ఉపాధ్యాయులను తయారుచేసే ఉపాధ్యాయ విద్యను బలోపేతం చేయాలని మేధావులు కోరుతున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఈ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ సమాజం కోరుతోంది.

– భూక్యా రాజారాం నాయక్

వర్గీకరణ తీర్పు: భయాలు, నిజాలు!

షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పుతో తలెత్తిన కొన్ని భయాలు, సంకోచాలను తొలగించడానికి బదులుగా అప్రధాన అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని సమర్థించే పలువురు సైతం సుప్రీంకోర్టు తీర్పు ప్రస్తుతం అమలులో ఉన్న రిజర్వేషన్ల విధానాన్ని నీరుగార్చేట్టు ఉందని భావిస్తున్నారు. ఇది పూర్తిగా తప్పు. భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ స్వయంగా రాసిన మెజారిటీ తీర్పు, జస్టిస్ గవాయ్ రాసిన తీర్పును స్థూలంగా పరిశీలించినా అవి సామాజిక న్యాయంపై ప్రగతిశీల న్యాయశాస్త్ర ఆలోచనల స్ఫూర్తితో ఉండి, కుల అంతరాలను అంతమొందించాలనే లక్ష్య నిర్దేశిత 'అఫర్‌మేటివ్ యాక్షన్'ను సమర్థిస్తున్నాయి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అట్టడుగున ఉన్న సామాజిక సమూహాల ఆందోళనలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక న్యాయ అన్వేషణను సుప్రీంకోర్టు తీర్పు మరింత ప్రగాఢంచేసింది. సిజెఐ చంద్రచూడ్ 'సమగ్ర న్యాయం' సూత్రాన్ని విపులీకరిస్తూ ఎస్ఎమ్ థామస్ తీర్పు వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు. భవిష్యత్తులో 'ప్రతిభ' (మెరిట్) పేరిట 'అఫర్‌మేటివ్ యాక్షన్'ను కూల్చివేసేందుకు జరిగే ఎటువంటి ప్రయత్నాన్ని అయినా అడ్డుకునే ఒక రక్షణ కుడ్యంగా సుప్రీంకోర్టు తీర్పు ఉపయోగపడుతుంది.

సుప్రీంకోర్టు తీర్పుపై వెల్లువెత్తిన పలు అనుచిత విమర్శల్లో కొన్నిటిని నిశితంగా చూద్దాం. మొదటిది న్యాయ– రాజ్యాంగ పరమైన అభ్యంతరం. సుప్రీంకోర్టు తీర్పు పార్లమెంటు అధికార పరిధిని ఆక్రమించిందని పలువురు విమర్శించారు. ఇ.వి. చిన్నయ్య కేసు తీర్పులోని న్యాయ పరాయణత్వాన్ని ఈ విమర్శ పునరుద్ఘాటించింది. సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లను ఉపవర్గీకరించడం లేదా అందుకు ఆదేశించడం గాని చేయలేదు. ఉప వర్గీకరణను ఎలా చేయాలి అన్న విషయంపై నిర్ణయాన్ని చట్ట సభలకు వదిలివేసింది. చట్ట సభల నిర్ణయాలను అమలుపరిచే బాధ్యతను ప్రభుత్వాలపై పెట్టింది. రిజర్వేషన్ల వర్గీకరణను రాజ్యాంగ అధికరణ 341 అనుమతిస్తుంది అన్న న్యాయపరమైన స్పష్టీకరణ మాత్రమే చేసింది.

ప్రామాణికమైన ఆధారాలు లేకుండా సుప్రీంకోర్టు ఉపకోటా ఆదేశాన్ని జారీ చేయడం సరికాదనేది రెండో విమర్శ. జనాభా గణన ప్రక్రియ ప్రతి రాష్ట్రంలోను షెడ్యూల్డు కులాల, తెగల వ్యక్తులను లెక్కించడమే కాకుండా వారి వృత్తి వివరాలు, కుటుంబ ఆస్తుల వివరాలు, విద్యార్హతలను కూడా నమోదు చేస్తుంది. ప్రతి ఎస్సీకులంలోను ప్రతి 10,000 మందిలో గ్రాడ్యుయేట్లు, అంతకు మించిన విద్యార్హతలు ఉన్నవారు ఎంతమంది ఉన్నారో 2011 జనగణన సమాచారం అందుబాటులో ఉన్నది. వాస్తవాలు స్పష్టంగానే ఉన్నాయి. విద్యార్హతల పరంగా చూస్తే దళిత కులాలు ఒకే సమూహం (హోమోజీనస్)గా లేరు. ప్రస్తుత తీర్పుకు దారితీసిన వ్యాజ్యానికి కారణమైన పంజాబ్‌లో మఝాబీ సిక్కులలో గ్రాడ్యుయేట్ల సంఖ్య హిందూ వాల్మీకి కులస్తుల కంటే తక్కువ. వాల్మీకి కులస్తులలో గ్రాడ్యుయేట్ల సంఖ్య రవిదాసీలో కంటే తక్కువ. బిహార్‌లోని భూయియా, ముసాహర్ కులాలలో పట్టభద్రులు సింగిల్ డిజిట్‌లో ఉన్నారు. తమిళనాడు మాదరి కులస్తులలో ఆ సంఖ్య 137, చక్కిలం కులస్తులలో 137, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జంగం సామాజికులలో 106, యూపీలోని వాల్మీకి కులస్తులలో 115, పాసీలలో 145 మాత్రమే. కర్ణాటకలో 209 మంది మాదిగ, మహారాష్ట్రలో 217 మంది మాంగ్ గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉన్నారు. ఈ అంకెలను సదరు రాష్ట్రాలలోని ఇతర ఎస్సీ కులాలలోని ఉన్నత విద్యావంతుల సంఖ్యతో పోల్చితే ఈ అట్టడుగు స్థాయికులాల వారు తమకంటే పైస్థాయిలో ఉన్న తోటి కులస్తులతో ఎందుకు పోటీ పడలేరో మీకు అర్థమవుతుంది. ఆ అన్యాయాలను రూపుమాపవలసిన అవసరమున్నది.

ఉపవర్గీకరణ దళితులలో విభేదాలు, చీలికలకు దారితీస్తుందనేది మరో విమర్శ. నిజం చెప్పాలంటే విభిన్న ఎస్సీ కులాల సాంఘిక జీవితం, రాజకీయ ప్రాధాన్యాలలో ఇప్పటికే ఏకత్వమనేది లేనేలేదు. వారిలో సంఘీభావం ఎప్పుడో సమసిపోయింది.. వారి ప్రస్థానాలు విడివిడిగా సాగుతున్నాయి. వృత్తి సంబంధిత కార్యకలాపాల స్థాయిలో సర్దుబాట్లు, కలివిడి సంబంధాలను సృష్టించడమే వారిలో అంతర్గత ఐక్యత, సుహృద్భావం పునరుద్ధరణకు మార్గం. ఇదెలా రూపుదాల్చుతుంది? దళితులలో సాపేక్షంగా తక్కువ ప్రతికూలతల నెదుర్కొంటున్న కులాలు ఎక్కువ ప్రతికూలతలతో కునారిల్లుతున్న కులాల అభ్యున్నతికి ఉద్దేశించిన న్యాయ విహిత చర్యలను అంగీకరించడం ద్వారా సాధ్యమవుతుంది. దురదృష్టవశాత్తు ఉప కోటాపై పరోక్ష విమర్శలు ఆ సామరస్య సాధనను మృగ్యం చేసేవిగా ఉన్నాయి. అంతేకాదు, ఆ డొంకతిరుగుడు నిందలు మండల్ ఉద్యమ సందర్భంలో అగ్రకులాల వారి రిజర్వేషన్ వ్యతిరేక వాదనలను ప్రతిధ్వనిస్తున్నాయి.

ఈ అపోహలు, తప్పుడు అభిప్రాయాలను పక్కనపెడితేనే ఉపకోటా విషయమై తలెత్తిన కొన్ని భయాలు, ప్రతిబంధకాలను సవ్యంగా ఎదుర్కోగలుగుతాం. ఎస్సీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన అనుమతిని అధికారపక్షం రాజకీయ లబ్ధికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఓబీసీ రిజర్వేషన్ల వర్గీకరణను బీజేపీ ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఇలా దుర్వినియోగపరిచింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో అటువంటి సంభవనీయతను నివారించేందుకు సుప్రీంకోర్టు కొన్ని రక్షణలను కల్పించింది. వాస్తవమైన, లెక్కించదగిన సమాచారం ఆధారంగా మాత్రమే ఉప వర్గీకరణ జరగాలన్న కోర్టు నిర్దేశమే ఒక ప్రధాన రక్షణ. ఆ వాస్తవిక నిదర్శనాలు ఎలా ఉండాలో కూడా నిర్దుష్టంగా నిర్ణయించవలసిన అవసరమున్నది. జనగణన, ఆర్థికగణన సమాచారం ఇప్పటికే అందుబాటులో ఉన్నది. దేశవ్యాప్తంగా సంఘటిత రంగంలోని ఉద్యోగాలు, ఉన్నత విద్యా రంగ సంస్థలలో వివిధ సామాజిక వర్గాల వారు ముఖ్యంగా ఎస్సీల గణన కూడా చేపట్టవలసి వున్నది.



■ యోగేంద్ర యాదవ్

ప్రస్తుత రిజర్వేషన్ల విధానాన్ని సుప్రీంకోర్టు తీర్పు నీరుగార్చేట్టు ఉందన్న వాదన పూర్తిగా తప్పు. ఈ తీర్పుపై విమర్శలు, డొంకతిరుగుడు నిందలు మండల్ ఉద్యమంలో అగ్రకులాల వారి రిజర్వేషన్ వ్యతిరేక వాదనలను గుర్తుచేస్తున్నాయి. ఉపకోటాను వ్యతిరేకించడం కాకుండా తీర్పులోని దీర్ఘకాలిక అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ఈ తీర్పును ప్రస్తుతానికి ఎస్టీలకు వర్తింపచేయకపోవడం మంచిది.




ఈ ఉపవర్గీకరణను ఉన్నతోద్యోగాలకు అర్హులయిన అభ్యర్థుల సంఖ్యను తగ్గించేందుకు ఒక కారణంగా ఉపయోగించుకునే అవకాశం ఎంతైనా ఉన్నది. సరైన అభ్యర్థి లభించలేదన్న మిషతో తొలుత సదరు ఉద్యోగాల భర్తీని నిలిపివేసి, ఆ తరువాత వాటిని 'అన్ రిజర్వ్‌డ్'కు బదలాయించేందుకు ఆస్కారమున్నది. ఈ బదలాయింపును నివారించాలంటే, ఎస్సీ/ఎస్టీ ఉపశ్రేణుల కోటాలో భర్తీ చేయని ఉద్యోగాలను 'అన్ రిజర్వ్‌డ్' శ్రేణికి కాకుండా ఎస్సీ లేదా ఎస్టీలలోని మరో ఉపశ్రేణికి బదలాయించాలన్న నిబంధనను విధించాలి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు హఠాత్తుగా 'క్రీమీలేయర్' (సంపన్న శ్రేణి) నిబంధన వర్తింపచేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. దళితులలో సంపన్న శ్రేణిగా పరిగణింపదగిన వ్యక్తులు, కుటుంబాలు చాలా చాలా అరుదు. ఎస్సీ సమూహాలలో ఇప్పటికే 'క్రీమీలేయర్' ఏర్పడినట్టు నిర్ధారించేందుకు సామాజిక నిదర్శనాలు ఏవీ లేవు. ఒక తరం అనుభవించిన ప్రత్యేక హక్కులు, సదుపాయాలు, రక్షణలు, మరీ ముఖ్యంగా సామాజిక హోదా అనేవి తరువాయి తరానికి సంక్రమించాయా లేదా అన్న ప్రాతిపదికన క్రీమీలేయర్‌ను ధ్రువీకరించవలసివున్నది. 'సంపన్నశ్రేణి'ని దూరంపెట్టడం వల్ల అర్హులైన అభ్యర్థుల సంఖ్య బాగా తగ్గిపోయి, సంబంధిత ఉద్యోగ ఖాళీలను అన్ రిజర్వ్‌డ్‌కి బదలాయించేందుకు దారి సుగమమవుతుంది. ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పులో ఆచరణాత్మకమైన అంశంగా, ఆదేశంగా 'క్రీమీలేయర్' అమలు లేదు. అయితే 'క్రీమీలేయర్' ప్రమాణాన్ని ఉపేక్షించిన సబ్ కోటా విధానాన్ని సవాల్ చేసేందుకు నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలను ఉపయోగించుకునే అవకాశం భవిష్యత్తులో ఎంతైనా ఉన్నది. అందువల్ల, సదరు నిబంధనపై అయోమయాన్ని తొలగించేందుకు పార్లమెంటు జోక్యం చేసుకోవల్సి రావడం అనివార్యం.

షెడ్యూలు కులాల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు షెడ్యూల్డు తరగతుల రిజర్వేషన్‌లపై చూపే ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవల్సి ఉంది. ఆ ప్రభావం ఒక విధంగా అనివార్యం. అధికరణలు 341, 342లపై భిన్న భాష్యాలు సరికాదు. అయితే ఎస్టీల విషయంలో అంతర్గత వ్యత్యాసాలు, రిజర్వేషన్ల తర్కం ఎస్సీల వ్యవహారాలలో కంటే గణనీయంగా భిన్నమైనవి. ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో వెలువరించిన తీర్పును ఎస్టీ రిజర్వేషన్లకు వర్తింపచేయకుండా ఉండడమే ఉత్తమం. ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో నిర్దిష్ట అంశాలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపే అవసరం, అవకాశం వచ్చేంతవరకు ఈ తీర్పును ఎస్టీ రిజర్వేషన్లకు వర్తింపచేయకుండా నిలిపివేయడమే వివేకవంతమవుతుంది.

ఉపకోటా భావనను వ్యతిరేకించడం కాకుండా సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పులోని దీర్ఘకాలిక అంశాలకు సామాజిక న్యాయరాజకీయాలు, విధానాలు ప్రాధాన్యమివ్వాలి: దళితుల, గిరిజనుల ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్లను అధికం చేయాలి; రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలి; సామాజిక న్యాయ సాధన మార్గాలను ప్రభుత్వ రంగం ఆవల కూడా వృద్ధిచేసి విస్తృతపరచాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

(న్యాయవాది ప్రణవ్ ధావన్, జెఎన్‌యు పరిశోధక విద్యార్థి శివమ్ మోఘా సహకారంతో)









అస్తవ్యస్త గురుకులాలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధ్వానంగా పాఠశాలలు
- అద్దె భవనాలు, అరకొర వసతులతో సతమతం
- విద్యార్థులకు కానరాని కనీస సౌకర్యాలు
- చాలినన్ని మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- నాసిరకం భోజనంతో కడుపు మాడ్చుకుంటున్న వైనం
- ప్రహరీ లేక పురుగుల బారిన పడి రోగాలపాలు
- పేద విద్యార్థుల విద్యపై సర్కారు అశ్రద్ధ




ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాల పరిస్థితి అత్యంత అధ్వానంగా ఉంది. కనీస సౌకర్యాలు మచ్చుకైనా కానరావడం లేదు. పేద విద్యార్థులు అధికంగా చదువుకునే ఈ గురుకులాలపై ప్రభుత్వం అంతగా శ్రద్ధపెట్టడం లేదు. కొన్ని సొంత భవనాల్లో నడుస్తుండగా, మరికొన్ని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కూనారిల్లుతున్నాయి. తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు చాలినన్ని లేవు. ఉన్నవాటికి తలుపులు సరిగా లేవు. కొన్నిటికీ అసలు తలుపులే లేవు. పరిశుభ్రత కానరావడం లేదు. పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి చిట్టడివిని తలపింపచేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గురుకుల పాఠశాలల చుట్టూ ప్రహరీగోడలు లేక విద్యార్థులు విషపురుగుల కాటుకు గురవుతున్నారు. భోజనం నాణ్యతగా ఉండడం లేదు. కలుషిత ఆహారంవల్ల విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురుకుల పాఠశాలల దుస్థితిపై రౌండప్



గురుకులాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందకు పైగా గురుకులాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాలు (టీఎస్‌ఆర్‌ఈఐ), తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు (టీఎస్‌ఎస్ డబ్ల్యుఆర్‌ఈఐ), తెలంగాణ రాష్ట్ర గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీఎస్‌టీడబ్ల్యుఆర్‌ఈఐ), గిరిజన ఆశ్రమ పాఠశాలలు (టీడబ్ల్యు ఆశ్రమ) మహాత్మాజ్యోతిబాపూలే విద్యాలయాలు (ఎంజేపీఐ), మైనారిటీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (ఎండబ్ల్యుఆర్‌ఐ) కస్తూర్బా గురుకుల పాఠశాలలు (కేఆర్‌ఐ) వీటిలో ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 22, వరంగల్ జిల్లాలో 26, ములుగు జిల్లాలో 9, మహబూబాబాద్ జిల్లాలో 39, జనగామ జిల్లాలో 16, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 52వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.



హనుమకొండ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక గురుకులాలు అరకొర వసతులతో అవస్థలు పడుతున్నాయి. చాలా గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో సరైన సౌకర్యాలు లేవు. ప్రహరీగోడలు, సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా నిర్మించిన గురుకుల భవనాలకు ప్రహరీలు నిర్మించడంపై శ్రద్ధ చూపించడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, ఉన్నత విద్యను అందించడానికి ఈ గురుకులాలను ఏర్పాటు చేయగా ఆ లక్ష్యం నెరవేడం లేదు. మెనూ ప్రకారం ఎక్కడా భోజనం వడ్డించడం లేదు. గురుకులాల్లో రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి డిన్నర్‌లో బలవర్థకమైన ఆహారం అందించాలి. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. వారానికి నాలుగు రోజులు గుడ్లు, ఒక రోజు చికెన్, నెలకొకసారి రెండోవారం మటన్ వడ్డించాలి. కూరగాయలు కూడా నాణ్యమైనవి అందించాలి. ఉదయం టిఫిన్ సమయంలో బూస్ట్ కలిపిన పాలు అందించాలి. కానీ ఎక్కడా ఆ విధంగా చేయడం లేదు. మధ్యాహ్నం భోజనంలో ఒక కర్రీ, సాంబార్, పప్పు మాత్రమే అందిస్తున్నారు. అది కూడా ఏ మాత్రం నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు అర్థాకలితో ఇబ్బందులు పడుతున్నారు. టిఫిన్ కూడా రోజూ ఒక రకం పెట్టాలి. కానీ ఏది తక్కువ ధర ఉంటుందో వాటినే అందిస్తున్నారు. వంట సరిగా చేయనివారిని మార్చాలని సూచిస్తున్నప్పటికీ ప్రిన్సిపాళ్ల దయతో వారినే కొనసాగిస్తున్నారు. కొన్ని గురుకులాల్లో పాడైన కూరగాయలు, మధ్యాహ్నం విగిలిన పప్పుతో రాత్రికి సాంబార్ చేస్తున్నారని సమాచారం. నిల్వ ఉంచిన కూరలు తిని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్నారు.

హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లాలో 22 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేరు 450మంది విద్యార్థులకు పది మరుగుదొడ్లే ఉన్నాయి. కొత్త భవనం నిర్మాణంలో ఉన్నది. ఎల్కతుర్తి మండలంలోని కస్తూర్బా పాఠశాలలో డార్మెట్రీలు లేవు. చాలినన్ని గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం ఫ్లోరింగ్ దెబ్బతిన్నది. పాఠశాల పక్కనే అడవి ఉండడంతో పాములు, తేళ్లు లోపలికి వస్తున్నాయి. శాయంపేట మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర పాఠశాల కిచెన్ పక్కనే వ్యర్థపదార్థాలను పారవేస్తుండడంతో కుళ్లి కంపుకొడుతోంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. కనీస వసతుల్లేవు. భవనానికి కిటికీలు లేవు. తాగునీటి సౌకర్యం సరిగా లేదు. కోతుల బెడద అధికంగా ఉంది. ఈ పాఠశాలకు గ్రౌండ్ లేదు. పరిసరాలు పరిశుభ్రంగా లేక దోమలు స్వైర్యవిహారం చేస్తున్నాయి. పాఠశాల నూతన భవనం అసంపూర్తిగా ఉంది.

వరంగల్ జిల్లా

వరంగల్ జిల్లాలో అన్ని రకాల గురుకులాలు కలిపి 26 ఉన్నాయి. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ గిరిజన సైనిక పాఠశాలలో పాఠశాల ఆవరణలో అంతర్గతంగా సీసీ రోడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో డైనింగ్ హాల్‌కు వెళ్లడానికి విద్యార్థులు బురదలో నడుచుకుంటూ వెళ్తున్నారు. పాఠశాల చుట్టూ పూర్తిస్థాయిలో ప్రహరీగోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కొరవడింది. 680మంది విద్యార్థులున్నా.. పాఠశాలలో జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు యూనిఫామ్స్, దుప్పట్లు ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. నర్సంపేట డివిజన్‌లో 26 బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలికలు, బాలుర వసతిగృహాలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్, ఎస్టీ కళాశాల హాస్టల్, ఎస్సీ బీసీ, ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్, ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్, మైనారిటీ గురుకులం, మహేశ్వరంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లె ఆశ్రమ కళాశాల హాస్టల్, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాలకు చెందిన సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక నర్సంపేట పట్టణంలో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపుగదులు లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు

మిగతా 7వ పేజీలో..



కొరియా పారిశ్రామిక వేత్తలతో టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడుల కోసం చర్చిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వరంగల్ వస్త్రనగరికి కలిసి వచ్చేనా..?!



- కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో కొరియా పెట్టుబడులు
- దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- పెట్టుబడులకు కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలత
- ఇప్పటికే 8 ఫ్యాక్టరీలు పెడుతున్న కొరియా కంపెనీ యంగాన్
- సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు వచ్చే చాన్స్

7

ఏసీబీ వలలో ఇరిగేషన్ ఏఈ

- నిధుల మంజూరుకు లంచం డిమాండ్
- రూ.6వేలు తీసుకుంటుండగా పట్టివేత


ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఏఈ గోపాల్

బాలసముద్రం, ఆగస్టు 12: హనుమకొండలోని నక్కలగుట్ట సమీపంలో రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ డి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుంటతండా గ్రామానికి చెందిన బానోతు యాకు మాజీ ఎంపీటీసీగా పని చేశాడు. యాకు భార్య సర్పంచ్‌గా పని చేసిన సమయంలో గుడికుంటతండ గ్రామంలో యాకు రూ.లక్ష 27వేల అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్ కౌంటర్ సంతకం చేసేందుకు రూ.6.వేలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏఈ గోపాల్‌కు లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఈనెల 9న యాకు హనుమకొండలోని ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో సోమవారం ఉదయం 11:53 నిమిషాలకు హనుమకొండ నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట గోపాల్ బాధితుడు యాకు నుంచి రూ.6వేలు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ డి. సాబయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, ఎస్.రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఘాతుకం

- అత్తామామలపై అల్లుడి దాడి
- మామ మృతి, అత్త పరిస్థితి విషమం


మృతుడు రాజనర్సయ్య

మంగపేట, ఆగస్టు 12: భార్య కాపురానికి రాకపోవడానికి అత్తామామలే కారణమని భావించిన అల్లుడు.. వారిపై కర్రతో దాడిచేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మామ మృతిచెందగా, అత్త ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం నీలాద్రిపేటకు చెందిన నర్సమ్మ-రాజనర్సయ్య దంపతుల రెండో కుమార్తె స్వప్నను ఇదే గ్రామానికి చెందిన రామకృష్ణకు ఇచ్చి కొన్నేళ్ల కిందట వివాహం జరిపించారు. ఆ క్రమంలోనే 20 గుంటల భూమిని ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. రామకృష్ణకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉండడం, మద్యం సేవించి పనిచేయకపోవడంతో అతడి మామ ఒప్పుకున్న భూమిని ఇవ్వలేదు. రామకృష్ణ వేధింపులు భరించలేక స్వప్న కొద్దిరోజుల కిందట తన ఇద్దరు కొడుకులతో కలిసి తల్లిగారింటికి వచ్చి ఇక్కడే ఉంటోంది.

ఆదివారం రాత్రి గ్రామంలోని కిరాణా దుకాణం వద్దకు వెళ్లిన స్వప్నను తనతో కాపురానికి రావాలని రామకృష్ణ ఒత్తిడి తెచ్చాడు. ఇందుకు స్వప్న ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరగగా ఆమె తల్లిదండ్రులు రాజనర్సయ్య, నర్సమ్మ అక్కడికి వచ్చారు. మీ కారణంగానే తన భార్య తనతో రావడం లేదంటూ రామకృష్ణ వారిపై కర్రతో దాడిచేశారు. తీవ్రగాయాల పాలైన వారిని ములుగు ఏరిరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో రాజనర్సయ్య మృతిచెందాడు. నర్సమ్మను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసిన ఏటూరునాగారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన నాలాలను విస్తరించండి..

- ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో మేయర్ సుధారాణి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: వరంగల్ నగరంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే టెక్నికల్ కమిటీ సూచించిన విధంగా ప్రధాన నాలాలను విస్తరించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. గత వారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా ప్రతినిధులు, అధికారులతో జరిపిన సమీక్షలో ఆదేశించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వరంగల్ నగరంలోని వడ్డెపల్లి చెరువు, భద్రకాళి చెరువు, శాకరాసికుంట, భట్టుపల్లి, చిన్నవడ్డెపల్లి, కట్టమల్లన్న చెరువుల నుంచి వచ్చే నీరు సులువుగా వెళ్లేందుకు అడ్డంగా ఉన్న అక్రమ కట్టడాలను టెక్నికల్ కమిటీ ఆదేశాల మేరకు తొలగించి విస్తరణ చేపట్టాలని సూచించారు. ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కోసం చేసుకున్న దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశీలించాలని అన్నారు. ఇప్పటివరకు లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయని ఆమె వెల్లడించారు. నగరంలో ప్రధానరోడ్లపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చి ప్రమాదాలు జరుగకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డీసీపీ రవీంద్ర రాడేకర్, డీసీపీలు రవీందర్, ప్రసన్నరాణి, లీగల్ అధికారి శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య..

రికార్డు స్థాయిలో 349 దరఖాస్తులు


బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు12: ప్రజావాణికి వచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బాధితులు తరలివచ్చారు. 349 మంది ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌కు రావడంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా ప్రజలతో కిటకిటలాడింది. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య బాధిత ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యను పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్, భూ సర్వే, ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ పరిధిలో వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

దళిత బంధుకు వినతులు 182

ఎస్సీ డెవలప్‌మెంట్‌కు (దళితబంధుకు) సంబంధించిన వినతులు అధిక సంఖ్యలో 182 వచ్చాయి. ఆ తర్వాత మున్సిపల్ శాఖకు 18 వినతులు, భూ సర్వేకు 5, డీఈవో ఆఫీస్‌కు 2, మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు 02, జిల్లా పంచాయతీరాజ్ శాఖ 03, పరకాల ఆర్డీవో ఆఫీస్‌కు 13, హనుమకొండ ఆర్డీవో ఆఫీస్‌కు 11, ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయానికి 3, కాజీపేట తహసీల్దార్ కార్యాయానికి 07, హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 11 దరఖాస్తులతోపాటు మిగతా దరఖాస్తులు వివిధ సమస్యలపై వచ్చాయి. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ప్రజా సంఘాల నాయకులు పేద ప్రజల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

కాళోజీ కళాక్షేత్రానికి రూ.45 కోట్ల నిధులు 7

రుణమాఫీ లబ్ధిదారులకు కొత్త రుణాలు ఇవ్వండి..

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 12: రుణమాఫీ పొందిన లబ్ధిదారులకు నూతనంగా పంట రుణాలు కల్పించాలని డీసీసీ బ్యాంక్ మేనేజర్లను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదేశించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో మేనేజర్లతో ఆయన సమీక్ష జరిపారు. పీఏసీఎస్‌లను సందర్శించి రుణమాఫీ పొందిన రైతులకు వీలైనంత త్వరగా కొత్తగా రుణాల అర్హులను గుర్తించాలని సూచించారు. వర్షాకాల పంటల సాగుకు కొత్తగా మంజూరు చేసే రుణాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆధార్ కార్డులో తప్పుడు నమోదుల కారణంగా రుణమాఫీ పొందడంలో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు పేర్కొన్నారు. దీనిని గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన రైతుల రుణాల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో అలసత్వం ప్రదర్శించిన పీఏసీఎస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. వ్యవసాయేతర పంట రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి బ్యాంక్ మేనేజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీఈవో వజీర్‌సుల్తాన్, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజుతో పాటు వివిధ శాఖల బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.



బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

సెల్ దొంగతనాలను అరికట్టడానికి పోర్టల్

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ఫోన్ మహిళకు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 12: సెల్‌ఫోన్ల దొంగతనాలను అరికట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సీఇఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో సీసీఎస్ పోలీసులు సెల్‌ఫోన్ రికవరీ మేళాను నిర్వహించారు. రికవరీ చేసిన ఫోన్‌లను పోగొట్టుకున్న యజమానులకు సీపీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. దొంగతనం కాని, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల ఆచూకీ కోసం సీసీఎస్‌తో పాటు ప్రతీ స్టేషన్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో 7,022 సీఇఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో 4,028 ఫోన్లను గుర్తించి 2527 స్వాధీనం చేసుకుని యజమానులకు అందించినట్లు తెలిపారు. వారంరోజుల్లోనే 150 ఫోన్లను సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే పోర్టల్‌ను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి కేయూ న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం మూడేళ్ల, ఐదేళ్ల కోర్సుల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయశాస్త్రం మూడేళ్ల కోర్సుల్లో 4, 6వ సెమిస్టర్, న్యాయశాస్త్రం ఐదేళ్ల కోర్సుల్లో 8, 10వ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కళాశాలలోనూ, వర్సిటీ వెబ్‌సైట్‌లోనూ సంప్రదించాలని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

అలాగే ఎల్ఎల్‌బీ మూడేళ్ల 4వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24,, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ మూడేళ్ల సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 8వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 20, 22, 24, 27, 29 తేదీల్లో, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 10వ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 19, 21, 23 తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

వరంగల్ లీగల్, ఆగస్టు 12: ఐదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జ్ కం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ప్రేమలతారెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. అలాగే బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేటకు చెందిన ఐదేళ్ల బాలిక.. తన తల్లితోపాటు వ్యవసాయ భూవి ి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనకటి రఘుపతి జామపండ్లు తినిపిస్తానని పక్కకు తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు రఘుపతికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ పి.సురేందర్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు కోట మహేందర్‌రెడ్డి, జి.అరుణ్ వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్ నీరజ కేసు విచారణలో సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మఠ్రి వాసుదేవరెడ్డి కేసు వాదించారు.

ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన డ్రైవర్

అభినందించిన ఆర్టీసీ ఎం.డి సజ్జనార్

బాలసముద్రం, ఆగస్టు 12: హైదరాబాద్ ఉప్పల్ నుంచి డిలక్స్ బస్సులో హనుమకొండకు వస్తున్న ప్రయాణికుడికి మూర్ఛరావడంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించిన డ్రైవర్ ప్రయాణికుడి ప్రాణాలు కాపాడడు. దీంతో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ డ్రైవర్‌కు సోమవారం అభినందనలు తెలిపారు. వరంగల్-2డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న బి.వెంకన్న హైదరాబాద్ ఉప్పల్- హనుమకొండకు బస్సు సర్వీసు నడుపుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉప్పల్ నుంచి హనుమకొండకు వస్తున్న క్రమంలో బస్సులో ఉన్న ప్రయాణికుడికి ఒక్కసారిగా మూర్ఛ రావడంతో తోటి ప్రయాణికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ అరగంట సమయం పడుతుందని చెప్పడంతో ఘట్‌కేసర్ నుంచి టీటీనగర్ వరకు డ్రైవర్ బస్సును వేగంగా తీసుకువచ్చి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుపోయినట్లు తెలిపారు. ప్రయాణికుడికి సమయానికి వైద్యం అందించడంతో ప్రయాణికుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, బస్సులో ఉన్న ఓ ప్రయాణికుడు ట్విట్టర్‌లో ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్‌కు ఫొటోతీసి వివరాలు పోస్టు చేయడంతో ట్వి ట్టర్ ద్వారా డ్రైవర్‌కు సజ్జనార్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, వరంగల్-2డిపో మేనేజర్ వి.జోత్స్న అధికారులు డ్రైవర్ వెంకన్నకు అభినం దనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 12: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టిన సంఘటనలో ఓ గుర్తు తెలియని మహిళ (సుమారు 50-55 ఏళ్లు) మృతి చెందింది. ఈ సంఘ టన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డివిజన్ కేంద్రంలో ని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి వెంట ఓ గుర్తు తెలియని మహిళ నడుచుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి కొంత దూరం మృతదేహాన్ని ఈడ్చుకెళ్లింది. రహదారిపై పడి న మృతదేహంను ఆ సమయంలో ఎవరూ గమనించ కపోవడంతో జనగామ నుంచి హనుమకొండ వైపు అతివేగంగా వెళ్లే వివిధ వాహనాలు మృతదేహం పైనుంచి వెళ్లడంతో పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో పాటు శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అటుగా వెళ్లిన గ్రామ పంచాయతీ సిబ్బంది రహదారిపై మహిళ మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి పోలీసు సిబ్బంది, జీపీ సిబ్బంది చేరుకొని మహిళ మృతదేహం ను, శరీర భాగాలను ప్యాక్ చేసి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఘన్‌పూర్ జీపీ జూనియర్ అసిస్టెంట్ బుర్ర శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

వరంగల్ వస్త్రనగరికి కలిసి వచ్చేనా..?!

- దక్షిణ కొరియా పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు వచ్చే చాన్స్





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కుపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. భారీగా పెట్టుబడులను ఆహ్వానించి వరంగల్‌ను వస్త్రనగరిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జూన్ 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి టెక్స్‌టైల్ పార్కులో పర్యటించి పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు. తన విదేశీ పర్యటనలో వరంగల్ టెక్స్‌టైల్‌పార్కులో పెట్టుబడుల కోసం దక్షిణ కొరియాలోని ప్రముఖ కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే గత ఏడాది కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ ఎనమిది ఫ్యాక్టరీలను పెట్టేందుకు ఎంవోయూ కుదుర్చుకోగా, సీఎం పర్యటనతో మరిన్ని కొరియా కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

సీఎం పర్యటనతో కలిసి వచ్చేనా..?

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి ప్రభుత్వం రూ.1,350కోట్ల వ్యయంతో 1,150 ఎకరాల్లో సుమారు 200లకు పైగా వస్త్ర కంపెనీలు, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా కేఎంటీపీ ద్వారా ఉపాధి కల్పించబోతున్నట్లుగా గత ప్రభుత్వం ఆశలు రేపింది. 22 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నప్పటికీ ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే అడుగు పెట్టాయి. ఇందులో 2021 జూలై 7వ తేదీన కైటెక్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. కేరళకు చెందిన కైటెక్స్ రూ.1,200కోట్ల వ్యయంతో 187ఎకరాల్లో చిన్నపిల్లల దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. అలాగే గణేషా ఎకోపెట్, ఎకోటెక్ కంపెనీలు రూ.588కోట్ల వ్యయంతో సుమారు 50 ఎకరాల్లో రెండు యూనిట్లను ప్రారంభించింది. వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి రీసైక్లింగ్ చేస్తున్నారు. వీటితో దారాలను తయారు చేస్తుండగా, మరో యూనిట్ బాటిల్ తయారీకి ముడి సరుకును అందిస్తుంది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలే ఇక్కడ ఉత్పత్తి చేపట్టాయి. గత ఏడాది దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 2023లో గత ప్రభుత్వంతో యంగాన్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో జూన్ 29న వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణ కొరియా దేశంపై ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి తన విదేశీ పర్యటనలో భాగంగా ఆ దేశాన్ని సందర్శించారు. ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీ, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీతోపాటు మరో 25 అగ్రశ్రేణి కంపెనీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులకు ఆహ్వానించటంతో వరంగల్‌లో వస్త్రనగరి భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఆశించిన స్థాయిలో కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెడితే వరంగల్ వస్త్రనగరిగా అభివృద్ధి చెందనుంది. అంతేకాకుండా సుమారు 2లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి కొరియా పర్యటనలో కంపెనీలకు ఆహ్వానంపై ఉమ్మడి వరంగల్ జిల్లా వాసుల ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొరియా కంపెనీలతో సీఎం చర్చలు

వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానికి దక్షిణ కొరియా టెక్స్‌టైల్ ఫెడరేషన్ సానుకూలంగా స్పందించింది. విదేశీ పర్యటనలో భాగంగా సోమవారం దక్షిణ కొరియా దేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు గ్లోబల్ కంపెనీల అధినేతలు, బిజినెస్ గ్రూపులతో సమావేశాలు, చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (కేఓఎఫ్ఓటీఐ) ఆధ్వర్యంలో జరిగిన బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో సౌకర్యాలు, ప్రభుత్వం అందించే సహకారంపై సీఎం వివరించారు. టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణపై స్థానిక కంపెనీలతో పాటు ప్రపంచస్థాయి కంపెనీలకు కూడా అనుకూలంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలపై సీఎం వివరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో యంగాన్ కార్పొరేషన్ ఛైర్మన్ కియాంగ్ సంగ్, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ సొయంగ్ జూ సహా 25 అగ్రశ్రేణి టెక్స్‌టైల్ కంపెనీల అధినేతలు పాల్గొన్నారు. కాగా, సీఎంతో పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రానికి రూ.45 కోట్ల నిధులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: గ్రేటర్ వరంగల్ పరిధిలోని హనుమకొండ బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం చేసేందుకు రూ.45 కోట్ల నిధులను విడుదల చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 2015లో రాష్ట్ర ప్రభుత్వం రూ.85.10కోట్లతో వరంగల్ నగరంలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాలు చేపట్టాలని ప్రత్యేక జీవోను జారీ చేస్తూ ముందుగా రూ.40.10కోట్ల నిధులను మంజూరు చేస్తూ నిర్మాణ పనులను తెలంగాణ టూరిజం శాఖకు పనులను అప్పగించింది. కానీ సదరు శాఖ అధికారులు పనుల్లో జాప్యం చేయడంతో అప్పటి ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను వరంగల్ కుడాకు అప్పగించింది. అప్పటి నుంచి కుడా అధికారులు పనులు చేస్తున్నారు. కాగా పనులు అంతిమదశకు చేరడంతో మిగతా పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కుడా వైస్ ఛైర్మన్ అశ్విని తానాజీ వాకడే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు సంబంధిత అధికారులను కోరారు. వారు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న రూ.45కోట్ల నిధులను విడుదల చేస్తూ జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ప్రత్యేక జీవోను విడుదల చేశారు. అంతేకాకుండా సెప్టెంబరు 9లోగా కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్టు కుడా అధికారులు తెలిపారు.

55 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 12: కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో రూ.1లక్ష 37వేల విలువ కలిగిన 50 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టి.రాజు అనే వ్యక్తి అంబాల పరిసర ప్రాంతాల్లో పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. విచారణ నిమిత్తం రాజును కమలాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రంజిత్‌కుమార్ ధృవీకరించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మడికొండ, ఆగస్టు 12: యువకుడి వేధింపులు భరించలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత(అంగన్‌వాడీ టీచర్) చికిత్స పొందుతూ మృతి చెందింది. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆరుముల్ల రమేష్‌కు అదే గ్రామానికి చెందిన అనితకు 14 యేళ్ల కిందట వివాహం జరుగగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, కొన్ని నెలలుగా అదే గ్రామానికి చెందిన మాతంగి రాజుతో ఏర్పడిన పరిచయాన్ని ఆసరాగా తీసుకొని అతడు అనితను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. కొన్ని రోజులు అనిత తన తల్లిగారింటికి వెళ్లి వచ్చింది. రాజు తిరిగి ఫోన్ చేస్తూ, మెసేజ్‌లు చేస్తూ వేధిస్తూ బ్లాక్ మెయిల్ చేస్తుండడంతో అప్పటికే తన పరువుపోయిందని భావించిన అనిత.. ఈనెల 10న గడ్డి మందు తాగింది. తన కుమారుడి ద్వారా విషయం తెలుసుకున్న ఆమె భర్త ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎసై తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి



లకావత్ రాజశేఖర్ (ఫైల్)

కొత్తగూడ, ఆగస్టు 12: విషజ్వరంతో బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని చిన్నతండాలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేణ్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నతండాకు చెందిన లకావత్ లక్ష్మి, రామచంద్రుల కుమారుడు రాజశేఖర్‌కు(17) రెండు రోజుల క్రితం తీవ్రజ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా శ్రీనివాస్

కన్వీనర్‌గా కొక్కొండ రమేష్ నియామకం



శామంతుల శ్రీనివాస్



కొక్కొండ రమేష్

వరంగల్ లీగల్, ఆగస్టు 12: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ చైర్మన్‌గా, న్యాయవాది శామంతుల శ్రీనివాస్‌ను, కన్వీనర్‌గా న్యాయవాది కొక్కొండ రమేష్‌ను నియమిస్తూ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర లీగల్‌సెల్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. అదే విధంగా వైస్‌చైర్మన్లుగా న్యాయవాదులు ఇ.ఆనంద్‌మోహ న్, మహ్మద్ అజామ్, గుని గంటి శ్రీనివాస్, ఇజ్జగిరి సురే ష్, కొడిదల సంజయ్‌కుమార్, గంపా వెంకట రమణను నియమించారు. జాయింట్ కన్వీనర్లుగా న్యాయవాదులు జీవీ రమణమూర్తి, గన్ను హరిహర కుమార్, ఎం. శ్రీనాథ్‌బాబు, రొడ్డ అమృతరావు, రాచర్ల సురేశ్, మహ్మద్ జానికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

భూ వివాదంలో హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

వరంగల్ క్రైం, ఆగస్టు 12: భూ వివాదంలో జోక్యం చేసుకున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ తోట బాబు అలియాస్ పోలీస్ బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం ఈ మేరకు సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో వరంగల్ ప్రాంతలో స్థలం కొనుగోలు చేసేందుకు ఒక వ్యక్తి కొంత మొత్తాన్ని చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆ సమయంలో కరోనా రావడంతో సదరు వ్యక్తి స్థల యజమానికి పూర్తిగా డబ్బులు చెల్లించలేదు. దీంతో యజమాని ఇటీవల వేరే వ్యక్తికి విక్రయించాడు. ఇది తెలిసి మొదట అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తి వచ్చి స్థల యజమానితో గొడవకు దిగాడు. ఈ తంతు మొత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆ సమయంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాబు భూ వివాదం విషయం తలదూర్చి సీపీ పేరు చెప్పి డబ్బులు తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల కిందట ఇరువర్గాల మధ్య శివనగర్‌లో జరిగిన పంచాయితీకి హాజరైన బాబు.. అగ్రిమెంట్ చేసుకున్న వ్యక్తిని బెదిరించినట్లు తెలిసింది. ఆదివారం బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, తోట బాబుతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.. సీపీకి నివేదిక ఇవ్వగా, బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ విషయమై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ మల్లయ్యను వివరణ కోరగా కానిస్టేబుల్‌పై తమ స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలపడం గమనార్హం.

అస్తవ్యస్త గురుకులాలు

5వ పేజీ తరువాయి

పడుతున్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నేటి వరకు యూనిఫామ్ అందించలేదు.

ములుగు జిల్లా

ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లిలోగల తెలంగాణ బాలుర గురుకులంలో ఈనెల 1వ తేదీ రాత్రి 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ విషపురుగు కుట్టడంతో ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. 2వ తేదీన తెల్లవారుజామున 5గంటలకు 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అదేరోజు ఉదయం 8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా, పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది. వారంరోజులుగా సదరు విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గురుకులం చుట్టూ ప్రహరీ సరిగ్గా లేకపోగా పిచ్చి మొక్కలు దట్టంగా మొలవడంతో విషపురుగుల సంచారం ఉంది. తరుచూ విద్యార్థులు పాములు, తేళ్లను చూస్తున్నట్లు చెప్పారు. ఒకేరోజు ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో స్పందించిన రాష్ట్ర మంత్రి సీతక్క గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులకు ధైర్యం చెప్పి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ములుగు మండలం మల్లంపల్లి వద్ద ఓ ప్రైవేటు భవనంలో మంగపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం కొనసాగుతోంది. భవనం సమీపంలోనే అటవీ ప్రాంతం ఉండటం, చుట్టూ పరిసరాలు చిత్తడిగా ఉండటంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. జాకారం సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల/కళాశాల గురుకులం పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ సమీపంలో అటవీ ప్రాంతం, చిత్తడి ప్రదేశాలుండటంతో ప్రమాదం పొంచి ఉంది. కాగా, ములుగులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం మూడంతస్తుల ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. ఆటస్థలం లేకపోవడంతో బాలికలు పక్కనే ఉన్న ప్రైవేటు ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. చుట్టుపక్కల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఈ గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని కార్తీకశ్రీ ఈనెల 9న పాఠశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. తీవ్ర గాయాలతో బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

మహబూబాబాద్ జిల్లా

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని 18 మండలాల్లో సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూల్, ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాలల బాల, బాలికల వసతిగృహాలు 21 ఉన్నాయి. వీటిల్లో కొన్ని మహాత్మాజ్యోతిబా పూలే, మైనారిటీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర కళాశాల హాస్టల్‌లో నీటి సమస్య తలెత్తితే పక్కనే ఉన్న ఎస్సీ (సి,ఈ) బాలుర పాఠశాల హాస్టల్‌లో స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

జనగామ జిల్లా

జనగామ జిల్లాలో 5 సాంఘిక సంక్షేమ గురుకులాలు, 8 బీసీ గురుకులాలు, 2 మైనారిటీ గురుకులాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. గతంలో ఏర్పాటైన గురుకులాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని మరుగుదొడ్లకు అసలు తలుపులే లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు లీకేజీ అవుతున్నాయి. పాలకుర్తి మండలంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా గదులు, మంచాలు లేవు. పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ వర్షానికి కూలిపోయి మూడేళ్లవుతోంది. విద్యార్థులకు రక్షణ లేకుండా పోయింది. విద్యార్థులకు ఇప్పటివరకు చెద్దర్లు, దుప్పట్లు ఇవ్వలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6 గురుకులాలు ఉన్నాయి. వీటిల్లో ఈ యేడాది విద్యాసంవత్సరానికి గాను 2,460 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని గాంధీనగర్‌లో గల మైనారిటీ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో సరిపడా గదులు లేవు. 380 మంది విద్యార్థులకు గాను 9 గదులు నిద్రించడానికి, 6 గదులు క్లాస్ రూమ్‌లకు వినియోగిస్తున్నారు. రాత్రుల్లో వరాండాల్లోనే నిద్రిస్తున్నారు. పడుకునే బెడ్ల పక్కనే ర్యాక్‌లపై వారి దుస్తులు ఆరబెట్టుకోంటున్నారు. ఫ్యాన్‌లు సరిపడా లేవు. ఇప్పటివరకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు మంజూరు కాలేదు. యూనిఫామ్ కూడా రాలేదు. సౌకర్యాలపై ఒకరిద్దరు విద్యార్థులను పలకరించగా భోజనం సరిగ్గా ఉండటం లేదని చెప్పుకొచ్చారు. రాత్రి వేళల్లో దోమలతో సావాసం చేయాల్సి వస్తోందని వాపోయారు.

తండ్రి మృతితో ఆగిన గుండె

పెద్దంపేటలో తనయుడి హఠాన్మరణం ● తండ్రికొడుకుల మృతితో విషాదఛాయలు



బీసుల పెద్ద లస్మయ్య(ఫైల్)



బీసుల కృష్ణరాజు(ఫైల్)

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 12: కనిపెంచిన తండ్రి హఠాన్మరణంతో తనయుడి గుండె తట్టుకోలేకపోయింది. తండ్రి మృతితో తల్లడిల్లుతూ రోదించిన కొడుకు సైతం గుండెపోటుతో మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తండ్రి, కొడుకుల మృతితో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బీసుల పెద్ద లస్మయ్య(62) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి మృతిని తట్టుకోలేని ఆయన పెద్ద కొడుకు బీసుల కృష్ణరాజు(30) రోదిస్తూనే తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. మధ్యాహ్నం తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం ఇంటికి వచ్చిన కొడుకు.. అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కృష్ణరాజు మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. గంటల వ్యవధిలోనే ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి లస్మయ్యకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు కాగా, కృష్ణరాజు మొదటి సంతానం. కృష్ణరాజుకు భార్య రాణితో పాటు ఎనిమిది నెలల కుమారుడు ఉన్నాడు.

డీఎస్ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసివేయాలి

హనుమకొండ కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు, సీపీఐ(ఎంఎల్)నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు12: హనుమకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామంలో ఉన్న డీఎస్ఆర్ కోళ్ల ఫామ్‌ను వెంటనే మూసి వేయాలని నీరుకుళ్ల (కందిబండ), పెంచికలపేట, కేవశాపురం గ్రామాలకు చెందిన ప్రజలు.. సీపీఐ (ఎంఎల్)నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. నీరుకుళ్ల గ్రామ శివారులోని చెన్నకేశవ స్వామి ఆలయం పక్కనే వేరు గ్రామాలకు చెందిన వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా పౌల్ట్రీఫామ్‌లు ఏర్పాటుచేసి గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. కోళ్లఫామ్ నుంచి దుర్వాసన వస్తోందని, దీంతో గ్రామ ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. పారిశుధ్యంపై కోళ్లఫామ్ యజమానిని గ్రామస్తులు అడగగా గ్రామస్తులపై యజమాని దుర్భాషలాడుతూ కేసులు పెట్టించాడని ఆరోపించారు. వెంటనే కలెక్టర్ స్పందించి కోళ్లఫామ్ యజమానిపై చర్యలు తీసుకుని ఈగలు దోమల వ్యాప్తి చెంది ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న కోళ్లఫామ్‌ను మూసివేయించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నీరుకుళ్ల(కందిబండ), పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 12: వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలని, అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐడీఎస్‌వో అఖిల భారత నాయకులు డాక్టర్ ఆర్.గంగాధర్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో సోమవారం చలో కమిషనర్ ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి సాంకేతిక విద్య బోర్డు డైరెక్టర్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. 2014లోనే నిట్ సాంకేతిక బృందం పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీలు చేసి 2024లోపు కొత్త భవనాన్ని నిర్మించాలని సూచించిన సంగతిని డైరెక్టర్‌కు వివరించినట్లు గంగాధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ, నాయకులు నితీష్, వినోద్, నాగరాజు, సురేష్, ఆదిత్య, నిఖిల్, అభిరామ్, లోకేష్, చందు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: అందరూ లైబ్రరీని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతస్థాయిలో ఎదగాలని క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ఉద్బోధించారు. కాకతీయ యూనివర్సిటీ కేంద్ర గ్రంథాలయంలో సోమవారం లైబ్రరీ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 132వ జయంతిని పురస్కరించుకుని లైబ్రరీడే సెలబ్రేషన్స్ నిర్వహించారు. కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కుప్లా), కుప్లా, కేయూ డిపార్టుమెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, తెలంగాణ లైబ్రరీ అసోసియేషన్ వరంగల్ జిల్లా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ హాజరై మాట్లాడారు. లైబ్రరీ సైన్స్ విభాగంలో విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. వర్సిటీ కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు మరిన్ని సేవలందించేందుకు కృషి చేస్తామని వివరించారు. కేయూ లైబ్రరీ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, డాక్టర్ బి.రాధికారాణిలు గౌరవ అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు చెప్పారు. కాగా, సమావేశంలో టీఎస్ఎల్ఏ ప్రెసిడెంట్ కె.రమణయ్య కీలక ప్రసంగం చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఐఎస్సీ కోర్సులో మొదటి ర్యాంకు సాధించిన అఖిలకు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ కె.ఇంద్రాసేనారెడ్డికి ఉత్తమ లైబ్రేరియన్ అవార్డుతో ఘనం గా సన్మానించారు. ఎంబీఏ విద్యార్థిని బి.ప్రియాంకకు ఉత్తమ చదువరి అవార్డును ప్రదానం చేశారు. ఈసమావేశంలో కుప్లా జనరల్ సెక్రటరీ వేదాంతం కృష్ణమాచార్య, డి.సత్యనారాయణరావు, లైబ్రరీయన్ టి.జావేర్, డాక్టర్ జి.రాజేశ్వర్‌రావు, ఎం.మనోహర్‌రావు, ఎం.కోటేశ్వర్‌రావు, డాక్టర్ ఎం.అంజయ్య, పి.యుగేందర్‌రావు, డాక్టర్ ఎ.జయప్రకాశ్, నిరంజన్, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో లైబ్రరీ దినోత్సవ వేడుకలు

కేయూ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా లైబ్రరీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మహేందర్, కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్.సుజాతలు



ఆర్ఎస్‌రంగనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్

లైబ్రరీ పితామహుడు ఆర్ఎస్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహేందర్, ఇన్‌చార్జి సుజాతలు మాట్లాడుతూ.. లైబ్రరీ రంగ విస్తరణకు ఆర్ఎస్ రంగనాథన్ తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు లభించిందని అన్నారు. లైబ్రరీని అందరూ నిరంతరం ఉపయోగించుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు కళాశాల లైబ్రరీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కోఎడ్యుకేషన్ కళాశాల సూపరింటెండెంట్ బొల్నెపాక ప్రభాకర్,యోహాన్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, సంగాల రాజమౌళి, నర్మద,లావణ్య, శోభారాణి, కిశోర్, పున్నమ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాల పాత్ర కీలకం

హసన్‌పర్తి, ఆగస్టు 12 : ప్రస్తుత సాంకేతిక విద్యలో డిజిటల్ గ్రంథాలయాల పాత్ర కీలకమని కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీలో 132వ జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సెంట్రల్ లైబ్రరీ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కె.వేణుమాధవ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డిలు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన సేవలను అందిస్తున్న లైబ్రరీ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. గ్రంథాలయాలు నేర్చుకోవడానికి, నైపుణ్య అభివృద్ధికి ఒక అపూర్వ దేవాలయం అన్నారు. గ్రంథా లయాలు లేకపోతే విద్యా సంస్థలకు అభివృద్ధి, భవిష్యత్ లేదన్నారు. నూతన సాంకేతిక పోకడ లను దృష్టిలో పెట్టుకొని కిట్స్ యాజమాన్యం రూ.40 లక్షల విలువైన పుస్తకాలను, ఈ-జర్నల్స్‌ను అకాడమిక్ విద్యార్థులకు, అధ్యాపకులకు లైబ్రరీలో అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల సెంట్రల్ లైబ్రేరియన్ డాక్టర్ కె.ఇంద్రసేనారెడ్డి, గ్రంథాలయ కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.ప్రభాకరాచారి, ఎం.నిరంజన్, ఎం.అరుణ్, పి.సుమలత పాల్గొన్నారు.

• హసన్‌పర్తి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సెంట్రల్ లైబ్రరీ గ్రంథపాలకుడు డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డికి ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు లభించినట్లు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ 132వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ చేతుల మీదుగా ఈ అవార్డు అంద జేసి శాలువాతో సత్కరించి అభినందించినట్లు కిట్స్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణి, ప్రొఫెసర్ రమణయ్య, పి.కొండల్‌రెడ్డి, వి.కృష్ణమాచార్య తదితరులు పాల్గొని అభినందించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు.

అర్ధ నారీశ్వరునిగా రుద్రేశ్వరుడు



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 12: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో పవిత్ర శ్రావణ ద్వితీయ సోమవారం రుద్రేశ్వరుడు అర్ధ నారీశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం శివప్రీతికర సోమవారం కావడంతో ఉదయం నుంచి భక్తులు ఆలయాన్ని సందర్శించారు. రుద్రేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహింపజేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడికి అర్ధ నారీశ్వరుడిగా శోభాయమా నంగా అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. సాయంకాలం ప్రదోషకాల సమయంలో నందీశ్వరుడి వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చేనేత హస్తకళ మేళా ప్రారంభం



మేళాలోని వస్త్రాలను తిలకిస్తున్న కార్పొరేటర్ మానస రాంప్రసాద్

జులైవాడ, ఆగస్టు 12: చేనేత హస్తకళ మేళాను ఆదరించాలని 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల రాంప్రసాద్ అన్నారు. హనుమకొండలోని తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన శ్రీ ఉషోదయ చేనేత హస్తకళ మేళాను కార్పొరేటర్ మానస రాంప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మేళాలోని వస్త్రాలను పరిశీలించి మాట్లాడారు. చేనేత హస్తకళ మేళాలో మంగళగిరి, పోచంపల్లి, బాగల్పూరి శారీస్, కొండపల్లి బొమ్మలు, గ్లాస్ బ్యాంగిల్స్, సారంగపూర్ ఐటమ్స్ వివిధ రకాల్లో లభిస్తున్నాయని నగరవాసులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ హస్తకళ మేళా సెప్టెంబరు 10వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శనిగరం కిశోర్, వరుకోలు మల్లేశ్, మోహన్ మండల్, ఫర్‌మాన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ రైతులకు నష్టం రానివ్వం : జంగా

బాలసముద్రం, ఆగస్టు 12 : రాష్ట్రంలో పామాయిల్ రైతులకు నష్టం రానివ్వమని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలో ఆయిల్ పామ్ విస్తరణ పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ద్వారా ఇతర ప్రాంతాల రైతులకు సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాను హబ్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయిల్ పామ్ గెలలను ప్రాసెసింగ్ చేయడానికి రాష్ట్రంలోని అశ్వారావుపేట, అప్పారావుపేటలో మిల్లులు అందుబాటులో ఉన్నాయని రాఘవరెడ్డి పేర్కొన్నారు.

కేయూలో అబ్బుర పరచిన ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: కేయూ క్యాంపస్‌లో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో 10 రోజుల సీఏటీసీ-6వ శిక్షణ క్యాంపును కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామ్ డొగ్రై నేతృత్వంలో సోమవారం 8వ రోజు కొనసాగించారు. ఆగస్టు 14 వరకు ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రదర్శనల్లో భాగంగా సోమవారం వర్సిటీ క్యాంపస్‌లో ఆర్మీ విన్యాసాలు నిర్వహించారు. అలాగే ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఆర్మీ ఉద్యోగ భవిష్యత్‌అనే అంశాలపై డిప్యూటీ కమాండెంట్ రవి సుణరాయ్, కెప్టెన్ డాక్టర్ పి.సతీశ్‌కుమార్, కెప్టెన్ ఎం. సదానందంలు ప్రత్యేక అవగాహన సమావేశం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుబేదారి మేజర్ సుహాస్కదం, లెఫ్టినెంట్ గణేశ్, సెకండ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, కెప్టెన్ డాక్టర్ సబిత, ఫస్ట్ ఆఫీసర్ బాలురెడ్డి, థర్డ్ ఆఫీసర్ శాంతి, జీసీఐ సుజిత, సీతలు, సూపరింటెండెంట్ అరుణ, కుమారస్వామి, సతీశ్, మహేశ్, ఏడుకొండలు, సౌరస్య క్యాడెట్లు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు సీఐటీయూ విరాళాల సేకరణ

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: కేరళలో ఇటీవల సంబంధించిన వరద బాధితుల సహాయర్థం సోమవారం కేయూ క్యాంపస్‌లో సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపుమేరకు స్థానిక సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ.. రూ.13,280 విరాళాలు సేకరించినట్లు తెలిపారు. కేరళ వరదలతో వాయ్‌నాడ్ ప్రాంతంలో 286 మందికి పైగా వరదలతో చనిపోయారని విచారం వ్యక్తం చేశారు. ఇండ్లు, రహదారులు దెబ్బతిని ఆర్థికంగా చాలా నష్టపోయారని తెలిపారు. కేరళ వాయ్‌నాడ్ బాధితులకు సీఐటీయూ తరుపున అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ యూనివర్సిటీ నాయకులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, ఆకుతోట రామచంద్రం, దేశిని రవికుమార్, సందీప్, శోభ, దామెర కృష్ణ, సంగాల శ్రీనివాస్, ఎస్.రాజు పాల్గొన్నారు.

పార్టుటైమ్ అధ్యాపకులందరికీ న్యాయం చేయాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: వర్సిటీ పరిధిలోని పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులందరికీ న్యాయం చేయాలని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట వర్సిటీ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు నిరసన, ప్రదర్శనలు చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. 16 పీరియడ్లతో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులందరినీ కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 11, జీవో 141 పేరుతో అధ్యాపకుల విభజించే కుట్రలను మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టో మేరకు వర్సిటీలో పనిచేస్తున్న 146 మంది కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని అన్నారు. ఈనెల 14న వర్సిటీలో నూతన పార్టుటైమ్ అధ్యాపకుల కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.విజయ్‌కుమార్, డాక్టర్ ఓ.మోహన్, డాక్టర్ సీహెచ్. ప్రవీణ్, శ్యాంసుందరాచారి, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్, సోల్తి కిరణ్‌గౌడ్, డాక్టర్ నరేందర్, డాక్టర్ సుభాష్, డాక్టర్ మామిళ్ళపల్లి కృష్ణసుమంత్ పాల్గొన్నారు.

జర్నలిస్టులను సమాజ సేవకులుగా పరిగణించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 12: జర్నలిస్టులను సమాజ సేవకులుగా పరిగణించాలని తెలంగాణ అభ్యుదయ వాదుల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ చింతకింది కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు ఐక్య వేదిక కోకన్వీనర్లు కొమ్ముల బాబు, దూడల సాంబయ్యలు మాట్లాడారు. జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు నిర్మించి అప్పగించాలని అప్పటి వరకు ఇంటి అద్దె కోసం నెలకు రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన జర్నలిస్టు యోగి రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా కుటుంబ సభ్యులకు అందించాలని కోరారు. తొలుత యోగిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం

వడ్డెపల్లి, ఆగస్టు 12: దివంగత జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబానికి హనుమకొండ బాలసముద్రంలోని చక్రవర్తి హాస్పిటల్ బాసటగా నిలిచింది. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ బాధ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయం చెక్కును చక్రవర్తి ఆస్పత్రి ఎం.డి. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ అభ్యుదవాదుల ఐక్య వేదిక కన్వీనర్ చింతకింది కుమారస్వామి, కో కన్వీనర్లు దూడల సాంబయ్య, కొమ్ముల బాబు, చీకటి ప్రకాష్, ఆకినేపల్లి వెంకటేశ్వర్లు, గాడిపెల్లి మధు తదితరులు దివంగత జర్నలిస్టు యోగిరెడ్డి కుటుంబ సభ్యుల నిమిత్తం రూ.5వేల నగదు ఆర్థిక సహాయాన్ని ప్రెస్‌క్లబ్ బాధ్యులకు అందజేశారు.

ఆటో, బైక్ ఢీ - పలువురికి గాయాలు

మడికొండ, ఆగస్టు 12: ఆటో బైక్, ఢీకొని పలువురికి గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన బి.మధు, సంధ్య, స్రవంతితో కలిసి ఆటోలో వరంగల్‌లోని ఆస్పత్రికి వెళుతున్నారు. ఈ క్రమంలో మడికొండ మెట్టుగుట్ట ఆర్చి వద్దకు రాగానే మడికొండకు చెందిన జిట్ట శ్రీనివాస్ తన బైక్‌పై ఎదురుగా వస్తూ మడికొండ చౌరస్తా వైపు వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆటో బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాస్ కాలు విరిగింది. ఆటో డ్రైవర్ తలకు, సంధ్యకు, స్రవంతికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. బైక్, ఆటోను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మోర్చా ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

హనుమకొండ టౌన్, ఆగస్టు 12: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం అదాలత్ నుంచి హనుమకొండ చౌరాస్తా వరకు త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకొని బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా చౌరస్తాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు రత్నా లక్ష్మీ, ఉష రెడ్డి, శ్రీలత, కవిత, శ్రీదేవి, వాణి, ఉష, సువర్ణ, రజినీ, స్వర్ణలత, లక్ష్మీ, సోని, కవిత, బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రసాద్, కళ్యాణ్, శ్రావణ్, పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి..



మాట్లాడుతున్న మంద కుమార్ మాదిగ

వడ్డెపల్లి, ఆగస్టు 12: ఎస్సీల వర్గీకరణ సాధించుకొని ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం వస్తున్న ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలికేందుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీతో పాటు వివిధ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి మంద కుమార్ మాదిగ పిలుపు నిచ్చారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ పోరాటంలో అమరులైన మాదిగలకు ఎస్సీ వర్గీరణ అంకితమని అన్నారు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటానికి పూర్తి సహకారం అందించిన సమాజంలోని అన్ని వర్గాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంద రాజు, బండారి సురేందర్, చాతళ్ల శివ, తిప్పారపు మల్లేశం, రేణుకుంట్ల మహేష్, మంద స్వరాజ్, క్రాంతి, మంద వర్ధన్ మాదిగ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు 12: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని కంచరకుంట, సాయినగర్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11 వరకు, ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, టీచర్స్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

▸▸ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల వెల్లువ



కమిషనర్‌కు వినతి పత్రాలు అందిస్తున్న ప్రజలు

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	18
హెల్త్, శానిటేషన్	14
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	10
టౌన్‌ప్లానింగ్	54
డీఆర్ఎఫ్	01
మొత్తం	97

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 12: గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి ఫిర్యాదుదారులకు సరైన సమయంలో స్పందించి సత్వరమే న్యాయం చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి (గ్రీవెన్స్ సెల్) కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కమిషనర్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తు స్వీకరించిన తర్వాత వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 97 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, డీసీపీ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ట్యాక్సీ విభాగం అధికారి బిర్రు రవీందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, బయాల జిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, టీపీఆర్‌వో కోళ రాజేశ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణకు ఏహెచ్‌టీయూ అడ్డుకట్ట



మాట్లాడతున్న సీఐ సుజాత

వరంగల్ క్రైం, ఆగస్టు 12: మానవ అక్రమ రవాణా నివారణకు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) పనిచేస్తుందని సీఐ సుజాత తెలిపారు. సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా 55వ డివిజన్ భీమారంలోని డైమండ్ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏహెచ్‌టీయూ సీఐ సుజాత మాట్లాడు తూ.. ఆడపిల్లలు, మహిళల రక్షణ కోసం షీటీం పనిచేస్తోందని, మానవ అక్రమ రవాణా నివారించేందుకు ఏహెచ్‌టీయూ యూనిట్ పనిచేస్తుందన్నారు. సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సుజాత సూచించారు. మిషన్ జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణి మాట్లాడు తూ.. ఆడపిల్లల భద్రత, లింగ సమానత్వంపై పోలీసు అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబర్లు 100, 181, 1098కి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఎస్ఐ ఫసియొద్దిన్, ఏఎస్ఐ భాగ్యలక్ష్మి, కానిస్టేబుళ్లు రామారావు, శ్రీనివాస్, భాస్కర్, కేయూ పీఎస్ ఏఎస్ఐ ప్రవీణ్, స్కూల్ ప్రిన్సిపాల్ జగదీష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

హసన్‌పర్తి, ఆగస్టు 12: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని పెంబర్తి గ్రామంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కేఆర్.దిలీప్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆవుల పవన్, మండల అధ్యక్షుడిగా సౌరం చరణ్‌తేజ పోటీ చేస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉండాలంటే కార్యకర్తలు పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ తోకల లక్ష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మేడిపల్లి మదన్‌గౌడ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు జోరుక పూల, మాజీ సర్పంచ్‌లు శాంతి భగత్, ఉట్కూరి సునిల్, భూక్య రాజు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెలవులో హనుమకొండ డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 12: హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.డి.అబ్దుల్‌హై మరోమారు సెలవుపై వెళ్లారు. ఆరోగ్యం పూర్తిగా సహకరించకపోవడంతో సోమవారం నుంచి రెండు నెలల పాటు సెలవు పెట్టారు. అనారోగ్య కారణాలరీత్యా ఇటీవలే విధుల్లో చేరిన అబ్దుల్‌హై.. వారం పాటు విధులు నిర్వర్తించి తిరిగి అనారోగ్యానికి గురయ్యారు. ఆరోగ్యం పూర్తి స్థాయిలో కోలుకునేంత వరకు తనకు సెలవులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించినట్లు తెలుస్తోంది. కాగా, తాత్కాలిక ఇన్‌చార్జిగా సమగ్ర శిక్ష గుణాత్మక విద్య కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించి వెళ్లారు.

ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలల్లో 'స్వచ్ఛదనం- పచ్చదనం'

కేయూ క్యాంపస్, ఆగస్టు 12: హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. శ్రీధర్ నేతృత్వంలో కళాశాల ఎన్ఎస్ఎస్-1, 2 వలంటీర్లు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను తొలగించి కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

వరంగల్ మెడికల్, ఆగస్టు 12: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో 5 కే రెడ్‌రన్ పోటీలు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి మాట్లాడు తూ.. యువతీ యువకులు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా, నివారణ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, సూపర్‌వైజర్ రామకృష్ణ, డీఎండీఓ కమలాకర్, మారి సంస్థ ప్రతినిధులు విజయ్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

19 సెల్‌ఫోన్లు రికవరీ

వరంగల్ క్రైం, ఆగస్టు 12: కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సోమవారం రికవరీ చేసి బాధితులకు అందించారు. స్టేషన్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసుల సహకారంతో కేయూ పోలీసులు ఒకే రోజు 19 ఫోన్లు రికవరీ చేసి సీఐ సంజీవ్ చేతుల మీదుగా బాధితులకు అందించడం జరిగింది.

మెట్టురామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మడికొండ, ఆగస్టు 12: శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై స్వయంభువుగా విరాజిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ ఉదయం స్వామివారికి ప్రాతఃకాల రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కలిగించారు. అనంతరం పెరుగన్నంతో ప్రత్యేకంగా అలంకరించి మహాన్నపూజ చేశారు. రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ధర్మకర్తలు దండిగం శ్రీనివాస్, బైరి రాజు, రొడ్డ దయాకర్, బోగి కేదారి, వస్కుల ఉమ, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డీజిల్ షెడ్‌వద్ద రైల్వే మజ్దూర్ యూనియన్ ధర్నా



మాట్లాడుతున్న పాక వేదప్రకాశ్

కాజీపేట, ఆగస్టు 12 : న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాజీపేట డీజిల్ షెడ్ వద్ద, సోమవారం ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీజిల్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.కే.జానీమియా అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాశ్ హాజరై ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. న్యూపెన్షన్ స్కీమ్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 18నెలల డీఏ బకాయిలను చెల్లించి, డీజిల్‌కాలనీ రైల్వే క్వార్టర్స్ మరమ్మతులు చేయాలన్నారు. రైల్వే కార్మికులకు హనుమకొండ, వరంగల్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో రిఫరెన్స్ అందించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాజేశ్వర్‌రావు, ఆఫీస్ బేరర్లు యాదగిరి, తిరుపతి, నరేశ్, సత్యనారాయణ, అశోక్, శ్రీనివాస్, నర్సయ్య, సదానందం, అంతయ్య రవీందర్, శ్రీనివాస్, సదానందం, పాక రవికుమార్, శ్రీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నార్త్ కాజీపేట కార్యాయలయం వద్ద..

మజ్దూర్ యూనియన్ జమ్మికుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసి, కొత్తపెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జమ్మికుంట బ్రాంచ్ సెక్రటరీ బచ్చలి శ్రీనివాస్, ట్రెజరర్ సాంబరాజు, వైస్ చైర్మన్ శివ, యూత్ కో- కన్వీనర్ ప్రవీణ్, భాస్కర్, రాజు, గాయత్రి రాజేందర్, స్వప్న పాల్గొన్నారు.

వాటర్‌ప్రూఫ్ కాస్ట్



పిల్లల లేత ఎముకలు చిన్నపాటి ఒత్తిడికే పుటుక్కున విరిగిపోతాయి, అంతే తేలికగా అతుక్కుంటాయి కూడా! కాబట్టి ఎముకలు అతుక్కోవడం కోసం వేసే కట్టు మన్నికదై, పిల్లల ఆటపాటలకు అడ్డురానిదై ఉండాలి. అలాంటి అత్యాధునిక వాటర్‌ప్రూఫ్ కాస్ట్‌లు, వాటి ఉపయోగాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఈ కట్టు బెస్టు

పిల్లల్లో ఫ్రాక్చర్లకు ఆస్కారం తక్కువ అనుకోవడం పొరపాటు. పోషణ తగ్గినా పిల్లల ఎముకలు పెళుసుగా మారతాయి. ఇలాంటి పిల్లల ఎముకలు చిన్నపాటి దెబ్బలకే విరిగిపోతాయి. పిల్లలను ఎత్తుకునే తప్పుడు పద్ధతుల వల్ల కూడా భుజాలు, మోచేతుల్లోని కీళ్లు పట్టు తప్పుతూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ముంజేతుల్లోని ఎముకలు విరిగిపోతూ ఉంటాయి. వీటికి తోడు ప్రమాదాల వల్ల కూడా పిల్లల ఎముకలు విరుగుతూ ఉంటాయి. కొందరు చేత్తో పిల్లల కాళ్లు పట్టుకుని తలకిందులుగా పైకెత్తి వెన్ను మీద తట్టడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు తుంటి కీలు జారుతుంది.

అవన్నీ గ్రీన్ స్టిక్ ఫ్రాక్చర్లే!



ఎండుకొమ్మను మధ్యకు విరిస్తే అది చక్కగా, సమంగా రెండు ముక్కలవుతుంది. అదే పచ్చని కొమ్మను విరిస్తే, అది పూర్తిగా విరిగిపోకుండా ఒక వైపు అతుక్కునే ఉంటుంది. పిల్లల్లో ఎముకలు విరిగితే ఇదే పరిస్థితి ఉంటుంది. తేలికగా అతుక్కునే స్వభావం ఉంటుంది కాబట్టి జనరల్ అనస్థీషియాలో భాగంగా సెలైన్ ద్వారా నొప్పి తగ్గించే ఇంజక్షన్ ఇచ్చేసి, విరిగిన ఎముకను సరిచేసి కట్టు వేస్తే సరిపోతుంది. పిల్లల్లో గాయాలు నయమయ్యే స్వభావం ఎక్కువ కాబట్టి 3 నుంచి 4 వారాల్లోనే ఎముక అతుక్కుపోతుంది. ఒకవేళ ఎముక రెండుగా విరిగిపోతే, ఎముకల లోపలి నుంచి మెత్తని వైర్లను చొప్పించి, వాటిని టెన్స్ నెయిల్స్‌తో కదలకుండా బిగించే విధానాన్ని అనుసరించవలసి వస్తుంది. చిన్నపాటి రంధ్రాల ద్వారానే సర్జరీ పూర్తవుతుంది. కాబట్టి కోతలు లాంటివి కనిపించవు. సర్జరీ తర్వాత వేసిన కట్టు మూడు వారాల పాటు ఉంచితే, విరిగిన ఎముకలు చక్కగా అతుక్కుంటాయి. ఎముక పూర్తిగా అతుక్కున్న తర్వాత 8 వారాలకు టెన్స్ నెయిల్స్‌ను తొలగించవలసి ఉంటుంది. తొడ ఎముక విరిగినప్పుడు కూడా ఇదే రకమైన సర్జరీతో ఎముకను అతికించి, నడుముకు స్పైకాను బిగించాల్సి ఉంటుంది. దీంతో ఎముక కదలికలకు గురి కాకుండా ఉంటుంది. ఒకవేళ ఫ్రాక్చర్ మధ్యలో కండ విరుక్కున్నప్పుడు, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఓపెన్ సర్జరీ అవసరమవుతుంది.

ఎముకలు విరిగిన వెంటనే...

వాపు, నొప్పి ఎముక విరిగిందనడానికి సంకేతాలు. ఇలాంటప్పుడు ఆస్పత్రికి వెళ్లేలోగా విరిగిన ఎముక మరింత దెబ్బ తినకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....

- విరిగిన ప్రదేశంలో మర్దన చేయకూడదు, రుద్దకూడదు
- స్వయంగా ఎముకలను సరిచేసే ప్రయత్నం చేయకూడదు
- కార్డ్‌బోర్డులను విరిగిన అవయవానికి ఆసరాగా ఉంచి, టవలు చుట్టి కదల్చకుండా ఆస్పత్రికి చేర్చాలి
- ఎముక చర్మాన్ని చీల్చుకుని బయటకు వస్తే, అదే స్థితిలో ఆస్పత్రికి చేర్చాలి

ఎముకను పెంచే టెన్స్ నెయిల్స్

పెద్ద ప్రమాదాల్లో ఎముక పూర్తిగా ఛిద్రమైపోయి, కొంత ఎముకను కోల్పోయిన సందర్భాల్లో విరిగిన ఎముకను అలాగే కలిపి అతికిస్తే, అవయవం కురచగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. పూర్వం ఈ సమస్యకు ప్రత్యామ్నాయాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు కోల్పోయిన ఎముక స్థానంలో కొత్త ఎముక పెరిగే వీలు కల్పించే వెసులుబాటు తాజాగా అందుబాటులోకొచ్చింది. టెన్స్ నెయిల్స్‌తో రెండు ముక్కలైన ఎముకను సరిపడా జాగాతో దగ్గరకు చేర్చడం వల్ల, ఆ జాగాలో ఎముక పెరిగి, మునుపటి స్థితికి తీసుకురావచ్చు. బోన్ లాస్‌ను భర్తీ చేయడం కోసం రూపొందిన ఈ సర్జరీ, ఎత్తును పెంచడానికి కూడా ఉపయోగపడుతోంది.

సౌకర్యవంతమైన 'డెల్టా డ్రై' కాస్ట్

పూర్వం ఎముక విరిగితే పిండికట్టు వేయించుకునేవాళ్లం. రోలర్ బ్యాండేజీల మీద పిఒపి చల్లి నీళ్లతో తడిపి పిండి కట్టు కట్టేవాళ్లు. కానీ ఈ కట్టు నీరు తగిలితే పిగిలిపోతాయి. కాబట్టి ఎముకలకు అవసరమైన ఒత్తిడి దక్కకపోగా, పిల్లల ఆటపాటలకు కూడా ఇవి అడ్డుపడుతూ ఉంటాయి. వీటి తర్వాత సింథటిక్ కాస్ట్స్ అందుబాటులోకొచ్చాయి. విరిగిన ప్రదేశం పైన కాటన్ రోల్ చుట్టి, దాని పైన సింథటిక్ కాస్ట్‌ను వేయడం వల్ల ఎముకలు కదలికలు లేకుండా చక్కగా అతుక్కుంటాయి. దీన్ని మించిన అత్యాధునికమైన కట్టు.. 'డెల్టా డ్రై'. దీన్లో కాటన్‌కు బదులుగా డెల్టా డ్రై అనే మెటీరియల్‌ను చుట్టి, దాని పైన సింథటిక్ కాస్ట్ వేయడం వల్ల తడికీ, నీళ్లకూ కూడా దూరంగా ఉండవలసిన అవసరం ఉండదు. ఈ కట్టుతో స్నానం చేయవచ్చు. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టవచ్చు. చర్మానికి అంటుకునేలా చుట్టే మెటీరియల్ మెత్తగా ఉండాలి, త్వరగా ఆరిపోయే స్వభావాన్ని కలిగి ఉండాలి. కాబట్టి డెల్టా డ్రైని ఇందుకోసం ఉపయోగిస్తున్నారు. దీని పైన వేసే సింథటిక్ రాయిలా గట్టిగా ఉండి అతుక్కునే ఎముకకు రక్షణ కల్పిస్తుంది. పిల్లలకు ఇలాంటి కట్టు ఎంతో ప్రయోజనకరం, సౌకర్యవంతం.

పిండి కట్టు ఎప్పుడు?

కొన్ని కట్టు బిగుసుకోడానికి ఆరు నుంచి ఎనిమిది నివిషాల సమయ నిడివి ఉంటుంది. కాబట్టి ఏదైనా పొరపాటు జరిగినా ఆ సమయంలోగా సరిదిద్దుకునే వెలుసుబాటు ఉంటుంది. కాబట్టి కొన్ని రకాల ఫ్రాక్చర్లకు ఈ కట్టు ఉపయోగకరంగా ఉంటాయి. పుట్టుకతోనే వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు, ఆ వంకరను సరిచేయడం కోసం వారానికో కట్టు చొప్పున పిండి కట్టు వేసుకుంటే కాళ్ల వంకర తగ్గిపోతుంది. ఇలా కొన్ని సందర్భాల్లో పిండి కట్ల అవసరం ఇప్పటికీ ఉంది.

పసరు కట్టు ప్రమాదకరం

ఆకు పసరును పిండి, అట్ట ముక్కలతో కట్టు కట్టేసే పసరు కట్లు ప్రమాదకరం. కొన్ని సందర్భాల్లో పూర్తిగా అవయవాలనే కోల్పోయే పరిస్థితి తలెత్తవచ్చు. ఒక ఐదేళ్ల పాపకు చేతి ఎముక విరిగి, బయటకు పొడుచుకు వచ్చిన సందర్భంలో ఆ పాప తల్లితండ్రులు పసరు కట్టును ఆశ్రయించారు. ఆ కట్టు వేసిన వ్యక్తి బయటకు పొడుచుకువచ్చిన ఎముకలను లోపలికి నెట్టి, సరిచేసి ఆకు పసరు పిండి, ఆకులను ఉంచి, కట్టు కట్టేశాడు. కానీ కండర గాయం అలాగే ఉండిపోవడంతో, ఇన్‌ఫెక్షన్ తలెత్తి జ్వరం, భరించలేని నొప్పితో పాప విలవిల లాడిపోయింది. దాంతో తల్లితండ్రులు పసరు కట్టు వేసిన వైద్యుని సూచన మేరకు ఆస్పత్రికి వచ్చినప్పుడు, కట్టు విప్పి చూస్తే అక్కడ మాంసాన్ని తింటున్న పురుగులు కనిపించాయి. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఆ చేతిని తొలగించడం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. చేతిని తొలగించకపోతే ప్రాణాలకు ప్రమాదమనే విషయాన్ని తల్లితండ్రులకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. కాబట్టి ఎముకలు విరిగినప్పుడు ఇలాంటి నాటు వైద్యాలను ఆశ్రయించకూడదు.

డాక్టర్ గుడ్లూరు మనోజ్ కుమార్
కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ అండ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఎమ్‌జిఎమ్ మెడికల్ సెంటర్, బంజారాహిల్స్, హైదరాబాద్.



ఫ్యావి ప్లానింగ్

కుటుంబ నియంత్రణ ఇలా...

సురక్షితమైన కుటుంబనియంత్రణ పద్ధతులు ఎన్నో ఉన్నాయి. అయితే వాటిలో దేన్ని ఉంచుకోవాలనే విషయంలో అయోమయాలుంటాయి. కాబట్టి వైద్యుల సూచన మేరకు తగిన కుటుంబనియంత్రణ పద్ధతిని ఎంచుకోవడంతో పాటు, ఈ కింది విషయాల పట్ల కూడా అవగాహన పెంచుకోవాలి.

- ఎంత వ్యవధిలో మీకు తల్లి కావాలనే ఉద్దేశం ఉంది?
- ఒక్కో కుటుంబనియంత్రణ పద్ధతి సామర్థ్యం ఎంత?
- దుష్ప్రభావాలు ఏవైనా ఉంటాయా?
- మీరెంత తరచుగా సెక్స్‌లో పాల్గొంటారు?
- ఏ పద్ధతి మీ ఇద్దరికీ సౌకర్యంగా ఉంటుంది?

ఎంతో సమర్థమైన కుటుంబనియంత్రణ పద్ధతులు కూడా ఒక్కోసారి ఫెయిలవుతూ ఉంటాయి. కాబట్టి గర్భం దాల్చే అవకాశాలను సమర్థంగా అడ్డుకునే పద్ధతిని ఎంచుకోవాలి.

కుటుంబ నియంత్రణ పద్ధతులు:

- **ఫీమేల్ అండ్ మేల్ స్టెరిలైజేషన్:** సర్జరీ ద్వారా శాశ్వతంగా గర్భం రాకుండా చేయవచ్చు.
- **లాంగ్ యాక్టింగ్ రివర్సిబుల్ కాంట్రాసెప్టివ్స్:** ఈ విధానంలో శరీరం లోపల అమర్చే పరికరం ద్వారా 3 నుంచి పదేళ్లపాటు గర్భం రాకుండా నియంత్రించవచ్చు. పిల్లలు కావాలనుకున్నప్పుడు ఆ పరికరాన్ని తీసేయొచ్చు.
- **షార్ట్ యాక్టింగ్ హార్మోనల్ మెథడ్స్:** మాత్రలు, మినీ



పిల్స్, ప్యాచ్, షాట్, వెజైనల్ రింగ్ - వీటి ద్వారా గర్భధారణను అడ్డుకోవచ్చు. షాట్‌ను ప్రతి మూడు నెలలకూ తీసుకోవాలి. మాత్రలు, వెజైనల్ రింగ్ ప్రతి రోజూ వాడాలి.
- **బ్యారియర్ మెథడ్స్:** కండోమ్స్, డయాఫ్రమ్, స్పాంజ్, సర్వికల్ క్యాప్ - వీటిని లైంగికంగా కలిసే ప్రతిసారీ వాడాలి.
- **న్యాచురల్ రిథమ్ మెథడ్స్:** ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులూ పాటించకుండా అండాలు విడుదల కాని సమయంలో సెక్స్‌లో పాల్గొనవచ్చు. ఈ రోజులను కచ్చితంగా గుర్తించడం కోసం ఓవ్యులేషన్ హోమ్ టెస్ట్ కిట్ లేదా ఫర్టిలిటీ మానిటర్‌లను ఉపయోగించాలి. అయితే, ఉజ్జాయింపు లెక్కలతో పాటించే ఈ విధానం ఫెయిలయ్యే అవకాశాలూ ఎక్కువే!

హెల్త్ వెల్త్

బరువు తగ్గించే 'ప్రొటీన్ పేసింగ్'

ప్రొటీన్ డైట్‌తో బరువు తగ్గవచ్చనే సూత్రం ఆధారంగా రూపొందిన సరికొత్త డైట్ ట్రెండ్... 'ప్రొటీన్ పేసింగ్'. దీని గురించి లోతుగా తెలుసుకుందాం!

ఈ డైట్‌లో భాగంగా బరువు, మెటబాలిజం, శక్తి ఖర్చుల ఆధారంగా రోజు మొత్తంలో ప్రొటీన్ ఇన్‌టేక్ తగ్గకుండా చూసుకుంటూ ఉండాలి. సాధారణంగా ప్రొటీన్ పేసింగ్‌ను క్రీడాకారులు అనుసరిస్తూ ఉంటారు. కానీ ప్రొటీన్ మెటబాలిజం డిజార్డర్లు లేని ఎవరైనా ఈ డైట్‌ను అనుసరించవచ్చు. శరీర బరువు, రోజు మొత్తంలో చేసే పనుల ఆధారంగా మొత్తం ప్రొటీన్ అవసరతను లెక్కించి, ఆ



పరిమాణాన్ని బహుళ భోజనాల రూపంలో రోజంతా తీసుకుంటూ ఉండాలి. ఇలా ప్రొటీన్ ఇన్‌టేక్‌ను రోజంతా సమమైన పరిమాణాల్లో తీసుకోవడం వల్ల ఆకలి తగ్గడంతో పాటు, కండరాల నిర్వహణ, మెటబాలిజంలు మెరుగుపడతాయి. ఈ విధానాన్ని అనుసరించడం వల్ల సంతృప్తిని పెరిగి ఆకలి తగ్గుతుంది. కాబట్టి అదనపు క్యాలరీలు శరీరంలో చేరే వీలు లేకుండా పోతుంది. ఆహార ప్రియత్వం, ఆహారం పట్ల విపరీతమైన వ్యామోహాలకు మనలోని ఎమ్‌సి4ఆర్, సివైఎఫ్‌ఐపి2 జన్యువులే ప్రధాన కారణాలు. ఈ రెండు చెడు జన్యువులను మచ్చిక చేసుకోవాలంటే ఆకలిని నియంత్రించే ఆహారం తినాలి. అందుకోసం ప్రొటీన్ పేసింగ్‌లో భాగంగా ప్రొటీన్‌ను ఎక్కువగా తినాలి. సాధారణంగా క్యాలరీలు తక్కువగా ఉండే ఆహారంతో బరువు తగ్గే ప్రయత్నం చేస్తూ ఉంటాం. కానీ ఇలాంటి డైట్‌తో కండరాలు క్షీణిస్తాయి. ప్రొటీన్ పేసింగ్‌లో ఆ సమస్య ఉండదు. ప్రొటీన్ వల్ల కండరాలు సంరక్షించబడతాయి. కాబట్టి ఆకలిని తగ్గించడం, క్యాలరీల ఇన్‌టేక్‌ను తగ్గించడం, మజిల్ మాస్‌ను సంరక్షించడం కోసం ప్రొటీన్ పేసింగ్‌ను అనుసరించవచ్చు.

ఫ్యాటీలివర్ డిసీజ్

కాలేయం దెబ్బతింది అనగానే మన ఆలోచన మద్యం మీదకు మళ్లుతుంది. మద్యంతోనే కాలేయానికి కొవ్వు పడుతుందనేది కూడా అపోహే! అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు కూడా కాలేయ కొవ్వుకు కారణాలే! వీటిని నియంత్రించుకోకపోతే పరిస్థితి కాలేయ మార్పిడికి దిగజారే ప్రమాదం ఉంటుంది.



కాలేయానికి కొవ్వు ముప్పు

సాధారణ ఆరోగ్య పరీక్షల్లో గ్రేడ్ వన్ ఫ్యాటీ లివర్ బయటపడుతూ ఉంటుంది. దీన్ని మనలో ఎవరం పెద్దగా పట్టించుకోం. ఇదేమంత ప్రమాదకరమైన పరిస్థితి కాదనీ, అందర్లో ఈ పరిస్థితి ఉంటుందనీ మనకి మనం నచ్చజెప్పుకుని సంతృప్తి పడుతూ ఉంటాం. కానీ దీన్ని, ముంచుకురాబోయే ప్రమాదానికి ముందస్తు హెచ్చరికలా పరిగణించాలి.

ఫ్యాటీ లివర్ ఎందుకు?

కాలేయానికి చక్కెర, కొవ్వు ప్రధాన శత్రువులు. శరీర ఎత్తుకు సరిపడా బరువు ఉండాలి. అంతకు మించితే శరీరంలో కొవ్వు పేరుకుపోతూ ఉంటుంది. ఆరడుగుల వ్యక్తి 75 కిలోల బరువున్నా పర్వాలేదు. అదే వ్యక్తి 5 అడుగుల ఎత్తే ఉంటే, అది అవసరానికి మించిన బరువు అవుతుంది. ఈ పరిస్థితిని బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా ఎవరికి వారు తెలుసుకోవచ్చు. బిఎమ్ఐ ఎంత ఎక్కువగా ఉంటే శరీరంలో కొవ్వు అంత ఎక్కువగా ఉందని అర్థం. శరీరంలో ఎంత ఎక్కువ కొవ్వు ఉంటే, కాలేయంలో కొవ్వు కణాలు కూడా అంత ఎక్కువగా ఉన్నాయని అర్థం. ఒకవేళ శరీర బరువు అదుపులో ఉన్నా, మధుమేహం ఉన్నా, కొవ్వు కాలేయంలో పేరుకుంటుంది. ఇందుకు కారణం రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడమే! కాబట్టి ఒబేసిటీ, మధుమేహం... ఈ రెండు సమస్యలూ కాలేయంలో కొవ్వు పేరుకునేలా చేస్తాయని తెలుసుకోవాలి.


ఇలా కనిపెట్టొచ్చు

ఫ్యాటీ లివర్... గ్రేడ్ 1, 2, 3 ... ఈ మూడు దశలు దాటిన తర్వాత ఫైబ్రోసిస్‌లో కూడా 3 గ్రేడ్లను దాటి, అంతిమంగా సిర్రోసిస్‌కు చేరుకుంటుంది. ఇలా దశలు దాటుకుని తిరిగి బాగుచేయలేనంతగా కాలేయం పాడవకుండా ఉండాలంటే ఫ్యాటీ లివర్ పరిస్థితిని ప్రారంభంలోనే తీవ్రంగా పరిగణించి, అక్కడితో అడ్డుకట్ట వేయాలి. ఫ్యాటీ లివర్ మొదటి మూడు దశలు, ఫైబ్రోసిస్‌లో మొదటి రెండు దశల్లో కూడా ఎటువంటి లక్షణాలూ కనిపించకపోవచ్చు. కాబట్టే కాలేయం తిరిగి సరిదిద్దలేనంతగా, తీవ్రంగా డ్యామేజ్ అయిన తర్వాతే తెలుసుకునే పరిస్థితి ఉంటోంది. సిర్రోసిస్ దశ దాటే సమయంలో మాత్రమే కామెర్లు, రక్తపు వాంతులు, పొట్టలో నీరు చేరడం లాంటి తీవ్రమైన లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి అల్ట్రాసౌండ్, లివర్ ఫంక్షన్ పరీక్షల ద్వారా ఎవరికి వారు తమ కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకుంటూ ఉండాలి. మధుమేహులైతే 25 ఏళ్ల వయసు నుంచీ, స్థూలకాయులు పాతికేళ్ల వయసు నుంచీ, మధుమేహం సమస్య లేకుండా, ఎత్తుకు సరిపడా బరువు ఉన్నవాళ్లు 50వ ఏట నుంచీ ప్రతి ఆరు నెలలకోసారి ఈ పరీక్షలు చేయించుకోవాలి. ఫ్యాటీ లివర్ ఏ వయసులోనైనా రావచ్చు. కాబట్టి వయసు, మధుమేహం, అధిక బరువు ఆధారంగా ఫ్యాటీ లివర్ వచ్చే అవకాశాలను అంచనా వేసుకుని, పరీక్షలతో నిర్ధారించుకుంటూ ఉండాలి.



నియంత్రణ ఇలా...

మధుమేహం వంశపారంపర్య సమస్య కాబట్టి దాన్ని నియంత్రించే అవకాశం లేదు. అయితే మెరుగైన ఆహారంతో, ముందు జాగ్రత్త చర్యలతో మధుమేహాన్ని వాయిదా వేయవచ్చు. మధుమేహం వచ్చినా, తగిన మోతాదుల్లో మందులు వాడుకుంటూ, ఆహార నియమాలు పాటిస్తూ కూడా నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఫ్యాటీ లివర్ తొలి దశలోనే ఉన్నప్పుడు దాన్ని జీవనశైలి మార్పులతో మెరుగు పరుచుకోవచ్చు. బరువు తగ్గించుకుని, సమతులాహారం, క్రమం తప్పని వ్యాయామంతో ఈ స్థితిలో ఉన్న కాలేయాన్ని సరిదిద్దుకోవచ్చు. ఒకవేళ ఫ్యాటీ లివర్ గ్రేడ్ పెరిగి కాలేయ పనితీరును ప్రభావితం చేస్తుంటే, ఎల్ఎఫ్‌టి, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎమ్మారైలతో తీవ్రతను అంచనా వేసి జీవనశైలి మార్పులను అనుసరించడంతో పాటు, కొన్ని మందులను కూడా వాడుకోవలసి ఉంటుంది. సమస్య మరింత తీవ్రమైన సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. ఫ్యాటీ లివర్ కేన్సర్‌కు కూడా దారి తీయవచ్చు.



ఫ్యాటీ లివర్ రాకుండా..

- బరువు అదుపులో ఉంచుకోవాలి
- మధుమేహాన్ని మందులతో నియంత్రణలో ఉంచుకోవాలి
- రెడ్ మీట్ తగ్గించాలి (మటన్, పోర్క్, బీఫ్)
- క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- జంక్‌పుడ్ తగ్గించాలి
- హైపో థైరాయిడ్‌ను మందులతో నియంత్రణలో ఉంచుకోవాలి
- అధిక కొలెస్ట్రాల్‌ను మందులతో అదుపులో పెట్టుకోవాలి
- మద్యం మానేయాలి

డాక్టర్ ఆర్.వి. రాఘవేంద్ర రావు
సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, రెనోవా హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్.



మీకు తెలుసా?

నీరసం ఇలా దూరం

అదే పనిగా నీరసం వేధిస్తుంటే మన ఆహార, జీవనశైలులను పరిశీలించుకుని తగిన మార్పులు చేసుకోవాలి. నీరసాన్ని తగ్గించుకోవడం కోసం ఈ కింది అంశాలను గమనించుకోవాలి.

ఆహారం ఇలా: శక్తిని అందించే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం అరటిపండ్లు, బ్రౌన్ రైస్, చేపలు, చిలగడ దుంపలు, గుడ్లు, ఓట్స్, క్వినోవా, అవకాడోలను ఆహారంలో చేర్చుకోవాలి.

వ్యాయామం: వ్యాయామంతో శరీరం, మనసు చలాకీగా మారతాయి. కాబట్టి ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.

చక్కెర: చక్కెర శారీరక శక్తిని హరిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతూ, తరుగుతూ ఉంటే, నిస్సత్తువ ఆవరిస్తుంది. అలాగే ప్రాసెస్డ్ పదార్థాలను తినడం మానేయాలి. పాలిష్ పట్టని బియ్యం, గోధుమలను తీసుకోవాలి.

ప్రొటీన్: ప్రొటీన్ అధికంగా పదార్థాలను స్నాక్స్‌గా తీసుకోవాలి. ఇందుకోసం యాపిల్, పీనట్ బటర్, ఉడకబెట్టిన గుడ్లు, పాప్‌కార్న్, వేయించిన శనగలు తినాలి.

విశ్రాంతి: అలసటగా అనిపించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం అవసరం. శరీరానికి సరిపడా విశ్రాంతి దక్కకపోయినా, నీరసం, నిస్సత్తువ ఆవరిస్తాయి.

విటమిన్ డి: విటమిన్ డి లోపం కూడా నిస్సత్తువకు కారణమే! కాబట్టి వైద్యుల సలహా మేరకు డి విటమిన్ లోపాన్ని పరీక్షించుకుని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి. అలాగే, ఉదయం, సాయంకాలపు నీరెండలో కనీసం 15 నిమిషాల పాటైనా గడుపుతూ ఉండాలి.

సంగీతం: శ్రావ్యమైన సంగీతంలో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి శరీరాన్ని చలాకీగా ఉంచడానికి తోడ్పడతాయి. కాబట్టి రోజులో కొంత సేపు నచ్చిన సంగీతం వినాలి.

చల్ల నీళ్ల స్నానం: చల్లదనం కండరాలను బలపరుస్తుంది. మెటబాలిజంను పెంచుతుంది. కాబట్టి చల్లనీటితో స్నానం చేస్తూ ఉండాలి.

నవ్వడం: నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి, ఇమ్యూనిటీ పెరుగుతుంది. అలాగే నిస్సత్తువ కూడా దూరమవుతుంది. అందుకోసం స్నేహితులతో సరదా సమయం గడపడం, పిల్లలతో ఆడుకోవడం, కామెడీ సినిమాలు, షోలు చూడడం చేయాలి.



నీళ్లు: సరిపడా నీళ్లు తాగకపోయినా నిస్సత్తువ వేధిస్తుంది. కాబట్టి రోజులో రెండు నుంచి మూడు లీటర్లకు సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

కాఫీ: పరిమితంగా కాఫీ తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. కాఫీలోని కెఫీన్ శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది.

వాసనలు: పెప్పర్‌మింట్, దాల్చిన చెక్క, నిమ్మ, రోజ్‌మేరీ ఎసెన్షియల్ నూనెలను డిఫ్యూజర్‌లో వేసి వాసనలు పీల్చడం వల్ల ఫలితం ఉంటుంది.

నిద్ర: 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి. నిద్రలేమి బడలికను కలిగిస్తుంది.

దిక్సూచి DIKSUCHI

తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజ్‌లో 120 సీట్లు ఉన్నాయి. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకు విడిగా మరో నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తి చేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xi4m3tqలో చదవండి.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్ర ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్& నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్‌ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ

హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రోక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

నవ్య | చిత్రజ్యోతి

అది నా దురదృష్టం



మహేశ్‌బాబు, సోనాలి బింద్రే జంటగా కృష్ణవంశీ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ సినిమా 'మురారి'. ఇటీవలే ఆ సినిమా రీ రిలీజై క్రేజీ కలెక్షన్లు సాధిస్తున్న తరుణంలో దర్శకుడు సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించారు. వారితో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "పవన్‌కల్యాణ్‌తో సినిమా చేయాలనుకున్నాను. ఆయనకు కథ కూడా చెప్పాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ ఆయనతో సినిమా చేసి ఉంటే.. అది పెద్ద హిట్టయ్యేది. ఈ విషయంలో నాది దురదృష్టం అనుకోవాలి" అని పేర్కొన్నారు. అలాగే, మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ హీరోగా 'మురారి' సీక్వెల్ ఉంటుందా అని అభిమానులు ఆయన్ని అడిగారు. "ఆ సీక్వెల్ విషయం గౌతమ్ తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది" అని కృష్ణవంశీ బదులిచ్చారు

లేటెస్ట్ అప్‌డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న తాజా చిత్రం ఎన్‌బీకే 109కి సంబంధించి లేటెస్ట్ అప్‌డేట్ వచ్చేసింది. బాబీ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో ఈ సినిమా కోసం తీస్తున్న కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనీ సోమవారం సోషల్ మీడియా ద్వారా దర్శకుడు బాబీ వెల్లడించారు. 'బాలకృష్ణ ఎనర్జీనీ, అద్భుతమైన అభినయాన్ని ఈ సినిమాలో చూస్తారు. థియేటర్లలో ఆ అనుభూతి కోసం సిద్ధంగా ఉండండి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా టైటిల్ గురించి రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకే టైటిల్ ఎప్పుడు ప్రకటిస్తారా అని అభిమానులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు దర్శకుడు బాబీ. త్వరలోనే టైటిల్, టీజర్ విడుదలవుతాయని వెల్లడించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ నటిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీత దర్శకుడు.

ఏడ్చుకుంటూ ఇంటికి...



వరుస చిత్రాలతో దూసుకుపోతున్నారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను ఆమె గుర్తుచేసుకున్నారు. "నటిగా నాకు మొదట్లో అవకాశాలు అంత సులువుగా వచ్చేవి కావు. ఆడిషన్లకు హాజరు కావడం.. అందులో సెలక్ట్ కాలేదని తెలిసి ఇంటికి ఏడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ ప్రయత్నాల్లో ఉండగా.. ఓ సినిమాలో నటిగా అవకాశం రావడంతో ఎగిరి గంతేశా. కానీ ఆ ప్రాజెక్ట్ కొన్నాళ్లకే ఆగిపోయింది. ఆ తర్వాత కూడా నాకు అవకాశాలు వెంట వెంటనే ఏమీ రాలేదు. దాదాపు పాతిక ఆడిషన్లలో తిరస్కరణకు గురయ్యాను. అలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేదాన్ని" అని చెప్పారు.

జాతి కోసం సాహస పోరాటం



తమిళ హీరో సూర్య నటిస్తున్న భారీ ప్రతిష్టాత్మక చిత్రం 'కంగువ' అక్టోబర్ 10న విడుదల కానుంది. దిశా పటానీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు శివ రూపొందిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మాతలు. మెస్మరైజింగ్ మేకింగ్‌తో రూపుదిద్దుకుంటున్న 'కంగువ' ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. యుద్ధాలు, అక్రమణలు చేస్తూ ఎదురొచ్చిన వారిని క్రూరంగా చంపే భయంకరమైన విలన్‌గా బాబీ డియోల్ ఈ ట్రైలర్‌లో కనిపించారు. తన జాతి కోసం, తనవారి కోసం సాహసోపేతమైన పోరాటాలు చేసే ధీరుడిగా సూర్య పాత్ర ఉంది. భారీ నౌకలపై దాడి చేసే సన్నివేశాలు, హై క్వాలిటీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణలు నిలుస్తాయి. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మరో చిత్రం 'కంగువ' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

బట్టతలలా కనిపించాలి అంటే సరే అన్నా



'విజయవాడ రావడం చాలా హ్యాపీగా ఉంది. డైట్‌ను పక్కన పెట్టి 'బాబాయ్ హోటల్'లో ఇడ్లీలు తినేశా. నా 'అపరిచితుడు' సినిమా విగిలిన ప్రాంతాలకంటే విజయవాడలోనే ఎక్కువ రోజులు ఆడింది మంచి సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంత సపోర్ట్ చేస్తారో నాకు తెలుసు' అన్నారు హీరో విక్రమ్. ఆయన నటించిన పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'తంగలాన్' ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక మోహనన్, హాలీవుడ్ నటుడు డేనియల్, నిర్మాత ధనుంజయన్‌తో కలసి ప్రమోషన్స్ నిమిత్తం విజయవాడ వెళ్లిన విక్రమ్ మాట్లాడుతూ 'నేను విభిన్న పాత్రలు పోషించిన చిత్రాలన్నీ మీరు ఆదరించారు. ఈ సినిమాలోనూ కొత్తగా కనిపిస్తా. బట్టతలగా కనిపించే గెటప్‌లో కనిపించాలని దర్శకుడు పా.రంజిత్ చెప్పగానే సరేనన్నా. ఈ సినిమాలో రెగ్యులర్ ఫైట్లు, పాటలు ఉండవు. భావోద్వేగాలు బాగా ఉన్న కథ ఇది. 'తంగలాన్' మిమ్మల్ని సరికొత్త లోకంలోకి తీసుకెళుతుంది' అన్నారు.

గురువారం నాడే విడుదల

సినిమాలకూ.. శుక్రవారానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఎన్నో ఆశలతో తెరకెక్కించిన సినిమాలను ఆ రోజున విడుదల చేసి బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు చిత్ర ప్రముఖులు. పండగ సీజన్లలో లేదా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్పించి శనివారం, గురువారం, బుధవారం వంటి ఇతర తేదీల్లో సినిమాలు విడుదలవ్వడం అరుదు. కానీ ఈ ఏడాది అనేక సినిమాలు శుక్రవారం ట్రెండ్‌ను బ్రేక్ చేసి.. గురువారాన్ని విడుదల తేదీగా మార్చుకున్నాయి.. ఆ చిత్రాలివే.



నాని నటించిన లేటెస్ట్ చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో విభిన్న కథాంశంతో తెరకెక్కిందీ చిత్రం. అధిక కోపం గల ఓ యువకుడు.. తన కోపాన్ని నియంత్రించుకోవడానికి ప్రతీ శనివారం ఏం చేశాడనేది ఈ సినిమా కథ. ఈ నెల 29న గురువారం విడుదవుతున్న ఈ చిత్రంలో నాని పాత్రలో అనేక రకాల షేడ్స్ ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇంతకు ముందు వీరి కలయికలో వచ్చిన 'అంటే సుందరానికీ' సినిమా..కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినా.. విమర్శకుల ప్రశంసలను పొందింది.

డ్యూయల్ రోల్‌లో...



తమిళ కథానాయకుడు విజయ్ డ్యూయల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). మీనాక్షీ చౌదరి కథానాయిక. వెంకట్ ప్రభు దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు 5న గురువారం విడుదలవుతోంది. భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకి అధిక ప్రాధాన్యం ఉండనుంది.





వేటగాడిగా రజనీ..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా సందర్భంగా అక్టోబరు 10న గురువారం ప్రేక్షకులను పలకరించనుంది. 'జైలర్'తో సూపర్ హిట్ కొట్టి మంచి ఫామ్‌లో ఉన్న రజనీకాంత్‌కు ఈ సినిమా అంతకుమించిన సక్సెస్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మాస్ ఎంటర్టైనర్

విశ్వక్ సేన్ కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మాస్ ఎంటర్టైనర్ 'మెకానిక్ రాకీ'. సమాజంలో జరుగుతున్న ఓ కుంభకోణం నేపథ్యంలో ఈ సినిమా కథాంశం సాగనుంది. ఇందులో విశ్వక్ సరసన మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా అక్టోబరు 31న గురువారం విడుదల కానుంది.

బయోపిక్‌లో శివకార్తీకేయన్



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించే తమిళ నటుడు శివ కార్తీకేయన్. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న బయోపిక్ 'అమరన్' వహిస్తున్నారు. ఈ సినిమా అమరులైన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. సాయిపల్లవి హీరోయన్‌గా నటిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబరు 31 గురువారం విడుదలవుతోంది.

'కల్కి' కూడా..

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం గురువారం రిలీజై సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ గురువారం (ఆగస్టు 15)న కూడా డజనుకు పైగా చిత్రాలు సందడి చేయనున్నాయి. గురువారం సెంటిమెంటు ఈ సినిమాలకు కలసి వస్తుందేమో చూడాలి.



ప్రేమ, వినోదం.. ఉత్సవం

దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా లీడ్ రోల్స్ పోషించిన 'ఉత్సవం' చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది. ప్రేమ, వినోదం, భావోద్వేగం.. అంశాలతో రూపుదిద్దుకొన్న కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇదని దర్శకుడు అర్జున్ సాయి చెప్పారు. ప్రకాశ్‌రాజ్, నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించిన ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విడుదల చేస్తోందని నిర్మాత సురేశ్ పాటిల్ చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

ముఫాసా కోసం షారుఖ్



ప్రపంచవ్యాప్తంగ ఎంతో మంది ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన 'ముఫాసా ది లయన్ కింగ్' ఫ్రాంఛైజ్‌లోని కొత్త సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ సినిమా కోసం తొలిసారిగా బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ తన ఇద్దరు కుమారులతో కలసి డబ్బింగ్ చెబుతున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు షారుఖ్ గొంతు అరువిస్తుండగా, ఆర్యన్ ఖాన్ సింబా పాత్రకి, చిన్నప్పటి ముఫాసా పాత్రకు షారుఖ్ చిన్న కుమారుడు అబ్రమ్ ఖాన్ డబ్బింగ్ చెబుతున్నారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



తన దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన సాయి కిశోర్ దర్శకుడిగా మారి రూపొందించిన 'ధూమ్‌ధామ్' చిత్రం టీజర్‌ను హీరో గోపీచంద్‌తో కలసి విడుదల చేశారు దర్శకుడు శ్రీను వైట్ల. గోపీమోహన్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించారు. ఈ సందర్భంగా నిర్మాత ఎమ్మెస్ రామ్‌కుమార్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఉన్న మిత్రుల్లో హీరో గోపీచంద్ ఒకరు. చక్కని ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా సినిమాను తీర్చిదిద్దాం. భారీ బడ్జెట్‌తో లావిష్‌గా నిర్మించాం. విదేశాల్లో కూడా షూటింగ్ చేశాం. సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

స్వాతంత్రం.. మా స్వాతంత్ర్యం



తన ఆహార విధానంతో ఆరోగ్య డైట్ ప్రారంభించిన లక్ష్మణ్ పూడి తన మాతృ సంస్థ ప్రజానాట్య మండలి రూపకల్పనలో ఎం. శేషగిరిరాసిన 'స్వాతంత్రం.. మా స్వాతంతీర్యం' పాటను పాడారు. శ్రీనివాస్ నందుల రాసిన ఈ పాటను తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. దేశం మీద ప్రేమతో నిరక్షరాస్యులను మేల్కొల్పడానికి ఈ పాటను రూపొందించినట్లు లక్ష్మణ్ పూడి చెప్పారు.



సీనియర్ నటుడు నరేశ్ తన యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాకీ ష్రాఫ్, పూనమ్ థిల్లాన్, జయసుధ, సుహాసిని, కుష్బూ, సాయి దుర్గాతేజ్, మంచు మనోజ్, నారా రోహిత్ , దర్శకుడు మారుతి తదితరులు హాజరయ్యారు. హీరో కృష్ణ, విజయనిర్మలతో ఏర్పాటు చేసిన స్ఫూర్తి వనాన్ని ఈ సందర్భంగా నరేశ్ ప్రారంభించారు.

'అతడు' సినిమా చూసేవాడ్ని



'మహారాజా' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు తమిళ నటుడు విజయ్ సేతుపతి. తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉన్న ఆయన.. ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మహేశ్‌బాబు కథానాయకుడిగా నటించిన 'అతడు' సినిమా నాకెంతో ఇష్టం. జీవితంలో ఒడిదుడుకులకు లోనైన సమయాల్లో ఆ సినిమాను రిపీట్ మోడ్‌లో చూసేవాడ్ని. ఆ సినిమాలో మహేశ్ నటన అద్భుతం. ఆయన పలికిన ప్రతీ డైలాగ్, సన్నివేశం నాకు బాగా గుర్తుండిపోతుంది. త్రివిక్రమ్ దర్శకత్వ పటిమ.. ఆయన రాసిన సన్నివేశాలతో తెరపై భావోద్వేగాలు బాగా పండాయి. ముఖ్యంగా హీరోహీరోయిన్ల కెమిస్ట్రీ, బ్రహ్మానందం కామెడీ, పాటలు నాకు బాగా నచ్చాయి" అని తెలిపారు.

వినేశ్ అప్పీలుపై తీర్పు నేడే

న్యూఢిల్లీ: రెజ్లర్ వినేశ్ ఫొగట్ అనర్హతపై ఎలాంటి తీర్పు రానుందోనని యావత్ క్రీడా ప్రపంచం ఊపిరిబిగబట్టి ఆత్రుతగా ఎదురుచూస్తోంది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల కేటగిరీలో ఫొగట్ కేవలం 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంతో ఆమెను ఫైనల్లో పాల్గొనకుండా అనర్హత వేటు వేశారు. దీనిపై ఆమె కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (కాస్)ను ఆశ్రయించింది. కనీసం తనకు రజతమైనా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కాస్‌కు వినేశ్ అప్పీలు చేసుకుంది. దీనిపై వాదనలు జరగగా.. మంగళవారం తుది తీర్పు వెలువడనుంది. కాగా, నిబంధనల ప్రకారం రెండు రజతాలు ఇవ్వడం సాధ్యం కాదని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ చీఫ్ లలోవిచ్ చెప్పాడు. కానీ, కోర్టు తీర్పు ప్రకారం నడుచుకొంటామని తెలిపాడు.

రెజ్లర్‌దే 'బరువు' బాధ్యత

ఐఓఏ చీఫ్ ఉష



న్యూఢిల్లీ: బరువు విషయంలో అథ్లెట్లదే బాధ్యతని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష స్పష్టంజేసింది. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫైనల్‌కు దూరమైన రెజ్లర్ వినేశ్ ఫొగట్ బరువును నియంత్రించడంలో విఫలమయ్యారంటూ భారత బృందం వైద్యుడు పార్దీవాలాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విమర్శలను పీటీ ఉష కొట్టి పారేసింది. రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో విభాగాల్లో.. బరువు, ఫిట్‌నెస్ విషయాల్లో ఆ అథ్లెట్, వారి కోచ్‌దే బాధ్యత. అంతేతప్ప ఆ విషయంలో ఐఓఏ నియమించిన ముఖ్య వైద్యాధికారి దిన్షా పార్దీవాలా, అతడి బృందానికి సంబంధం లేదు. అందువల్ల పార్దీవాలపై ఆరోపణలు అర్థరహితం' అని ఉష పేర్కొంది.

వెయింగ్ రూల్స్‌లో మార్పులు?

న్యూఢిల్లీ: వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు క్రీడావర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో రెజ్లర్ల వెయింగ్ (బరువు తూచడం) విషయంలో మార్పులు చేయాలని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. అథ్లెట్ల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని చేసే నిబంధనల సడలింపులు వీలైనంత త్వరగా అమల్లోకి వస్తాయని భావిస్తున్నారు. తన కేటగిరీలో కేవలం 100 గ్రాముల అధిక బరువు ఉందనే కారణంతో తనను ఫైనల్లో పాల్గొనకుండా అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ వినేశ్.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కొందరు మాజీ రెజ్లర్లు వెయింగ్ నిబంధనలు మార్చాలని సూచిస్తున్నారు. వరల్డ్‌కప్‌తోపాటు కొన్ని ప్రముఖ టోర్నీల్లో రెండు కిలోల బరువు వరకు అనుమతిస్తున్నారు. కానీ విశ్వక్రీడల్లో వెసులుబాటు ఇవ్వడం లేదు. అయితే, రెండోరోజు పోటీల్లో పాల్గొనే రెజ్లర్లకు ఒక కిలో అదనంగా బరువు ఉన్నా అనుమతించాలని అమెరికా రెజ్లింగ్ గ్రేట్ జోర్డాన్ బర్రోగ్స్ సూచించాడు.



మెరుపులు.. మరకలు

వేలాదిమంది అథ్లెట్లు పాల్గొనే ఒలింపిక్స్ ఫ్యాన్స్‌ను ఎంత ఉర్రూతలూగిస్తాయో అంతకుమించి వివాదాలూ సృష్టిస్తాయి. పారిస్ విశ్వక్రీడలు కూడా అందుకు మినహాయింపు కాదు. పక్షం రోజులకుపైగా ప్రపంచ క్రీడాభిమానులకు మజా పంచిన పారిస్ క్రీడల్లో మెరుపులు, మరకలపై ఓ లుక్కేద్దాం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



'సాంస్కృతిక' పొరపాట్లు

ప్రారంభోత్సవంలో ప్రదర్శించిన కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జీసస్‌ను, క్రైస్తవ మతాన్ని కించపరిచేలా ఉన్నాయని విమర్శలొచ్చాయి. అయితే మానవుల మధ్య హింస ఎంత అసంబద్ధమో చాటిచెబుతూ ప్రదర్శించిన ఆ కార్యక్రమాల వెనుక ఉద్దేశం మంచిదే అయినా..ప్రదర్శించిన తీరులో పొరపాట్లు జరిగాయని నిర్వాహకులు వివరించుకున్నారు. ఇక, పరేడ్‌లో దక్షిణ కొరియా అథ్లెట్లను ఉత్తర కొరియా అథ్లెట్లుగా ఉచ్చరించడం పెద్ద దుమారం లేపింది. ఇందుకు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది. క్రీడా గ్రామంలో సౌకర్యాలపై అథ్లెట్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేశారు. అమెరికన్ టెన్నిస్ స్టార్ కొకొ గాఫ్ అరకొర సౌకర్యాలపై ఫిర్యాదు కూడా చేసింది. పారిస్‌లో ఎండ అదరగొట్టడంతో..క్రీడా గ్రామంలో ఏసీలు లేక అథ్లెట్లు ఉక్కిరిబిక్కిరయ్యారు. దాంతో కొందరు స్టార్ ఆటగాళ్లు నగరంలోని లగ్జరీ హోటళ్లకు వెళ్లిపోయారు. పారిస్‌లో భారత ఎంబసీ అధికారులు తమ క్రీడాకారులకోసం 40 ఏసీలు ఏర్పాటు చేయాల్సి రావడం గమనార్హం.

మను మరో చరిత్ర



భారత షూటింగ్ సంచలనం మను భాకర్ రెండు కాంస్య పతకాలతో కొత్త చరిత్ర లిఖించింది. మహిళల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో, 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సరబ్ జోత్‌తో కలిసి కాంస్య పతకాలు కొల్లగొట్టింది. మూడో పతకాన్ని త్రుటిలో చేజార్చు

నీరజ్ వర్సెస్ నదీమ్



భారత్ స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వర్ణానికి పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ అడ్డు పడ్డాడు. అంచనాలను తలకిందులు చేస్తూ..డిఫెండింగ్ చాంప్ నీరజ్‌ను వెనక్కు నెట్టిన అర్షద్ ఒలింపిక్ రికార్డ్ (92.97 మీటర్లు)తో పసిడి పతకం చేజిక్కించుకున్నాడు.

ఆసీస్ చిన్నది.. అదరగొట్టింది

ఆస్ట్రేలియాకు చెందిన స్కేట్‌బోర్డ్ సంచలనం అరిసా ట్రె పారిస్‌లో అదరగొట్టింది. 14 ఏళ్ల ఈ చిన్నది ఫైనల్లో పింక్ హెల్మెట్‌తో బరిలోకి దిగి ఏకంగా స్వర్ణ పతకం దక్కించుకుంది. ఇలా, విశ్వ క్రీడల్లో పసిడి నెగ్గిన పిన్న వయసు ఆసీస్ అథ్లెట్‌గా అరిసా రికార్డుకెక్కింది.

స్విమ్మర్ల అస్వస్థత

కాలుష్య ప్రమాణాలు తక్కువ స్థాయిలో ఉన్న సెన్ నదిలో పోటీలు నిర్వహించడంపై స్విమ్మర్లు ఆగ్రహం వ్యక్తంజేశారు. నదిలోని ఈ కోలీ బాక్టీరియాతో బెల్జియం స్విమ్మర్ క్లేరీ మిచెల్ అస్వస్థతకు గురైంది. దాంతో బెల్జియం జట్టు మిక్స్‌డ్ రిలే ఈవెంట్ నుంచి వైదొలగింది. ట్రయాథ్లెట్లు బ్రిఫర్డ్ (స్విట్జర్లాండ్), మిస్లావ్‌చుక్ (కెనడా), ఓ స్వర్ణం, రజతం నెగ్గిన ఐర్లాండ్ స్విమ్మర్ డానియల్ వైఫెన్ పోటీల అనంతరం అస్వస్థతకు లోనయ్యారు.

బాక్సర్ల లింగ వివాదం






లింగ నిర్ధారణ పరీక్షల్లో విఫలమై నిరుడు ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ నుంచి అనర్హతకు గురైన అల్జీరియాకు చెందిన ఇమేని ఖెలీఫ్, తైవాన్ బాక్సర్ లీ యు టింగ్‌లను ఒలింపిక్స్‌లో పోటీపడడంపై తీవ్ర దుమారం నెలకొంది. పురుష లక్షణాలున్న వీరిద్దరినీ మెగా ఈవెంట్‌లో ఎలా ఆడిస్తారంటూ చాలామంది తప్పుపట్టారు. అయితే, లింగ వివాదం ఏర్పడినా.. ఖెలీఫ్, లీ యు స్వర్ణ పతకాలు సాధించడం విశేషం.

లైల్స్..ఫొటో ఫినిష్‌లో



నోవా లైల్స్ రూపంలో పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో కొత్త స్టార్ వచ్చాడు. అయితే ఈ ఫైనల్ రేసు రేపిన ఉత్కంఠ అంతా ఇంతా కాదు. అమెరికా స్టార్ నోవా లైల్స్, జమైకా అథ్లెట్ కిషానే థాంప్సన్ నువ్వా.. నేనా అనేలా తలపడి కళ్లుమూసి తెరిచేలోపు రేస్‌ను పూర్తి చేశారు. దాంతో విజేతను తేల్చేందుకు ఫొటోఫినిష్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. సెకనులో ఐదువేల వంతు తేడాతో లైల్స్ విజేతగా నిలిచాడు. అనంతరం లైల్స్ కొవిడ్ బారిన పడినా..200 మీ. పరుగులో కాంస్యం నెగ్గాడు.

తిరుగులేని బైల్స్



అమెరికా జిమ్నాస్టిక్ సూపర్ స్టార్ సిమోన్ బైల్స్ పారిస్‌లో తనదైన ముద్ర వేసింది. ప్రాక్టీస్‌లో గాయపడ్డా ఏకంగా హ్యాట్రిక్ స్వర్ణాలతోపాటు ఓ కాంస్య పతకాన్ని కైవసం చేసుకొని మహిళా జిమ్నాస్టిక్స్‌లో తనకు ఎదురు లేదని చాటింది.

అనర్హతపై వివాదం



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత పారిస్ ఒలింపిక్స్‌లో ప్రకంపనలు సృష్టించింది. 100 గ్రాముల బరువు అదనంగా ఉందనే కారణంతో మహిళల 50 కి. ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ ఫైనల్ నుంచి ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు. ఈ ఘటనపై యావద్భారత దేశంలో ఆగ్రహం పెల్లుబికింది. తనపై వేటును క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో వినేశ్ సవాల్ చేసిన సంగతి తెలిసిందే.

దులీప్ ట్రోఫీలో స్టార్లు

బరిలో పంత్, రాహుల్, గిల్, సూర్య, జడేజా, షమి

రోహిత్, విరాట్, బుమ్రా దూరం

వచ్చేనెల 5న అనంతపురంలో టోర్నీ ప్రారంభం




ముంబై: శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ ముగిశాక భారత క్రికెట్ జట్టు ఆటగాళ్లు పూర్తి విశ్రాంతిలోనే ఉన్నారు. బంగ్లాదేశ్‌తో సెప్టెంబరు 19న ఆరంభమయ్యే టెస్టు సిరీస్ వరకు జట్టుకు ఎలాంటి షెడ్యూల్ లేదు. అయితే ఈ విరామాన్ని వినియోగించుకుని ఫిట్‌నెస్, ఫామ్‌ను కాపాడుకునేందుకు టీమిండియా ప్లేయర్లు దేశవాళీల్లో ఆడాలనేది కొత్త కోచ్ గంభీర్ ఆలోచన. ఈమేరకు వచ్చే నెల 5 నుంచి 22 వరకు నాలుగు జట్ల మధ్య జరిగే దులీప్ ట్రోఫీలో పాల్గొంటే బంగ్లాతో సిరీస్‌కు సన్నాహకంగానూ ఉపయోగపడుతుందని బీసీసీఐ కూడా భావిస్తోంది. ఈ నేపథ్యంలో గిల్, రాహుల్, సూర్యకుమార్, సర్ఫరాజ్, జైస్వాల్, రజత్ పటీదార్, అక్షర్ పటేల్, కుల్దీప్, జడేజా, పేసర్ షమి, ఇషాన్ కిషన్‌తో పాటు రెండేళ్ల తర్వాత రిషభ్ పంత్ కూడా తెలుపు జెర్సీ వేసేందుకు రెడీ అవుతున్నాడు. అయితే వెటరన్లు రోహిత్, విరాట్ కోహ్లీ, అశ్విన్, బుమ్రాలకు మినహాయింపు ఇచ్చినట్టు సమాచారం. దులీప్ ట్రోఫీలో చూపిన ప్రతిభ ఆధారంగా బంగ్లాతో టెస్టు సిరీస్‌కు అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఈనెలాఖరులో ఆటగాళ్లను ఎంపిక చేయనుంది. గతంలో ఇది జోనల్ పద్ధతిన ఆరు జట్లతో నిర్వహించేవారు. కానీ ఈసారి ఇండియా ఎ, బి, సి, డి అనే పేర్లతో నాలుగు జట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్ మరో మూడు జట్లతో ఆడుతుంది. పట్టికలో టాప్‌లో నిలిచిన జట్టు విజేతగా నిలుస్తుంది.

ఓ మ్యాచ్ వేదిక మార్పు: 17 రోజుల పాటు నిర్వహించే దులీప్ ట్రోఫీ షెడ్యూల్ ప్రకారం.. అనంతపురం క్రికెట్ గ్రౌండ్ కాంప్లెక్స్‌లోని రెండు వేదికల్లో మ్యాచ్‌లన్నీ జరగాల్సి ఉంది. అయితే ఆరంభ రెండు మ్యాచ్‌ల్లో ఒకదాన్ని మాత్రం బెంగళూరుకు తరలించనున్నారు.

ఆత్మహత్య చేసుకున్నాడు

గ్రాహం థోర్ప్‌ది సహజ మరణం కాదన్న భార్య



లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్‌ది సహజ మరణం కాదని అతడి భార్య అమందా వెల్లడించింది. ఈనెల 5న థోర్ప్ అనారోగ్య కారణాలరీత్యా కన్నుమూసినట్టు వార్తలు వచ్చాయి. అయితే రెండేళ్లుగా మానసిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన భర్త థోర్ప్ డిప్రెషన్‌కు గురయ్యాడని అమందా పేర్కొంది. తాను లేకపోతేనే కుటుంబం బాగుంటుందనే భావనకు లోనై అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పింది. 2022, మేలోనూ థోర్ప్ సూసైడ్ కోసం ప్రయత్నించి చాలా రోజులు ఐసీయూలో ఉన్నాడని గుర్తుచేసింది. డిప్రెషన్ నుంచి కోలుకునేందుకు చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేకపోయిందని ఆవేదన చెందింది. 1993-2005 వరకు ఇంగ్లండ్ తరఫున థోర్ప్ 100 టెస్టులు, 82 వన్డేలు ఆడాడు.

నీరజ్ రాక మరింత ఆలస్యం

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో రజతం సాధించిన జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వదేశం తిరిగి రావడానికి మరికొంత సమయం పట్టనుంది. పోటీలు ముగిసిన వెంటనే డాక్టర్‌ను కలవడానికి అతడు జర్మనీ వెళ్లినట్టు ఐఓఏ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరులో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్లో నీరజ్ పాల్గొనడం కూడా వైద్యుల సలహాపై ఆధారపడి ఉంటుంది. అతను గజ్జల్లో గాయానికి శస్త్రచికిత్స చేయించుకొనే అవకాశం ఉంది. రెండేళ్లుగా గాయంతో బాధపడుతున్నట్టు నీరజ్ ఇటీవలే చెప్పాడు. దీంతో చోప్రా భారత్‌కు చేరుకోవడానికి సుమారు రెండు నెలల సమయం పట్టవచ్చు.

డైవింగ్‌కు టామ్ వీడ్కోలు



లండన్: ఐదు ఒలింపిక్ పతకాలు నెగ్గిన బ్రిటన్‌కు చెందిన స్టార్ స్విమ్మర్ టామ్ డేలీ డైవింగ్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 30 ఏళ్ల టామ్ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌తో తొలిసారి విశ్వక్రీడల్లో పాల్గొన్నాడు. 2012లో కాంస్యం, 2016లో కాంస్యం, 2020లో స్వర్ణం, కాంస్యం, ఈ ఏడాది పారిస్‌లో రజతంతో కలిపి మొత్తంగా ఐదు ఒలింపిక్ పతకాలు సాధించాడు. రిటైర్మెంట్ తీసుకోవడానికి ఇదే సరైన సమయంగా భావిస్తున్నానని టామ్ తెలిపాడు.

నాట్కో ఫార్మా లాభంలో 59% వృద్ధి

ఒక్కో షేరుకు 150% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో నాట్కో ఫార్మా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 59 శాతం వృద్ధి చెంది రూ.668.50 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.420.30 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా 21.6 శాతం వృద్ధి చెంది రూ.1,160.20 కోట్ల నుంచి రూ.1,410.70 కోట్లకు చేరింది. ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండ్ (150 శాతం)ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఈ నెల 23ను కంపెనీ ఖరారు చేసింది. కాగా ఈ నెల 30 నుంచి డివిడెండ్ చెల్లింపులను ప్రారంభించనున్నట్లు నాట్కో ఫార్మా తెలిపింది.

కావేరీ సీడ్ లాభం రూ.283 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కావేరీ సీడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.808.08 కోట్ల రెవెన్యూపై రూ.282.91 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే రెవెన్యూ 5.32 శాతం పెరగగా లాభం 5.63 శాతం వృద్ధి చెందింది. రుతుపవనాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో మొక్కజొన్న, వరి, కూరగాయల విత్తనాల అమ్మకాలు గణనీయంగా పెరగటంతో పాటు ఎగుమతులు 452% పెరగటం కలిసివచ్చిందని పేర్కొంది.

34% పెరిగిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.24.3 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.18.1 కోట్లు)తో పోల్చితే లాభం 34 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఆదాయం కూడా 45 శాతం వృద్ధితో రూ.313.90 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంలో 156 ఎలక్ట్రిక్ బస్సులను డెలివరీ చేసినట్లు కంపెనీ పేర్కొంది. దీంతో ఇప్పటి వరకు డెలివరీ చేసిన బస్సుల సంఖ్య 1,902కి చేరగా చేతిలో 10,818 యూనిట్ల ఆర్డర్లు ఉన్నట్లు తెలిపింది.

ఎన్ఎండీసీ ఆదాయం రూ.5,779 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,779.07 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,963.35 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.5,688.87 కోట్లు, లాభం రూ.1,661.04 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో నిర్వహణపరంగా పనితీరు మెరుగుపరుచుకోవటం,టెక్నోలాజికల్ ఇన్నోవేషన్‌పై దృష్టి కేంద్రీకరించటం కలిసివచ్చిందని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ వెల్లడించారు. ఈ ఏడాది 5 కోట్ల టన్నుల ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

బీటీ గ్రూప్‌లో భారతికి 24.5% వాటా

డీల్ విలువ రూ.33,590 కోట్లు

● రెండో అతిపెద్ద వాటాదారుగా కంపెనీ ● బ్రిటన్‌కు కార్యకలాపాలు విస్తరించిన సునీల్ మిట్టల్

న్యూఢిల్లీ: టెలికాం దిగ్గజం సునీల్ భారతి మిట్టల్ నాయకత్వంలోని భారతి ఎంటర్‌ప్రైజెస్ తన కార్యకలాపాలను బ్రిటన్‌కు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఆ దేశంలో బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ టెలికాం సేవలు అందించే బ్రిటిష్ టెలికాం (బీటీ) గ్రూప్‌లో 24.5 శాతం వాటాను చేజిక్కించుకుంది. ఆల్టైస్ యూకే అనే సంస్థ నుంచి భారతి గ్రూప్ ఈ వాటాను కొనుగోలు చేసింది. అయితే ఇందుకు ఎంత మొత్తం ఖర్చు చేసిందీ కంపెనీ వెల్లడించలేదు. మార్కెట్ వర్గాలు మాత్రం ఈ డీల్ విలువ ఎంత లేదన్నా 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.33,590 కోట్లు) వరకు ఉంటుందని అంచనా వేస్తున్నాయి. డీల్‌లో భాగంగా బీటీ గ్రూప్ విలువను 15,000 కోట్ల డాలర్లుగా లెక్కించారు.

డీల్ విజయవంతమైతే ఒక భారతీయ కంపెనీ.. విదేశాల్లో ఇంత పెద్ద మొత్తం పెట్టుబడిగా పెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది. భారతి ఎంటర్‌ప్రైజెస్ తన అనుబంధ సంస్థ భారతి గ్లోబల్ ద్వారా ఈ కొనుగోలు జరిగింది. ఈ డీల్‌తో బీటీ గ్రూప్‌లో భారతి గ్రూప్ రెండో అతిపెద్ద వాటాదారుగా అవతరించనుంది. కాగా పెట్టుబడి లాభాల కోసమే బీటీ గ్రూప్‌లో వాటా కొనుగోలు చేసినట్లు భారతి ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది.



అరుదైన అవకాశం

'బీటీ గ్రూప్‌లో ఇంత పెద్ద వాటా కొనుగోలు చేయడం అరుదైన అవకాశం' అని సునీల్ మిట్టల్ కుమారుడు, భారతి గ్లోబల్ కంపెనీ ఎండీ శ్రవిన్ భారతి మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ఇన్వెస్టర్‌గా బీటీ గ్రూప్‌లో పెట్టుబడి పెట్టడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. భారతి గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్ కూడా ఈ కొనుగోలుపై హర్షం వ్యక్తం చేశారు. 'ఇది ఆకర్షణీయమైన దీర్ఘకాలిక పెట్టుబడి కొనుగోలు' అన్నారు. హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్, మొబైల్, ఎంటర్‌ప్రైజెస్ ఆఫరింగ్ రంగాల్లో బీటీ గ్రూప్‌నకు మంచి పట్టు ఉన్న విషయాన్ని సునీల్ మిట్టల్ గుర్తు చేశారు. బీటీ కంపెనీ, యూకే మార్కెట్‌ను లోతుగా అర్థం చేసుకోవడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అన్నారు. ఐరోపా దేశాల టెలికాం రంగంలో అవకాశం వస్తే, భవిష్యత్‌లో మరిన్ని కొనుగోళ్లకూ తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

టాటా, మహీంద్రా సరసన భారతి గ్రూప్

భారత కంపెనీలు బ్రిటిష్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం కొత్తేమీ కాదు. టాటా గ్రూప్ ఇప్పటికే ఆ దేశ ఆటోమొబైల్, స్టీల్ రంగాల్లో ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ తన న్యూ ఎనర్జీ సోలార్ లిమిటెడ్ అనే అనుబంధ సంస్థ ద్వారా బ్రిటన్‌కి చెందిన బ్యాటరీ టెక్ కంపెనీ ఫరాడియాన్ లిమిటెడ్‌ను 13.5 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. రిలయన్స్ బ్రాండ్స్ కూడా ఆ దేశానికి చెందిన ప్రముఖ టాయ్స్ స్టోర్ చెయిన్ హామ్లేస్‌ను 2019లోనే కొనుగోలు చేసింది. విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, వెల్‌స్పన్, టీవీఎస్ గ్రూప్‌లు.. బ్రిటన్‌కు చెందిన బీఎస్ఏ, నార్టన్ కంపెనీలను కొనుగోలు చేశాయి. తాజాగా భారతి ఎంటర్‌ప్రైజెస్ ఈ కంపెనీల సరసన చేరింది.

సెబీ చీఫ్‌పై మా ఆరోపణలు పక్కా నిజం

ఆమే తన నిర్దోషిత్వం నిరూపించుకోవాలి: హిండెన్‌బర్గ్

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్-సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌ల వివాదం కొనసాగుతోంది. సెబీలో చేరకముందు భారత్, సింగపూర్ దేశాల్లో ఆమె ఏర్పాటు చేసిన అఘోర అడ్వైజరీ లిమిటెడ్ (ఇండియా), అఘోర పార్ట్‌నర్స్ సింగపూర్ అనే రెండు కన్సల్టింగ్ సంస్థల ఖాతాదారుల వివరాలు బయటపెట్టి బుచ్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని హిండెన్‌బర్గ్ సవాల్ చేసింది. ఈ వివరాలు బయటపెడితే ఆమె నిజ స్వరూపం ఏమిటో తెలుస్తుందని పేర్కొంది. ఈ రెండు కన్సల్టింగ్ సంస్థల్లో సెబీ చీఫ్‌కు ఇప్పటికీ 99 నుంచి 100 శాతం వాటాలు ఉన్నట్టు తెలిపింది.

వారే ఒప్పుకున్నారు: బుచ్ దంపతులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మారిషస్, బెర్ముడాల్లోని రహస్య ఫండ్స్‌లో తమకు పెట్టుబడులు ఉన్న విషయాన్ని వారే అంగీకరించిన విషయాన్ని హిండెన్‌బర్గ్ గుర్తు చేసింది. ఇవే ఫండ్స్‌లో అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీకీ అక్రమ పెట్టుబడులు ఉన్నట్టు హిండెన్‌బర్గ్ మరోసారి తెలిపింది. ఈ ఫండ్స్ ద్వారానే అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో దందా కొనసాగుతోందని ఆరోపించింది. బుచ్ దంపతులు విడుదల చేసిన ప్రకటన మరిన్ని కీలక ప్రశ్నలను లేవనెత్తుతోందని పేర్కొంది. పూర్తి నిజాలు బయట పడాలంటే సెబీ చీఫ్ పూర్తి పారదర్శకంగా ఉండే దర్యాప్తునకు సిద్ధపడాలని సవాల్ చేసింది.

కొత్తగా చెప్పేది ఏమీ లేదు: హిండెన్‌బర్గ్ సంస్థ.. సెబీ చీఫ్ మాధవిపై చేసిన ఆరోపణలపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోరు మెదపడం లేదు. మాధవి పురి బుచ్, సెబీ దీనిపై ఇప్పటికే తమ వివరణ ఇచ్చినందున, ఈ విషయంలో కొత్తగా తాము చెప్పాల్సిందేమీ లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ అన్నారు.

అదానీ షేర్లు ఢమాల్

- హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలతో ప్రారంభ ట్రేడింగ్‌లో భారీగా పతనం
- గ్రూప్‌లోని 10లో 8 కంపెనీలకు నష్టం
- రూ.22,064 కోట్ల గ్రూప్ సంపద ఆవిరి

ముంబై: అమెరికన్ షార్ట్ సెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలు సోమవారం అదానీ కంపెనీల షేర్లను భారీగా కుదిపేశాయి. ఈ ప్రభావంతో అదానీ గ్రూప్‌లోని అన్ని కంపెనీల షేర్లు ప్రారంభ ట్రేడింగ్‌లో భారీ పతనాన్ని చవిచూసినప్పటికీ మళ్లీ తేరుకున్నాయి. ఒక దశలో 5.5 శాతం క్షీణించిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.09 శాతం నష్టంతో సరిపెట్టుకుంది. ఇంట్రాడేలో 17 శాతం వరకు నష్టపోయిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్.. చివర్లో 3.7 శాతం నష్టం వద్ద ముగిసింది. ప్రారంభంలో అదానీ టోటల్ గ్యాస్ 13.39 శాతం, ఎన్‌డీటీవీ 11 శాతం, అదానీ పవర్ 10.94 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.96 శాతం, అదానీ విల్మర్ 6.49 శాతం, అదానీ పోర్ట్స్ 4.95 శాతం, అంబుజా సిమెంట్స్, ఏసీసీ 2 శాతానికి పైగా నష్టపోయాయి. అయితే, చివరికి గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 8 నష్టాల్లో ముగియగా.. అంబుజా సిమెంట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ మాత్రం లాభాల్లోకి మళ్లాయి. ఒకదశలో రూ.1.13 లక్షల కోట్ల మేర తగ్గిన గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్.. చివరికి రూ.22,064 కోట్ల నష్టంతో రూ.17 లక్షల కోట్ల ఎగువన నిలిచింది.

సెన్సెక్స్ 57 పాయింట్లు డౌన్ : తీవ్ర ఊగిసలాటలకు లోనైన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణల కారణంగా అదానీ గ్రూప్ కంపెనీల షేర్లతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా ప్రారంభ ట్రేడింగ్‌లోనే సెన్సెక్స్ 480 పాయింట్ల వరకు నష్టపోయి 79,226 వద్దకు పడిపోయింది. అయినప్పటికీ సూచీ మళ్లీ తేరుకుని లాభాల్లోకి మళ్లింది. ఒకదశలో సూచీ ఇంట్రాడే కనిష్ఠ స్థాయి నుంచి 880 పాయింట్లు ఎగిసి 80,106 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, ఆఖరి గంటలో అమ్మకాల కారణంగా సెన్సెక్స్ 56.99 పాయింట్ల నష్టంతో 79,648.92 వద్ద క్లోజైంది. కాగా, 24,212.10 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని, 24,472.80 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ చివరికి 20.50 పాయింట్ల నష్టంతో 24,347 వద్ద ట్రేడింగ్‌కు ముగింపు పలికింది.


బిజినెస్

ధరల సెగ తగ్గిందోచ్..

ఐదేళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం.. జూలైలో 3.54 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: దేశంలో ధరల మంట తగ్గి సగటు జీవికి ఉపశమనం కలుగుతోంది. జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదేళ్ల కనిష్ఠ స్థాయి 3.54 శాతానికి దిగివచ్చింది. ప్రధానంగా ఆహార వస్తువుల ధరలు తగ్గడంతో పాటు బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది ఇదే నెలలో ధరలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతూ ఉండడం) ఇందుకు కారణమని విశ్లేషకులంటున్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయంలో ఈ ద్రవ్యోల్బణాన్నే పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ కారణంగా అక్టోబరు ద్వైమాసిక సమీక్షలో వడ్డీ రేట్ల తగ్గింపు దిశగా చర్యలుండవచ్చని నిపుణులంటున్నారు. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నెలలో 5.08% ఉండగా గత ఏడాది జూలైలో 7.44 శాతంగా నమోదైంది. కాగా 2019 సెప్టెంబరులో నమోదైన 3.99% తర్వాత ఇది ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధిలో కనిష్ఠ స్థాయి 4% దిగువకు రావడం ఇదే ప్రథమం.


- దృష్టి లోపం ఉన్న వారి కోసం ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ).. అంతర్ దృష్టి బ్రెయిలీ డెబిట్ కార్డును విడుదల చేసింది. ఈ కాంటాక్ట్‌లెస్ నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు రూపే నెట్‌వర్క్‌పై అందుబాటులో ఉంటుందని తెలిపింది.
- ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీ కైనటిక్ గ్రీన్.. గ్రేటర్ పసిఫిక్ క్యాపిటల్ నుంచి 2.5 కట్లో డాలర్లు (రూ.210 కోట్లు) సమీకరించింది. సిరీస్ ఏ నిధుల సమీకరణలో భాగంగా మొత్తం 4 కోట్ల డాలర్లు సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ మొత్తాలను సమీకరించింది.
- కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ మార్కెట్ ప్లేస్ సంస్థ జెట్‌వెర్క్.. వినోద్ కుమార్ దాసరిని డైరెక్టర్‌గా నియమించుకున్నట్లు ప్రకటించింది. ఆటోమోటివ్, ఇంజనీరింగ్ విభాగంలో అపారమైన అనుభవం కలిగిన వినోద్ నియామకం కంపెనీకి ఎంతగానో కలిసివస్తుందని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,580 ▲	64,700 ▲	87,500 ▼
ముంబై	69,890 ▲	64,019 ▲	81,124 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	455	విజయవాడ	480
వరంగల్	457	గోదావరి	476
చిత్తూరు	493	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	97
కర్నూలు	80	నెల్లూరు	97
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

'అమరరాజా'కు సహకారం అందిస్తాం

- రాష్ట్రంలో కొనసాగుతున్న కంపెనీలకూ మద్దతు
- సీఎం రేవంత్ విదేశీ పర్యటన విజయవంతం.. కావడాన్ని ఓర్వలేకపోతున్న బీఆర్ఎస్: చామల
- కేటీఆర్ ఒప్పందం చేసుకొచ్చిన కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయి: ఆది శ్రీనివాస్



హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వస్తున్న కొత్త కంపెనీలతోపాటు ఇప్పటికే కొనసాగుతున్న కంపెనీలకూ తమ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అమరరాజా కంపెనీకి ప్రభుత్వం నుంచి సహకారం అవసరమైతే అందజేస్తామన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా కొనసాగుతున్న సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన విజయవంతమైందని తెలిపారు. దీనిని ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు వారి సోషల్ మీడియా బృందాల ద్వారా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. "కేసీఆర్ బిడ్డ కవితను ఈడీ అరెస్టు చేసినప్పటి నుంచి వారికి ఈడీ, సీబీఐ, మనీలాండరింగ్ తప్ప మరొకటి గుర్తుకు రావడం లేదు. చేసిన అవినీతి అక్రమాలకు జైలుపాలైనా వాళ్లకు సిగ్గు రావడంలేదు" అంటూ ధ్వజమెత్తారు. కాగా, కేటీఆర్ రాసిచ్చిన స్క్రిప్టును చదువుతూ.. రేవంత్‌ను తక్కువ చేసి చూపించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రయత్నిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో కేటీఆర్ ఎంవోయూ కుదుర్చుకొచ్చిన కంపెనీలకు సరైన వసతులు కల్పించకపోవడంతో అవి ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. దుబాయి వెళ్లి సొంత బిల్డింగ్‌లు కొనుక్కున్న వారితో సీఎం రేవంత్‌కు పోలికా? అని ప్రశ్నించారు.

సుంకిశాల అంచనాల పెంపునకు యత్నాలు

- ప్రమాదంపై విచారణ చేపట్టలేదేం?: మహేశ్వర్‌రెడ్డి
- నేడు సుంకిశాలకు బీజేపీ ఎమ్మెల్యేల బృందం



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ప్రాజెక్టు అంచనాలు మళ్లీ పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.800కోట్ల మేర పెంచారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదముందంటున్న మంత్రులు.. తాజా ప్రమాదంపై విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. సదరు కాంట్రాక్టు సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. తప్పును బీఆర్ఎస్‌పై నెట్టివేసి చేతులు దులుపుకోవడం సరికాదని పేర్కొన్నారు. బీజేఎల్పీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జరిగిన నష్టాన్ని కాంట్రాక్టు సంస్థతోనే భర్తీ చేయించాలని డిమాండ్ చేశారు. కేరళలో నాణ్యత లోపంతో పనులు చేసిన కాంట్రాక్టు సంస్థకు కేంద్రం షోకాజ్ నోటీసు ఇచ్చిందని, రాష్ట్రంలోనూ అదే తీరులో జరిగిన ప్రమాదంపై ప్రభుత్వం ఎందుకు షోకాజ్ నోటీసు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాగా, బీజేపీ ఎమ్మెల్యేల బృందంసుంకిశాల ప్రాజెక్టును మంగళవారం సుంకిశాల సందర్శించనుంది. ఇటీవల కూలిపోయిన రిటైనింగ్‌వాల్‌ను పరిశీలించనుంది.

డీఏ బకాయిలు ఎప్పుడిస్తారు?:ఉద్యోగులు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బకాయి ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల ఐకాస డిమాండ్ చేసింది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా ఉద్యోగుల బకాయిలపై నిర్ణయం తీసుకోవడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. నాంపల్లిలోని టీజీవో భవన్‌లో ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో 53 సంఘాలు సోమవారం సమావేశమయ్యాయి. 36 సమస్యలపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. ఇందులో ముఖ్యంగా సీపీఎస్ విధానం రద్దు, ఉద్యోగుల చందాతో ఆరోగ్య పథకం అమలు, ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనల అమలు వంటి తీర్మానాలు చేశారు. టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది.

మహిళలకు ఈ-ఆటో డ్రైవింగ్ శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. సోమవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (డీఎంఎస్‌వీకే) ప్రాంగణంలో ఈ-ఆటో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ ఆటోల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.

నేడు 'వర్గీకరణ' విజయోత్సవ ర్యాలీ



బౌద్ధనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ తెలిపారు. మాదిగల చిరకాల స్వప్నమైన 'ఎస్సీ వర్గీకరణ'కు సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మక తీర్పు వెలువరిచిన వేళ... ఈ విజయానికి కారణమైన మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి మంగళవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న సందర్భంగా మాదిగలు ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా వరకు లక్షలాది మంది మాదిగలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో మాదిగలు తరలిరావాలని నాగరాజు పిలుపునిచ్చారు. విజయోత్సవర్యాలీ అనంతరం జరిగే సభలో మందకృష్ణ ప్రసంగిస్తారని తెలిపారు.

మేడిగడ్డపై డ్రోన్ ఎగరేసిన కేసులో కేటీఆర్‌కు ఊరట

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ సందర్శన సందర్భంగా అనుమతి లేకుండా డ్రోన్ కెమెరా ఎగరేశారన్న ఆరోపణలతో మహదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఇదే కేసులో మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, బాల్క సుమన్‌లకు సయితం ఉపశమనం కలిగింది. తమపై పెట్టిన సెక్షన్‌లకు సరిపోయే విధంగా ఆధారాలు లేవని, బ్యారేజీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదులో లోపాలు ఉన్నాయంటూ పిటిషనర్లు చేస్తున్న వాదనలను పరిశీలించాల్సి ఉందని జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం పేర్కొంది. అందువల్ల అరెస్టు సహా అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే ఇస్తూ మధ్యంతర ఆదేశాలు జారీచేసింది.

గడల వీఆర్ఎస్‌కు సర్కారు ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావు(జీఎస్ఆర్) వీఆర్ఎస్(స్వచ్ఛంద పదవీ విరమణ)ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తు ఈనెల 8న ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. గడల అభ్యర్థనను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతనే వీఆర్ఎస్‌ను ఆమోదించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరేళ్ల సర్వీసు ఉండగానే గడల వీఆర్ఎస్ తీసుకున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు 2018 మే 28న గడలను రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులుగా నియమించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులకే డిసెంబర్ 23న ఆయనను ఆ పోస్టు నుంచి తప్పించింది. ఆ తర్వాత ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దాన్ని ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టగా మరోసారి ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. అనంతరం గతనెల 27న ఆయనకు మహబూబాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. కానీ ఆయన సెలవుల్లో ఉండటంతో అక్కడ చేరలేదు. ఇటీవల ఆయన స్వయంగా ఆరోగ్యశాఖ కార్యదర్శిని కలసి తన వీఆర్ఎస్‌ను ఆమోదించాలని కోరారు. దాంతో తాజాగా ఆయన వీఆర్ఎస్‌కు ఆమోదం లభించింది.

ఖమ్మం ఖిల్లాపై రూ.30 కోట్లతో రోప్ వే

- డిప్యూటీ సీఎం భట్టి.. తుమ్మల, జూపల్లి, పొంగులేటి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక క్షేత్రాల పరిశీలన



కిన్నెరసాని జలాశయంలో బోటులో భోజనం చేస్తున్న భట్టి, తుమ్మల, జూపల్లి

ఖమ్మం/కొత్తగూడెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని, అందు కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో సోమవారం వారు పర్యటించారు. ఖమ్మం ఖిల్లాపైకి ఎక్కి పురాతన కట్టడాలను తిలకించారు. అంతకుముందు నేలకొండపల్లి బౌద్ధస్థూపం, భక్తరామదాసు నివాసంతో పాటు ఉమ్మడి జిల్లాలో పలు పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఉన్న కిన్నెరసాని జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భట్టి సహా మంత్రులు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం ఖిల్లాతో పాటు పురాతన బౌద్ధ స్థూపం, భక్తరామదాసు నివాసం, పాలేరు నుంచి భద్రాచలం వరకు ఎన్నో పర్యాటక ప్రదేశాలున్నాయని, వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే నిర్మించేందుకు రూ.30కోట్లు కేటాయిస్తామన్నారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపం వద్ద దాని చరిత్రను చాటిచెప్పేలా వసతులు, నిర్మాణాలు చేపడతామన్నారు. హాలెండ్ తరహాలో కిన్నెరసాని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

నల్సార్‌కు బీసీఐ అక్రిడిటేషన్ లేదు

- హైకోర్టుకు వెల్లడించిన బార్ కౌన్సిల్

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్య కోర్సులు అందిస్తున్న ప్రముఖ జాతీయ యూనివర్సిటీ 'నల్సార్'.. తమ అక్రిడిటేషన్ పొందలేదని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) హైకోర్టుకు వెల్లడించింది. రాష్ట్రంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం వంటి లా కోర్సుల ప్రవేశాలు షెడ్యూల్ ప్రకారం సాగడం లేదని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీఐ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో ఉన్న 32 లా కాలేజీల్లో ఈ ఏడాదికి సంబంధించి 19 మాత్రమే బీసీఐ అక్రిడిటేషన్ పొందాయని తెలిపారు. పొందని వాటిలో నల్సార్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ, ఇతర కాలేజీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే స్పందిస్తూ నల్సార్ యూనివర్సిటీకీ ఛాన్సలర్‌గా తాను ఉన్నందున ఈ కేసు తాను విచారించలేనని పేర్కొన్నారు. ఈ కేసును జస్టిస్ సుజోయ్‌పాల్ ధర్మాసనానికి బదిలీ చేశారు.

కమలంలో కుర్చీ పోరు!

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ.. రేసులో ముందున్న ఈటల, రాంచందర్‌రావు!

- ఎత్తులు పైఎత్తులు వేస్తున్న ఆశావహులు
- ముఖ్యనేతల మధ్య కొరవడిన సయోధ్య
- ఆచితూచి వ్యవహరిస్తున్న హైకమాండ్





హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖకు కొత్త అధ్యక్షుడి నియామకం.. ఆ పార్టీ జాతీయ నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. కమల దళపతిగా అవకాశం దక్కించుకునేందుకు పలువురు నేతలు పోటీ పడుతుండడం, ఒకరిపై ఒకరు ఎత్తులు పైఎత్తులు వేస్తుండడంతో అధ్యక్షుడి ఎంపికలో చెక్‌మేట్ సాగుతోంది. దీనికితోడు ముఖ్యనేతల మధ్య సయోధ్య లేకపోవడంతోపాటు అంతర్గతంగా లుకలుకలు బయటపడుతుండడం సమస్యగా మారింది. 'నాకు దక్కకున్నా పర్వాలేదు.. ఫలానా నేతకు మాత్రం అవకాశం ఇవ్వొద్దు' అంటూ ఒకరిద్దరు కీలక నేతలు జాతీయ ముఖ్యులను గట్టిగా కోరుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేసుకుంటున్న ఒక సీనియర్ నేతకు, గతంలో పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన కీలక నేత ఒకరు చెక్ పెడుతున్నారు. సైద్ధాంతిక నిబద్ధత ఉన్నవారికే అవకాశం ఇవ్వాలని ఒక వర్గం పట్టుబడుతోంది. కొత్తవారికి ఈ పదవి కట్టబెడితే పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపినట్లు అవుతుందని వాదిస్తోంది. అయితే పార్టీ కేడర్‌లో జోష్ రావాలంటే, పాత, కొత్త వాదన సరికాదని మరోవర్గం అంటోంది. రాజకీయంగా ప్రత్యర్థులను ఢీకొట్టాలంటే నాయకత్వ లక్షణాలు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని జాతీయ నాయకత్వాన్ని కోరుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ నాయకత్వం ఎవరివైపు మొగ్గు చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీ ప్రధానంగా ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మధ్యే ఉందని తెలుస్తోంది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్ రెడ్డి పేరును కూడా జాతీయ నాయకత్వం పరిశీలిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు తమకు అవకాశం ఇవ్వాలని కొంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా జాతీయ నాయకత్వాన్ని కోరుతుండడం ఆసక్తి రేపుతోంది. పార్టీ సంస్థాగత నియమావళి ప్రకారమైతే.. తొలుత సభ్యత్వ నమోదు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఆ తరువాత గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలి. అనంతరం రాష్ట్ర శాఖకు అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలి. కానీ, ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యే సరికి కనీసం ఐదారు నెలలు పడుతుంది. అయితే, ఈ ప్రక్రియతో సంబంధం లేకుండానే కొత్త అధ్యక్షుడి నియామకం జరిగే అవకాశం లేకపోలేదని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. "వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే మా లక్ష్యం. ఇందుకోసం ఇటు సంస్థాగతంగా బలోపేతం కావడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి దీటుగా నిలిచి ప్రత్యామ్నాయం మేమే అని ప్రజల్లో విశ్వాసం కల్పించడం అత్యంత కీలకం. ఈ రెండు కోణాలను పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. పైగా, దక్షిణాదిన మా పార్టీ విస్తరణకు తెలంగాణ గేట్‌వే. అందుకే హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు ఇటీవలే కొత్త అధ్యక్షులను నియమించినా.. ఇక్కడ మాత్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే నియమించనున్నారు" అని ఆ నేత వివరించారు. రాష్ట్ర పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా బిజీ షెడ్యూలుతో ఉండిపోగా, ఆయనకు అదనంగా జమ్ము కశ్మీరు ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలను కూడా పార్టీ నాయకత్వం అప్పగించింది. దీంతో ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా స్థానిక కార్యక్రమాలకు సమయం కేటాయించలేకపోతున్నారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే కొత్త అధ్యక్షుడిని జాతీయ నాయకత్వం ఖరారు చేస్తుందని విస్తృత ప్రచారం జరుగుతోంది.

కొత్త ఇన్‌చార్జి నియామకంపైనా సందిగ్ధం!

బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎవరన్నది తేలకపోగా.. రాష్ట్ర శాఖకు కొత్త ఇన్‌చార్జి ఎవరనే దానిపై కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఉన్న తరుణ్ చుగ్, సునీల్ బన్సల్‌లు రాష్ట్ర ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తరువాత ఒకటి, రెండు సందర్భాల్లో మాత్రమే తరుణ్‌చుగ్ రాష్ట్రానికి వచ్చారు. పార్టీ కార్యక్రమాలను ఎక్కువశాతం బన్సల్ పర్యవేక్షిస్తూ వస్తున్నారు. అయితే బన్సల్ కూడా ఇటీవల ఎక్కువ సమయం కేటాయించలేకపోవడంతో రాష్ట్ర పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పార్టీ సమావేశాలను సమన్వయం చేస్తున్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త ఇన్‌చార్జులను నియమించిన జాతీయ నాయకత్వం.. 8 రాష్ట్రాల్లో పెండింగ్‌లో పెట్టింది. ఇందులో తెలంగాణ కూడా ఉంది. దీంతో తరుణ్ చుగ్, బన్సల్‌నే కొనసాగిస్తారా? లేక కొత్తవారిని నియమిస్తారా? అన్నది పార్టీవర్గాల్లో చర్చనీయాంశమైంది.

తుమ్మిడిహెట్టిపై సర్కారు నజర్

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 71.5 కి.మీ. దాకా కాలువల నిర్మాణం కూడా గతంలోనే పూర్తయింది. ఇక బ్యారేజీ నిర్మాణమే తరువాయి. అయితే బ్యారేజీ నిర్మాణం జరిగితే 71.5 కి.మీ. దూరం(మైలారం గ్రామం) దాకా మోటార్లు లేకుండా నీరు గ్రావిటీతో రానుంది. అక్కడ నుంచి తక్కువ సామర్థ్యం కలిగిన పంపుల ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని గతంలో ప్రతిపాదించారు. అయితే, తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో సుందిళ్ల బ్యారేజీలోకి నీటిని పంపించవచ్చని అధికారులు తాజాగా అభిప్రాయానికి వచ్చారు. మైలారం వద్ద పంప్‌హౌస్ కట్టి ఎల్లంపల్లిలో నీటిని ఎత్తిపోయాలా..? లేక సుందిళ్లకు గ్రావిటీతో తరలించి, దాని పైనే ఉన్న ఎల్లంపల్లికి ఎత్తిపోయాలా..? అన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో కట్టాలని ప్రతిపాదించగా.. ముంపు అధికంగా ఉంటుందనే మహారాష్ట్ర అభ్యంతరాలతో పక్కనపెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 148 టీఎంసీలతోనే ప్రాజెక్టును కడతామని అప్పటి సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో సీఎం కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారు. దీనికి మహారాష్ట్ర అంగీకారం తెలుపుతూ సంతకాలు చేసింది. కాళేశ్వరంతో పాటే తుమ్మిడిహెట్టిని కడతామని కేసీఆర్ ప్రకటించారు. తర్వాత తుమ్మిడిహెట్టి కాలగర్భంలో కలిసిపోయింది. వన్యప్రాణుల అభయారణ్యం, సాంకేతిక అంశాలు, నీటి లభ్యత లేదనే కారణాలతో ప్రాజెక్టును పక్కనబెట్టారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన సర్వేలో తేల్చారు. అన్ని బేసిన్లలో జూన్ నుంచి నవంబరుదాకే వరద ఉంటుంది. ప్రాణహితలో ఫిబ్రవరిలో కూడా 10 వేల క్యూసెక్కుల దాకా ప్రవాహం ఉంటుంది.తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణాన్ని ప్రాధాన్య జాబితాలో పెట్టుకున్న ప్రభుత్వం అదే సమయంలో ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. ఆయా బ్యారేజీల పునరుద్ధరణ.. వాటిలో ఎంత నీటిని నిల్వ చేయాలి..? ప్రాజెక్టుల నిర్వహణ మ్యాన్యువల్స్.. తదితర అంశాల్లో ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పాటించాలని భావిస్తోంది.

ఖనిజాన్వేషణలో ప్రైవేటుకు పెద్దపీట

- స్టార్టప్‌లు, సాంకేతికతను ప్రోత్సహిస్తాం
- 6వ ఎన్ఎమ్ఈటీ గవర్నింగ్ బాడీ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖనిజాల అన్వేషణ(ఎక్స్‌ప్లోరేషన్)లో ప్రైవేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఢిల్లీలోని అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో 6వ ఎన్ఎమ్ఈటీ(నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్) గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఎక్స్ అఫిషియో చైర్మన్ హోదాలో ఈ సమావేశానికి హాజరైన కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఖనిజ సంపదకు లోటు లేదని, కానీ అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేక పోతున్నామని తెలిపారు. అందుకే 2015లో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్ఎమ్ఈటీని స్థాపించారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా ఖనిజాల ఎక్స్‌ప్లోరేషన్‌లో పురోగతి సాధిస్తున్నామని చెప్పారు. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహించడం, ప్రైవేటు రంగానికి అవసరమైన సహకారాన్ని అందించడం వంటి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సాంకేతికతకు పెద్దపీట వేస్తామన్నారు. ఈ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంపూర్ణ సహకారం అందించేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. సహకార సమాఖ్య విధానంలో అన్ని రాష్ట్రాలను కలుపుకొని ముందుకెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రాల్లో ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టులను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. దీనికిగాను కేంద్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. గనుల విభాగంలో ఏఐ, ఆటోమేషన్, డ్రోన్ సాంకేతికతలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

చెరువుకు చేవ

(మొదటిపేజీ తరువాయి)





పెద్ద చెరువు అప్పుడు.. ఇప్పుడు

గురైందన్నమాట! సరూర్‌నగర్ చెరువేమో 56శాతం, ఈసీఐఎల్ సమీపంలోని మిర్యాలగూడ చెరువు ఏకంగా 90శాతం మేర కబ్జాలపాలయ్యాయి. ఇవే కాదు.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 185 చెరువులు, ఓఆర్ఆర్ వరకు ఉన్న 400 చెరువులదీ ఇదే దైన్యం. వాస్తవ విస్తీర్ణంతో పోల్చితే చెరువుల్లో చాలామటుకు 20 నుంచి 90శాతం దాకా ఆక్రమణలకు గురయ్యాయనేది దిగ్భ్రాంతికరమైన వాస్తవం! 1979 నుంచి 2023 వరకు అంటే.. 44 ఏళ్లలో నగర పరిధిలోని చెరువుల స్థితిపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) ఓ నివేదిక రూపొందించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా 56 చెరువులకు సంబంధించి వాస్తవ విస్తీర్ణం, ప్రస్తుత విస్తీర్ణంతో కూడిన సమాచారాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కి అందజేసింది. దీని ఆధారంగా కబ్జాలపై కొరడా ఝుళిపించేందుకు హైడ్రా సిద్ధమైంది. చెరువులు, పార్కుల పరిరక్షణ కోసం త్రిముఖ వ్యూహంతో ముందుకు వెళ్లనుంది. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో జరిగిన అక్రమ కట్టడాలనే కాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఏళ్ల క్రితమే అనుమతులతో వెలిసిన భవనాలనూ చట్ట ప్రకారం కూల్చేస్తామని, మున్ముందూ అక్రమ నిర్మాణాలు జరగకుండా చూస్తామని, చెరువులు, కుంటలను వాటి సహజస్థితికి తెచ్చే లక్ష్యంతో పనిచేస్తాం అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. ఆక్రమణదారులతోపాటు.. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై, అక్రమ నిర్మాణాల్లో భాగంగా ప్లాట్లు చేసి విక్రయించిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు బుద్ధభవన్‌లో మీడియాతో హైడ్రా కార్యాచరణపై ఆయన మాట్లాడారు. 'చెరువుల పక్కన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లు ప్రజలు కొనుగోలు చేయొద్దు. మున్ముందైనా వాటిని కూల్చివేస్తాం. అప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాంటి నిర్మాణాలు ఏమైనా ఉంటే సమాచారమివ్వండి' అని కోరారు. ఈ సందర్భంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నాలుగున్నర దశాబ్దాల్లో నగరంతోపాటు ఔటర్ వరకు ఉన్న చాలా చెరువుల విస్తీర్ణం తగ్గిందని.. ఉన్న వాటినైనా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించడంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. చెరువుల ఆక్రమణలపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని.. ఆక్రమణదారులు ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మూడు జోన్లు.. పలు సర్కిళ్లు..

ఆక్రమణలపై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు హైడ్రాను మూడు జోన్లుగా, అవసరాన్ని బట్టి సర్కిళ్లుగా విభజిస్తామని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. సంస్థకు 3,500 మంది సిబ్బంది అవసరం ఉందని, ప్రభుత్వ అనుమతితో వారిని సమకూర్చుకుంటామని చెప్పారు. ఆక్రమణల తొలగింపునకు క్షేత్రస్థాయిలో 72 బృందాలుంటాయని.. ఈ మేరకు పట్టణ ప్రణాళిక, విపత్తుల నిర్వహణ విభాగాలు, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఏసీపీ స్థాయి అధికారి, ఐదు నుంచి ఆరుగురు సీఐలు, ఇతర సిబ్బంది ఉంటారని.. అవసరమైతే మున్ముందు పోలీస్ స్టేషన్లను మూడు నుంచి నాలుగుకు పెంచుతామని చెప్పారు

ఇవీ ఇప్పటిదాకా కూల్చాం

జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్, బంజారాహిల్స్‌లోని మిథిలా కాలనీ, లోటస్ పాండ్ పార్కు, గాజుల రామారం, బుమ్‌రుఖా ఉద్దవాల్ చెరువుల్లో అక్రమ కట్టడాలను కూల్చివేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఆక్రమణలపై హైడ్రాకు రోజూ 40 నుంచి 50 ఫిర్యాదులొస్తున్నాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చందానగర్ ఈర్ల చెరువు ఎఫ్‌టీఎల్‌లో భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అనుమతులిచ్చిందని చెబుతూ చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఇప్పటికే ఇచ్చిన లే అవుట్ల అనుమతులు రద్దు చేయాలని హెచ్ఎండీఏకు లేఖ రాశామని చెప్పారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలన్నీ యాప్‌లో..

చెరువుల ఆక్రమణలు జరగకుండా ప్రజల్లో అవగాహన పెంచేందుకూ సాంకేతికంగా చర్యలు తీసుకుంటున్నామని రంగనాథ్ చెప్పారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. ప్లాట్లు/ఇళ్లు కొనేందుకు వెళ్లిన వ్యక్తులు తామున్న స్థలం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా? అన్నది తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఓ యాప్ రూపొందిస్తామని చెప్పారు. ఆ యాప్ ఓపెన్ చేస్తే.. వాళ్లున్న ప్రాంతం దేని పరిధిలో ఉందనేది తెలిసిపోతుందని వివరించారు.

ఆల్మట్టి నుంచి సాగర్ దాకా.. గేట్లన్నీ మూత

- కృష్ణా బేసిన్‌లో వరదలు తగ్గుముఖం..
- గేటు గల్లంతుతో తుంగభద్ర గేట్లన్నీ ఓపెన్

హైదరాబాద్/గద్వాల/దోమలపెంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరదలు తగ్గిపోవడంతో అన్ని ప్రాజెక్టుల గేట్లు మూసుకున్నాయి. సోమవారం ఆల్మట్టి నుంచి నాగార్జునసాగర్ దాకా.. తుంగభద్ర విఎసహా అన్ని ప్రాజెక్టుల గేట్లను అధికారులు మూసేశారు. అన్నింటిలోనూ సంతృప్తికర స్థాయిలో నీటి నిల్వలున్నాయి. ఆల్మటి పూర్తి సామర్థ్యం 123 టీఎంసీలకు ప్రస్తుతం 118.22 టీఎంసీలున్నాయి. 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. జల విద్యుదుత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదైంది. నారాయణపూర్ పూర్తిసామర్థ్యం 33.31 టీఎంసీలకు.. 33.12 టీఎంసీలున్నాయి. 15 వేలు ఇన్‌ఫ్లో ఉండగా, జలవిద్యుదుత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కులు విడుదలవుతోంది. ఇక జూరాల ప్రాజెక్టులో 8.449 టీఎంసీలున్నాయి. ప్రాజెక్టులోకి 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసేయడంతో పాటు జల విద్యుదుత్పత్తిని కూడా నిలిపివేశారు. తుంగభద్రలో 19వ గేటు కొట్టుకుపోవడంతో ఆ గేటుపై ఒత్తిడి తగ్గించేందుకు మిగిలిన 32 గేట్లు కూడా ఎత్తి 99,567 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 97.753 టీఎంసీల నీరుంది. 25,571 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇక శ్రీశైలానికి 77,598 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా జల విద్యుదుత్పత్తి ద్వారా 68,210 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు 194.30 టీఎంసీలున్నాయి. ఇటు సాగర్ గేట్లను మధ్యాహ్నం 2 గంటల సమయంలో మూసేశారు. ఇన్‌ఫ్లో 68,211 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదవగా.. 47,035 క్యూసెక్కుల ఔట్ ఫ్లో రికార్డయింది. ప్రాజెక్టులో 312 టీఎంసీలకు 308 టీఎంసీలున్నాయి. ఇక గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు వరద నిరాశజనకంగానే ఉంది. సింగూరుకు 576, నిజాంసాగర్‌కు 152, ఎస్సారెస్పీకి 4,083, కడెం 3,187, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 3,580 క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది.

స్టాప్‌లాక్ బిగింపునకు 4 రోజులు..

తుంగభద్ర ప్రాజెక్టు గేటు మరమ్మతుల్లో ప్రాజెక్టు బోర్డు, కర్ణాటక, ఆంధ్ర ఇంజనీరింగ్ నిపుణులు నిమగ్నమయ్యారు. వరద నీరు వృథాగా సముద్రం పాలు కాకుండా అడ్డుకోవడానికి.. 19వ గేటు స్థానంలో తాత్కాలికంగా స్టాప్‌లాక్ గేట్ అమర్చి.. దానిని పూర్తిగా మూసేయాలని నిర్ణయించారు. తుంగభద్ర బోర్డు సోమవారం అత్యవసరంగా సమావేశమైంది. మరమ్మతులపై హైదరాబాద్‌కు చెందిన ప్రాజెక్టు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, కర్ణాటక నిపుణుల ఆధ్వర్యంలో సమాలోచనలు జరిపింది. డ్యామ్ గేటు 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు ఉంటుంది. అంత పెద్ద స్టాప్‌లాక్ గేట్‌ను అమర్చడం కష్టం కావడంతో నాలుగు అడుగుల చొప్పున ఐదు బ్లాకులు తయారుచేసి ఒక్కొక్క బ్లాక్‌ను అమర్చేలా సన్నాహాలు చేస్తున్నారు. బ్రిడ్జి పైనుంచి క్రేన్ సాయంతో ప్రస్తుత గేట్ గాడిలో ఒక్కో బ్లాక్ కిందకు దించి.. ఆ గేటును పూర్తిగా క్లోజ్ చేస్తామని బోర్డు ఇంజనీర్లు తెలిపారు. నారాయణ ఇంజనీరింగ్, హిందూస్థాన్ ఇంజనీరింగ్ సంస్థలు ఈ బ్లాక్‌లను తయారుచేశాయి. మంగళవారం నుంచి బిగించడం ప్రారంభిస్తారు. ఇది పూర్తి కావడానికి 4 రోజులు పట్టవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ ప్రారంభించాలంటే స్పిల్‌లెవల్ 1,613 అడుగుల వరకు డ్యామ్‌ను ఖాళీ చేయాలి. ప్రస్తుతం 1630.97 అడుగుల వరకు నీటి నిల్వ ఉంది. ఇంకా 17 అడుగులు ఖాళీ చేయాలి. దీంతో ముంపు సమస్యలు తలెత్తకుండా రోజూలక్ష క్యూసెక్కుల్లోపే దిగువకు విడుదల చేస్తున్నారు.

గోదావరి బోర్డు సమావేశం మళ్లీ వాయిదా

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం మళ్లీ వాయిదా పడింది. తొలుత ఈనెల 6న ఈ సమావేశం నిర్వహించాలని యోచించగా... ఏపీ విజ్ఞప్తితో ఈ నెల 13కు వాయిదా వేశారు. అయితే, సెప్టెంబరు తొలి వారానికి వాయిదా వేయాలని ఏపీ తాజాగా విజ్ఞప్తి చేయగా... ఈనెల 20కి వాయిదా వేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశంలో సీతారామ ఎత్తిపోతల పథకం డీపీఆర్‌పై చర్చించడం ఒక్కటే ఎజెండాగా పెట్టారు. ఈ డీపీఆర్ కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లోని అన్ని డైరెక్టరేట్‌లలో క్లియరెన్స్‌లు పొంది... బోర్డు పరిశీలనకు వచ్చింది. దాంతో ఈ డీపీఆర్ పరిశీలన తెలంగాణకు కీలకం కాగా... ఇక సమావేశాన్ని వాయిదా వేయరాదని తెలంగాణ కోరుతుండగా... వాయిదాకే ఏపీ పట్టుబడుతోంది. మరోవైపు ఈ నెల 15న ఈ పథకానికి సంబంధించిన మోటార్లను సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ప్రారంభించనున్నారు. దాంతో పథకం ప్రారంభోత్సవానికన్నా ముందే ఈ డీపీఆర్ పరిశీలన జరుగుతుందని తెలంగాణ ఎన్నో ఆశలు పెట్టుకోగా... వాయిదా వేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది.

తుది దశ సీట్ల కేటాయింపు పూర్తి..

- మిగిలిన 5 వేల ఇంజనీరింగ్ సీట్లు!

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 5 వేల ఇంజనీరింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా తుది ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు సోమవారం పూర్తయింది. రాష్ట్రంలో మొత్తం 86,943 ఇంజనీరింగ్ సీట్లు ఉండగా, ఇందులో 5,039 సీట్లు మిగిలాయి. సోమవారం 9,881 మందికి సీట్లు కేటాయించగా, మరో 16,981 మంది స్లైడింగ్ ద్వారా కొత్త కోర్సులకు మారారు. ఈ మేరకు సీట్లు పొందిన వారంతా ఈనెల 17వ తేదీ వరకు ఫీజు చెల్లించి ఆయా కళాశాలల్లో చేరాలని అధికారులు సూచించారు. ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ సంబంధిత కోర్సుల్లో 98.01%, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కోర్సుల్లో 89.31%, సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 77.53%, ఇతర కోర్సుల్లో 70.73% సీట్లు భర్తీ అయ్యాయి.

ఇంజనీరింగ్ అకడమిక్ క్యాలెండర్ విడుదల

- ఈ నెల 27 నుంచి బీటెక్ మొదటి సెమిస్టర్ తరగతులు
- అక్టోబరు 7 నుంచి 11 వరకు దసరా సెలవులు
- 2025 ఫిబ్రవరి 6 నుంచి సెకండ్ సెమిస్టర్ మొదలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ మూడోదశ కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు పూర్తయిన నేపథ్యంలో ఇంజనీరింగ్ అకడమిక్ క్యాలండర్‌ను జేఎన్టీయూ అధికారులు సోమవారం విడుదల చేశారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24 వరకు అవగాహన (ఇండక్షన్) ప్రోగ్రామ్ ఉంటుందని పేర్కొన్నారు. అకడమిక్ క్యాలండర్ ప్రకారం.. మొదటి సెమిస్టర్ తరగతులు ఈ నెల 27న ప్రారంభమై అక్టోబరు 30 వరకు కొనసాగుతాయి. మొదటి సెమిస్టర్ పరీక్షలు వచ్చే ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉంటాయి. అక్టోబరు 7 నుంచి 11 వరకు దసరా సెలవులుగా పేర్కొన్నారు. కాగా, బీటెక్ సెకండ్ సెమిస్టర్ తరగతులు ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభమై జూన్ 24 వరకు కొనసాగుతాయి. మే 12 నుంచి 24 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. సెకండ్ సెమిస్టర్ పరీక్షలు జూలై 9 నుంచి ఉంటాయి.

గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యేలతో సీఎం భేటీ!

విదేశీ పర్యటన నుంచి సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి వచ్చిన తర్వాత గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమావేశమవుతారని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలకు హామీ ఇచ్చారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపైన సచివాలయంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ చాంబర్లో సోమవారం సమావేశం జరిగింది. ఇందులో మంత్రితో పాటుగా వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్, విజయ రమణారావు, పాయల్ శంకర్, టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలు వినోద్‌కుమార్, భీంరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌బీసీని రెండేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం

- బేరింగ్, యంత్ర సామగ్రిని పంపించండి
- రాబిన్స్ కంపెనీ సీఈవో లాక్‌హోంకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వినతి
- 2 నెలల్లో పంపిస్తామని సీఈవో హామీ

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ పనులను రెండేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా టన్నెల్ బోరింగ్ యంత్రాలను ఉత్పత్తి చేసే రాబిన్స్ కంపెనీ సీఈవో లాక్‌హోంతో కోమటిరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టన్నెల్ తవ్వకాలకు ఉపయోగించే అధునాతన మెషినరీని కంపెనీ సీఈవో.. కోమటిరెడ్డికి చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టన్నెల్ బోరింగ్ మిషన్‌లో కీలకమైన బేరింగ్ తోపాటు, ఇతర యంత్ర సామగ్రి మరమ్మతులకు గురికావడంతో ఎస్‌ఎల్‌బీసీ పనులు ఆగిపోయినట్టు తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ పూర్తయితే.. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్‌ను కట్టడి చేయడంతోపాటు 4లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని, హైదరాబాద్ వాసులకు తాగునీరు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. టన్నెల్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందని, యంత్ర సామగ్రిని వీలైనంత త్వరగా సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఎల్‌బీసీ పనులకు సంబంధించిన బిల్లులను గ్రీన్‌చానల్ ద్వారా చెల్లించాలని నిర్ణయించామని, బేరింగ్, ఇతర్ యంత్రాలు అందిన 40రోజుల్లోనే చెల్లింపులు చేస్తామని చెప్పారు. దీనిపై సంసిద్ధత వ్యక్తం చేసిన సీఈవో లాక్‌హోం.. రెండు నెలల్లోగా 7 డయామీటర్ల బేరింగ్‌తోపాటు ఇతర సామగ్రిని సముద్ర మార్గం ద్వారా చెన్నైకు చేర్చుతామని, అక్కడి నుంచి పనులు జరుగుతున్న ప్రాంతానికి తరలిస్తామని చెప్పారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి కార్యాలయం సోమవారం మీడియాకు ఓ ప్రకటనలో విడుదల చేసింది. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను బ్లాస్టింగ్ విధానంలో పూర్తి చేసే అవకాశం లేకపోవడం.. కేవలం బోరింగ్ మిషన్ ద్వారా మాత్రమే పనులు చేసేందుకు అవకాశం ఉండడంతో రాబిన్స్ కంపెనీతో చర్చలు జరిపినట్లు అందులో పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా సాగు నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



రాబిన్స్ కంపెనీ సీఈవోతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పెట్టుబడులకు కొరియా సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని వివరించారు. బయటి దేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే కంపెనీలకు ఏ ఇబ్బంది లేకుండా అన్ని రకాల అనుమతును వేగంగా పూర్తి చేసే వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.

హ్యుందయ్ మెగా టెస్టింగ్ సెంటర్..

మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన హ్యుందయ్ కొరియాకు చెందిన దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీ హ్యుందయ్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. భారత్‌లోని హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ (హెచ్ఎంఐఈ) ద్వారా ఒక మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడులు పెడతామని ఆ కంపెనీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి బృందానికి తెలిపారు. సియోల్‌లో సోమవారం ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ప్రపంచంలోని దిగ్గజ కంపెనీల నుంచి తమ ప్రభుత్వం పెట్టుబడులను ఆహ్వానిస్తోందని తెలిపారు. దీనికి అనుగుణంగానే తాము అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులను సమకూర్చామని, పరిశ్రమల పెట్టుబడులకు అనుకూలమైన పాలసీలు రూపొందించామని చెప్పారు. అనుమతుల విషయంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదన్నారు. తెలంగాణ లో అంతర్జాతీయ ప్రమాణాలతో కార్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు హ్యుందయ్ కంపెనీ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ఇతర చిన్న కంపెనీలు, చిన్న తరహా పరిశ్రమలు విస్తరించే అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు సమకూరుతాయన్నారు. అంతేకాకుండా దక్షిణాసియా పసిఫిక్ ప్రాంతంలో పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. కాగా, తమ కంపెనీ పెట్టుబడులను విస్తరించేందుకు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌కు హ్యుందయ్ కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. భారత్ తమకు ఎంతో కీలకమైన మార్కెట్ అని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న చొరవ ఎంతో ప్రగతిశీలంగా ఉందని, రాష్ట్రాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని వారు అన్నారు. విద్యుత్తు, గ్యాస్, బ్యాటరీల రంగంలో ఎల్ఎస్ పెట్టుబడులు..కొరియాలో అతిపెద్ద పరిశ్రమల గ్రూపు ఎల్ఎస్ కార్పొరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సీఎం రేవంత్ ఎక్స్‌లో వెల్లడించారు. కార్పొరేషన్ ఛైర్మన్ కు జా ఉన్‌తో జరిగిన చర్చల్లో.. తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుళ్లు, గ్యాస్, విద్యుత్తు, బ్యాటరీల రంగంలో తయారీ యూనిట్లు నెలకొల్పేందుకు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని చెప్పారు. తన ఆహ్వానం మేరకు ఎల్ఎస్ కార్పొరేషన్ బృందం త్వరలో రాష్ట్ర పర్యటనకు వచ్చేందుకు అంగీకారం తెలిపారని వెల్లడించారు.



దక్షిణ కొరియా కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్, శ్రీధర్‌బాబు

యువత రాణించేలా కార్యాచరణ: సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని యువతకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. యువత సన్మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. తెలంగాణ యువత రాణించేలా ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో కార్యాచరణ రూపొందించిందని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీ, స్కిల్ వర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, క్రీడల పట్ల ఆసక్తి పెంచడం తదితర నిర్ణయాలు అందులో భాగమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

వస్త్ర నగరికి కలిసి వచ్చేనా..?

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీలో 2017లో అప్పటి ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రూ.1,350 కోట్ల వ్యయంతో 1,150 ఎకరాల్లో 200కు పైగా వస్త్ర కంపెనీలు, లక్ష మందికి ప్రత్యక్షంగా, మరో నాలుగు లక్షల మందికి పరోక్షంగా కేఎంటీపీ ద్వారా ఉపాధి కల్పించబోతున్నట్లు చెప్పింది. ఈ మేరకు 22 కంపెనీలతో ఎంఓయూ చేసుకున్నప్పటికీ ఏడేళ్లలో కేవలం మూడు కంపెనీలు మాత్రమే ఇక్కడ అడుగుపెట్టాయి. ఇందులో దక్షిణ కొరియాకు చెందిన యంగాన్ కంపెనీ 8 ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 2023లో గత ప్రభుత్వంతో యంగాన్ కంపెనీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో జూన్ 29న వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించారు. పరిశ్రమలు రాకపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే దక్షిణ కొరియాపై ఫోకస్ పెట్టిన సీఎం.. తన పర్యటనలో భాగంగా ఆ దేశాన్ని సందర్శించారు. ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టిన యంగాన్ కంపెనీ, కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీతో పాటు మరో 25అగ్రశ్రేణి కంపెనీలతో సమావేశాన్ని నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానించడంతో వరంగల్‌లో వస్త్ర నగరి భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి.

మరో సారి ఆకర్ష.. ఆకర్ష!

(మొదటిపేజీ తరువాయి)

గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు గ్రేటర్ పరిధిలోని మరో అరడజను మంది ఎమ్మెల్యేల చేరికకూ అంతా సిద్ధమైనా.. సీఎం రేవంత్‌రెడ్డి ఆ ప్రక్రియకు విరామం ఇచ్చారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, పాలనాపరమైన నిర్ణయాలను బడ్జెట్ సమావేశాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించి.. చేరికలను పెండింగ్‌లో పెట్టారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే పెట్టుబడులను ఆహ్వానించేందుకు సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు వెళ్లారు. అయితే, బీజేపీ పెద్దలతో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సంప్రదింపులు జరుపుతున్నారన్న ప్రచారం జోరందుకోవడంతో ఆపరేషన్ ఆకర్ష్‌కు మరోమారు పదును పెట్టాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న ఆయన.. హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక.. చేరికల ప్రక్రియ పునఃప్రారంభమవుతుందని, గ్రేటర్ పరిధిలోని అరడజను మంది ఎమ్మెల్యేలూ చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ఇస్తే.. కార్పొరేషన్ చైర్మన్ పోస్టులే

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వబోమంటూ సీఎం రేవంత్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే కీలక కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి మంత్రి పదవి ఇస్తామంటే.. తమతోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలనూ తీసుకువచ్చేందుకు ఒకరిద్దరు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కానీ, విధాన పరంగా పార్టీ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వారికి మంత్రి పదవులు దక్కే అవకాశం లేదని పేర్కొంటున్నాయి. అయితే, పార్టీలో చేరే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఉత్సాహం నింపేందుకు కీలకమైన కార్పొరేషన్ పదవులు ఆఫర్ చేసే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 15 తర్వాత టీపీసీసీ కార్యవర్గం, నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్ఠానంతో చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ సందర్భంలోనే కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చే అంశంపైనా అధిష్ఠానంతో ఆయన చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మస్తాన్ సాయి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

లావణ్య, రాజ్‌తరుణ్ ఎపిసోడ్ వచ్చి చేరింది. రాజ్‌తరుణ్‌తో తనకు పరిచయం ఉన్నదని, ఆ పరిచయంతోనే అతడికి, లావణ్యలకు డ్రగ్ సరఫరా చేశానని మస్తాన్ సాయి అంగీకరించినట్టు సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నగరపాలెం ప్రాంతానికి చెందిన సాయిమస్తాన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం అతడు హిమాచల్‌ప్రదేశ్ పర్యటనకు వెళ్లాడు. అక్కడ.. డ్రగ్స్ లావాదేవీలు చేసే ఓ వ్యక్తి అతడికి పరిచయమయ్యాడు. ఢిల్లీలోని వికాస్‌పురిలో తనకు డ్రగ్స్ విక్రయించే వ్యక్తిని అతడు సాయిమస్తాన్‌కు పరిచయం చేశాడు. అప్పటినుంచి మస్తాన్ సాయి ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను గుంటూరుకు తెప్పించుకుని తన స్నేహితులతో పార్టీలు చేసుకుంటున్నాడు. హైదరాబాద్‌లో పరిచయస్తులకు, కొన్ని హోటళ్లకూ విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే.. గుంటూరులో హోల్టింగ్ డ్రైవర్‌గా పనిచేసే యనమల గోపీచంద్‌ను డ్రగ్స్ కోసం గత జూన్‌లో ఢిల్లీ పంపించాడు. ఆ సరుకును విజయవాడలో తీసుకోవాలని.. గుంటూరులోని సుభాని హోటల్ యజమాని కుమారులు నాగూర్ షరీఫ్, ఖాజా మొహిద్దీన్‌కు పురమాయించాడు. ఈమేరకు ఆ ఇద్దరూ జూన్ 30న విజయవాడ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అయితే.. ఢిల్లీ నుంచి డ్రగ్స్ వస్తున్న సమాచారం సెబ్ పోలీసులకు అప్పటికే అందడంతో వారు రైల్వేస్టేషన్ వద్ద నిఘా పెట్టి గోపీచంద్, షరీఫ్, మొహిద్దీన్ తోపాటు వారి కారు డ్రైవర్ ఎడ్ల క్రాంతిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రస్తుతం ఈ నలుగురూ నెల్లూరు జైలులో ఉన్నారు. వీరిని విచారించగా, మస్తాన్‌సాయి పేరు బయటకు వచ్చింది. ఈ కేసులో అతణ్ని ఏ5గా చేర్చారు.

రహస్యంగా వచ్చి..

హైదరాబాద్‌లో ఉన్న మస్తాన్‌సాయి కోసం సెబ్ పోలీసులు జూన్ నెలాఖరు నుంచి తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే.. అతడు రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి గుంటూరు నగరపాలెంలో ఉన్న దర్గాకు వచ్చాడు. ఈ దర్గాకు ధర్మకర్తగా అతని తండ్రి రావి రామ్మోహన్‌రావు ఉన్నారు. అక్కడే మస్తాన్ సాయి తలదాచుకుంటున్నాడు. ఈ విషయం తెలియగానే పోలీసులు అక్కడికి చేరుకుని అతణ్ని అరెస్టు చేసి విజయవాడకు తరలించారు. విచారణలో.. తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన నటుడు రాజ్‌తరుణ్, లావణ్యల కేసు లింక్‌లు తగిలాయి. రాజ్‌తరుణ్‌పై లావణ్య నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పుడు అతడికి డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు.. పోలీసులు అరెస్ట్‌చేసిన మస్తాన్‌సాయి తనకు రాజ్ తరుణతో స్నేహం ఉందని అంగీకరించడం గమనార్హం.

గతంలోనే అనేక కేసులు...

మస్తాన్ సాయి గుంటూరులోని ఓ హోటల్లో తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ అప్పట్లో లావణ్య ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు అతడిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. అయితే ఆ కేసులో అప్పటి సీఐ రాజశేఖర్ రెడ్డి నిందితుడు మస్తాన్ సాయికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ కేసును నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆ కేసులో అతడు హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. కేసు విచారణలో భాగంగా వైద్య పరీక్షలకు రావాల్సిందిగా అప్పటి నగరంపాలెం సీఐ హైమారావు.. బాధితురాలు లావణ్యకు ఫోన్ చేసి పిలిచినా ఆమె రాలేదు. ప్రస్తుతం ఆ కేసు విచారణ పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉంటే గుంటూరులో అతనిపై ఫిర్యాదు చేసిన లావణ్య ఆ తర్వాత కొద్ది నెలలకు హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు. 40 రోజులకు పైగా జైల్లో ఉన్నారు. అటు వరలక్ష్మి టిఫిన్స్ పల్లెటూరి దోసె హోటళ్లపై గతంలో డ్రగ్స్ ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు మస్తాన్‌సాయి అరెస్టు నేపథ్యంలో ఈ కేసులన్నింటిలోనూ మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది.

మత్తు వదలాలంటే..

- 26 ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డ్రగ్ డీ-అడిక్షన్ కేంద్రాల్లో '12 ప్యానెల్ డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఉండాలి: టీజీ న్యాబ్
- డ్రగ్స్‌ఫ్రీ సొసైటీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ


హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల కట్టడి చర్యల్లో భాగంగా.. 26 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కేంద్రాలను పరిశీలించామని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) వెల్లడించింది. వాటిలో కొన్ని కేంద్రాలు బాగా పనిచేస్తుండగా.. కొన్నింటికి జిల్లా అధికారుల నుంచి ప్రోత్సాహం అవసరమని పేర్కొంది. కొన్ని కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయని.. జిల్లా అధికారులు వాటిని తిరిగి తెరవాల్సి ఉందని తెలిపింది. ఈ 26 కేంద్రాల్లోనూ '12 ప్యానెల్ డ్రగ్ టెస్టింగ్ కిట్లు' అందుబాటులో ఉంటే.. మాదకద్రవ్యాల బారిన పడినవారిని ముందుగానే గుర్తించే అవకాశం ఉందని అభిప్రాయపడింది. మాదకద్రవ్యాల రహిత సమాజానికి తాము కట్టుబడి ఉన్నామని.. ఆ కల సాకారం కావాలంటే దానికి ఒక సమగ్ర విధానం ఉండాలని.. మద్యం, గంజాయి, కల్తీకల్లు సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని పేర్కొంది. నిజానికి.. కేంద్ర ప్రభుత్వ నషా ముక్త్ భారత్ పథకంలో భాగంగా రాష్ట్రంలో 16 డీఅడిక్షన్ కేంద్రాలు స్వచ్ఛంద సంస్థల ద్వారా కొనసాగుతున్నాయి. అయితే, వాటిలో 11 సెంటర్లు మాత్రమే పనిచేస్తున్నాయని.. వాటిలోనూ 6 కేంద్రాల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు లేరని గతంలో టీజీ న్యాబ్ చేసిన తనిఖీల్లో వెల్లడైంది. ఆ ఆరు కేంద్రాల్లోనూ రెండు సెంటర్ల పనితీరు సంతృప్తికరంగా లేదని.. చికిత్సకు అవసరమైన సౌకర్యాలు అక్కడ లేవని తేలింది. దీంతో ఆ ఆరు కేంద్రాల్లోనూ సౌకర్యాలను మెరుగుపరచాలంటూ లేఖలు రాసినట్లు టీజీన్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య గతంలో తెలిపారు. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్‌లోని ఐదు కేంద్రాలను తిరిగి తెరవాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పుడు తాజాగా వైద్యారోగ్య శాఖ సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో తనిఖీలు చేసిన టీజీ న్యాబ్.. వాటిలో '12 ప్యానెల్ డ్రగ్ టెస్టింగ్ కిట్లు' అందుబాటులో ఉంటే బాగుంటుందని అభిప్రాయపడింది.



ప్రీ-ప్రైమరీ స్కూళ్లలా..
అంగన్‌వాడీలు

- నూతన ఒరవడికి శ్రీకారం చుట్టనున్న శిశు సంక్షేమశాఖ
- టీచర్లకు డిప్లొమా కోర్సు, శిక్షణ- ఇంటర్ పూర్తయిన వారు అర్హులు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు అనగానే.. బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు గుడ్లు, పాలు అందించడం అనే విషయాలే గుర్తుకొస్తాయి. కానీ ఇక నుంచి అలా కాకుండా.. అంగన్‌వాడీలంటే ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక విద్య) పాఠశాలలని గుర్తొచ్చేలా చేయాలని మహిళా, శిశు సంక్షేమశాఖ నూతన చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిలో ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉన్న 15,600 కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టారు. వీటిల్లో బోధించే సిబ్బందికి ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. నూతన పాఠ్యాంశాలు, అవసరమైతే ఇంగ్లీష్‌లో బోధించేలా తీసుకోవాల్సిన అంశాలపై పెద్దగా శిక్షణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే ప్రీ-ప్రైమరీ స్కూళ్లలో ఇక నుంచి నూతనంగా అందుబాటులోకి వచ్చిన పాఠ్యాంశాలను చిన్నారులకు అర్థమయ్యేలా చెప్పడంతో పాటు, ఇంగ్లీష్‌లోనూ బోధించేలా టీచర్లకు శిక్షణను ఇవ్వాలని మహిళా, శిశు సంక్షేమశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఈ శిక్షణకు ఇంటర్ పూర్తిచేసిన వారిని అర్హులుగా నిర్ణయించారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో ఉన్న టీచర్లలో ఎంతమంది ఇంటర్మీడియట్ వరకు చదివారు, ఇంటర్ తరువాత డిగ్రీ, బీటెక్ చేసినవారు ఎంతమంది ఉన్నారనే వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అంగన్‌వాడీల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వరకు బోధిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం -2020 ప్రకారం అంగన్‌వాడీల్లో ప్రీ-ప్రైమరీ విద్యను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దీని ప్రకారం ఒకటి, రెండు, మూడవ తరగతుల వరకు అంగన్‌వాడీల్లోనే విద్యను అందించేలా సర్కారు చర్యలు చేపట్టింది. ఈ విధానంలో తెలుగుతో పాటు ఇంగ్లీష్, అవసరమైన చోట ఉర్దూ మీడియంలో కూడా బోధించాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో ఒక డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టి, దాని ద్వారా టీచర్లకు శిక్షణ ఇవ్వాలని మహిళా, శిశు సంక్షేమశాఖ నిర్ణయించినట్టు తెలిసింది. అయితే, ఈ శిక్షణను శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలా లేక స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందం చేసుకుని ఇప్పించాలా అనే దానిపై కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. శిక్షణ అనంతరం టీచర్లకు సర్టిఫికెట్‌ను అందిస్తారని తెలుస్తోంది.





పునరుద్ధరణకు ముందు.. తర్వాత చియోంగీచియాన్ నది

అప్పట్లో మురికి కూపం..
ఇప్పుడో అద్భుతం!

- పర్యాటకులను ఆకర్షిస్తున్న సియోల్‌లోని చియోంగీచియాన్ నది
- ఒకప్పుడు మూసీ తరహాలోనే కంపు.. రెండేళ్లలో పూర్తి స్థాయిలో పునరుద్ధరణ
- మూసీ ప్రక్షాళనలో ఈ నదే ఆదర్శం?
- ఆ నది వద్దకు రేవంత్, 2గంటల పాటు అక్కడే
- పునరుద్ధరణలో ఎదురైన సవాళ్లపై నేడు అక్కడి అధికారులతో భేటీ
- నదిని సందర్శించాక ఎన్నో కొత్త ఆలోచనలొచ్చాయి.. రేవంత్ ట్వీట్

హైదరాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మూసీని మురికి కూపం నుంచి తప్పించి.. తేటనీటితో కూడిన అందమైన నదిగా తీర్చిదిద్దడం, అద్భుత పర్యాట కేంద్రంగా అభివృద్ధి చేయడం సాధ్యమేనా సుసాధ్యం చేయాలని ఇప్పటికే సంకల్పం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇక ఆ దిశగా మరింత ఉత్సాహంతో ముందుకు అడుగులు వేయొచ్చేమో! దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఆ నగరం గుండా వెళ్లే అందమైన చియోంగీచియాన్ నది ఒకప్పుడు అచ్చంగా మూసీ మాదిరిగా మురికి కూపంగా ఉండేది. అక్కడి ప్రభుత్వం.. ఆ నదిని పునరుద్ధరించి.. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దింది. సియోల్ నగరం ప్రముఖ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా ఎదిగింది ఈ నది పునరుద్ధరణ తర్వాతేనంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. దీంతో మూసీ ప్రక్షాళనలో ఈ నదినే ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్.. మంత్రి శ్రీధర్ బాబు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌తో కలిసి సోమవారం రాత్రి చియోంగీచియాన్ నదిని సందర్శించారు. దాదాపు రెండు గంటలపాటు నది పరిసరాలను పరిశీలించారు. మూసీ నదితో ఎన్నో సారుప్యతలు ఉండటంతో చియోంగీచియాన్ నది తరహాలోనే మూసీని అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది. చియోంగీచియాన్ నది పునరుద్ధరణలో భాగంగా ఎదురైన సమస్యలు, తీసుకున్న జాగ్రత్తల గురించి సీఎం బృందం మంగళవారం అక్కడి అధికారులతో సమావేశం కానుంది. వారి అనుభవాలను తెలుసుకోనుంది. మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టుకు కావాల్సిన సాంకేతిక సహకారం అందించాలని కూడా దక్షిణ కొరియా ప్రభుత్వాన్ని రేవంత్ బృందం కోరే అవకాశాలున్నాయి. 'మూసీ నదిని పునరుద్ధరించి అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా చియోంగీచియాన్ నదిని పరిశీలించేందుకు అర్ధరాత్రి పర్యటించాం. ఎన్నో కొత్త ఆలోచనలొచ్చాయి. ఈ పర్యటన అద్భుతంగా ఉంది' అని ఎక్స్‌లో సీఎం పేర్కొన్నారు. పర్యటనకు సంబంధించిన వీడియోను షేర్ చేశారు.

11 కి.మీ మేర రెండేళ్లలో పునరుద్ధరణ

మన మూసీ తరహాలోనే చియోంగీచియాన్ నదికి ఘనమైన చరిత్ర ఉంది. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఈ నది మూసీ క్రమక్రమంగా మూసీ మాదిరిగానే మారింది. 1953లో కొరియా యుద్ధం తర్వాత రాజధాని సియోల్‌కు వలసలు పెరగడంతో ట్రాఫిక్ నిర్వహణ కష్టంగా మారింది. వాహనదారుల కోసం 1958లో ఈ నదిని ఆక్రమించి ఎక్స్‌ప్రెస్ వే రహదారి నిర్మించారు. ఫలితంగా నది దాదాపు కనుమరుగైంది. అయితే నగర సుందరీకరణలో భాగంగా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఆహ్లాదంగా గడిపేందుకు ఈ నదిని పునరుద్ధరించాలని 2003లో అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది ఇందుకు.. అప్పటికే ఉన్న భారీ రహదారిని ధ్వంసం చేసి.. కేవలం రెండేళ్ల వ్యవధిలో 11 కి.మీ. మేర ఉన్న నదిని పునరుద్ధరించారు. ఇందుకు 281 మిలియన్ డాలర్ల ఖర్చయింది. నిర్మాణం పూర్తయ్యాక సహజసిద్ధమైన నీటి ప్రవాహం అంతంతమాత్రంగానే ఉండటంతో రోజుకు 1.20 లక్షల టన్నుల నీరు స్థానిక హాన్ నదీ నుంచి ఇందులోకి పంపింగ్ చేస్తున్నారు. మురికి కూపం నుంచి అద్భుత పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకున్న నదుల్లో ఇది అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతి గడించింది. భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో కాలుష్యంగా మారిన నదులను పునరుద్ధరించాలని భావిస్తే ప్రభుత్వాలకు ముందుగా గుర్తుకువచ్చేది ఈ చియోంగీచియాన్ నదే. 2015లో ప్రధాని మోదీ, 2018లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ సత్యేంద్ర జైన్ దీన్ని సందర్శించారు. ఢిల్లీలోనూ ఇలాంటి ప్రాజెక్టు చేపట్టాలని కేంద్ర గతంలో భావించింది.


గోల్కొండకోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ శాంతికుమారి డీజీపీ జితేందర్

స్వాతంత్ర్య వేడుకల్లో వెయ్యి మంది కళాకారుల ప్రదర్శనలు

» గోల్కొండ కోటను సందర్శించిన సీఎస్

నార్సింగ్, హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకల్లో వెయ్యి మంది కళాకారుల ప్రదర్శనలుంటాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించనున్న గోల్కొండ కోటను ఆమె సోమవారం సందర్శించారు. వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబించేలా సంప్రదాయ దుస్తులలో కళాకారులు ఇచ్చే ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయన్నారు. పిల్లల్లో దేశభక్తి స్ఫూర్తిని రగిల్చేందుకు వేడుకలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎస్ తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను ఆమె ఆదేశించారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో విజ్ఞాన్ వర్సిటీకి 72 ర్యాంకు


విజ్ఞాన్ వర్సిటీ వీసీ నాగభూషణ్

గుంటూరు(విద్య), ఆగస్టు 12 : కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్డీ) సోమవారం విడుదల చేసిన ఉన్నత విద్యాసంస్థల ర్యాంకింగ్‌లో విజ్ఞాన్ వర్సిటీకి జాతీయ స్థాయిలో 72వ ర్యాంకు వచ్చినట్టు వీసీ ఆచార్య పీ. నాగభూషణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచింగ్, లెర్నింగ్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఓట్‌కమ్ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులు కేటాయిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్‌చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయ హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ వసూళ్ల కేసులో ఆర్టీవో అరెస్టు

మహబూబాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ వసూళ్ల కేసులో మహబూబాబాద్ జిల్లా రవాణా అధికారి(ఆర్టీవో) ఎండీ గౌస్‌పాషా, ఆయనకు సహకరించిన ప్రైవేట్ డ్రైవర్ ఎలమందల సుబ్బారావు, తనుకు రాంగోపాల్‌ను అరెస్టు చేసినట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు. సోమవారం వారిని వరంగల్ స్పెషల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మే 28న రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో రవాణాధికారి కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. అందులో భాగంగా మహబూబాబాద్ ఆర్టీవో కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించి రూ.45,100 స్వాధీనం చేసుకున్నారు. గౌస్‌పాషా డ్రైవర్ సుబ్బారావు వద్ద మరో రూ.16,500 పట్టుకున్నారు. అనంతరం విచారణలో సుబ్బారావు, రాంగోపాల్ సహకారంతో గౌస్‌పాషా రూ.2.97కోట్ల మేర అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అందుకు సంబంధించిన ఆధారాలు, మెసేజ్‌లను సేకరించిన ఏసీబీ అధికారులు సోమవారం గౌస్‌పాషా, సుబ్బారావు, రాంగోపాల్‌ను కోర్టులో హాజరుపరిచారు.

ఏసీబీకి చిక్కిన సాగునీటి పారుదల శాఖ ఏఈ

బాలసముద్రం, ఆగస్టు 12: రూ.6వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈ గోపాల్ ఏసీబీకి పట్టుబడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గుడికుంటతండాకు చెందిన బానోతు యాకు గతంలో రూ.1.27 లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశారు. అయితే, ఆ డబ్బును తిరిగి పొందే క్రమంలో... అక్కడ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ గుగులోతు గోపాల్, కౌంటర్ సైన్ చేసేందుకు రూ.6 వేలు డిమాండ్ చేశాడు. ఏఈకి లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేని యాకు... 9న ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చాడు. ఈమేరకు సోమవారం ఉదయం నక్కలగుట్టలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట బాధితుడు యాకు నుంచి డబ్బు తీసుకుంటుండగా గోపాల్‌ను పట్టుకున్నారు.

మందుపాతర పేలి గిరిజన మహిళ మృతి

చర్ల, అగస్టు 12: పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ గిరిజన మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కిష్టారంలో జరిగింది. దబ్బమార్క గ్రామానికి చెందిన సుక్కీ అనే మహిళ సోమవారం పశువులను మేపడానికి సమీప అడవిలోకి వెళ్లింది. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై కాలు పెట్టడంతో బాంబ్ పేలి మృతి చెందింది. కాగా, బస్తర్ డివిజన్‌లోని అడవుల్లో ప్రెజర్ బాంబులు పేలి ఇప్పటికి సుమారు 10 మంది మరణించారు.

ఝరి పున్నగూడ పాఠశాలలో వైద్య శిబిరం

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

తలమడుగు, ఆగస్టు 12: వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'జ్వర స్వైర విహారం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఝరి పున్నగూడ ఆశ్రమ బాలుర పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అధికారులు, వైద్య సిబ్బంది.. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చర్మవ్యాధులు సోకిన విద్యార్థులతో పాటు జ్వర బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాధులు తగ్గే విధంగా చర్యలు తీసుకుంటామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హాస్టల్ వార్డెన్ ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఎన్జీటీ అభ్యంతరాలపై సుప్రీంకోర్టుకు ఎండీసీ

» ఇసుక లభ్యతపై ప్రభావం చూపినట్టు ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) వ్యక్తం చేసిన అభ్యంతరాలను సవాలు చేస్తూ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎండీసీ) సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. 25 ఇసుక రీచ్‌లపై అభ్యంతరాలు చెప్పడంతో అక్కడ తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ కారణంగా పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సుమారు 12,79,501 టన్నుల ఇసుక స్టాక్ యార్డుల్లో ఉండిపోయింది. దీంతో ఇసుక కొరత ఏర్పడిందని, దీన్ని అవకాశంగా తీసుకుని కొంత మంది బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. అందువల్ల ఎన్జీటీ అభ్యంతరాలపై సుప్రీంకోర్టులో సవాలు చేయనున్నామని టీజీఎండీసీ జీఎం రాజశేఖర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

జోగిపేట పోలీస్ స్టేషన్ ముందే భారీ చోరీ

» కారు అద్దాలు పగులకొట్టి రూ.10 లక్షల అపహరణ

జోగిపేట, ఆగస్టు 12: పట్టపగలే.. అదీ పోలీస్ స్టేషన్ ఎదుటే భారీ చోరీ జరిగింది. ఆపి ఉన్న కారు అద్దాలు పగులకొట్టి దొంగలు ఏకంగా రూ.10 లక్షలు ఎత్తుకెళ్లారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. వాసవీనగర్ కాలనీలో నివాసముండే రవీందర్‌రెడ్డి ట్రాన్స్‌కోలో డిప్యూటీ ఏఈగా పనిచేసి రిటైరయ్యారు. ఆయన తన కుమారుడు సాయికిరణ్‌తో కలిసి మధ్యాహ్నం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10 లక్షలు డ్రా చేసుకుని కారులో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట కారు ఆపి.. స్వీట్ షాప్‌లోకి వెళ్లారు. ఇదే అదునుగా గుర్తుతెలియని దొంగలు.. కారు అద్దాలు పగులగొట్టి రూ.10లక్షలు అపహరించి పారిపోయారు. కారు వద్దకు వచ్చిన రవీందర్‌రెడ్డి.. విషయాన్ని గమనించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వలేం

» ఆమె దుర్బలమైన మహిళ కాదని హైకోర్టు పేర్కొంది
» ప్రతివాదుల వాదన విన్న తర్వాతే నిర్ణయం
» బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
» తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా



న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశే ఎదురైంది. ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసుల్లో మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా మధ్యంతర ఉపశమనం కల్పించలేమని స్పష్టం చేసింది. ఈడీ, సీబీఐ తనపై నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆమె ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్‌రోహత్గీ, విక్రమ్‌చౌదరితోపాటు మోహిత్‌రావు హాజరయ్యారు. తొలుత ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ కేసులో కవిత గత ఐదు నెలల నుంచి జైలులోనే ఉన్నారని తెలిపారు. దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ ఇప్పటికే చార్జిషీట్లు దాఖలు చేశాయని వెల్లడించారు. ఇదే కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాలు వరుసగా మధ్యంతర, సాధారణ బెయిల్ పొందారని వివరించారు. సెక్షన్ 45 ప్రకారం ఓ మహిళగా కవితకు బెయిల్ ఇవ్వాలని కోరారు. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ.. 'కవిత బాగా చదువుకున్న మహిళ, రాజకీయ వేత్త' అని అన్నారు. దీనికి ముకుల్ రోహత్గీ బదిలిస్తూ.. కవిత మాజీ పార్లమెంట్ సభ్యురాలని తెలిపారు. మరోసారి ధర్మాసనం జోక్యం చేసుకుని.. ఏది ఏమైనప్పటికీ కవిత "దుర్బలమైన" మహిళ కాదని హైకోర్టు పేర్కొన్న అంశాన్ని గుర్తు చేశారు. కవిత పిటిషన్లపై దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐకి నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. మళ్లీ ముకుల్ రోహత్గీ కలుగజేసుకుని అప్పటి వరకు కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. దర్యాప్తు సంస్థల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం వెల్లడిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

యూనివర్సిటీల్లో నాసి విద్య

(మొదటి పేజీ తరువాయి)



స్థానాలు దక్కాయి. యూనివర్సిటీల్లో పోస్టుల సంఖ్య, ఖాళీలు, రీసెర్చ్, నిధుల కేటాయింపు వంటి పలు అంశాలను ఈ ర్యాంకుల కోసం పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థలు పొందిన ర్యాంకుల విషయానికి వస్తే.. ఓవరాల్ ర్యాంకింగ్ కేటగిరీలో 66.69 పాయింట్లతో ఐఐటీ హైదరాబాద్ 12వ స్థానంలో నిలిచింది. 60.55 స్కోర్‌తో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 25వ స్థానం, 53.74 స్కోర్‌తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ 53వ స్థానం, ఉస్మానియా యూనివర్సిటీ 52.02 స్కోర్‌తో 70వ స్థానంలో నిలిచాయి. గత ఏడాది ఉస్మానియా వర్సిటీ స్థానం 64గా ఉంది. ఈ ఏడాదిలో ఇది 70కి పడిపోయింది. యూనివర్సిటీల కేటగిరీలో 17వ స్థానంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 43వ స్థానంలో ఉస్మానియా యూనివర్సిటీ (గతేడాది 36వ స్థానం), 74వ స్థానంలో ఐఐఐటీ హైదరాబాద్ నిలిచాయి. అయితే కాలేజీల కేటగిరీలో వంద లోపు తెలంగాణ నుంచి ఒక్కటీ లేదు. అలాగే రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కేటగిరీలోనూ అదేపరిస్థితి.

ఇక ఇంజనీరింగ్ విభాగంలో 71.55 స్కోర్‌తో ఐఐటీ హైదరాబాద్ 8వ స్థానం (గతేడాది 8వ స్థానం), ఎన్ఐటీ వరంగల్ 21వ స్థానం (గతేడాది 21వ స్థానం), ఐఐఐటీ హైదరాబాద్ 47వ స్థానం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 70వ స్థానంలో ఉన్నాయి. జేఎన్‌టీయూ ఈ ఏడాది 88వ స్థానంలో ఉండగా.. గతేడాది 83వ స్థానంలో నిలిచింది. మేనేజ్‌మెంట్ కేటగిరీలో 96వ స్థానంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్, 97వ స్థానంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, 100వ స్థానంలో ఎన్ఐటీ వరంగల్ నిలిచాయి. ఫార్మసీ విభాగంలో 80.29 స్కోర్‌తో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రెండో స్థానంలో ఉన్నాయి. 88వ స్థానంలో కాకతీయ యూనివర్సిటీ (గతేడాది 82వ స్థానం), 95వ స్థానంలో సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, మెడికల్ విభాగంలో 50.99 స్కోర్‌తో ఉస్మానియా మెడికల్ కాలేజీ 48వ స్థానంలో నిలిచాయి. డెంటల్ విభాగంలో 40వ స్థానంలో ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్స్ నిలిచింది. లా విభాగంలో 77.05 స్కోర్‌తో మూడో స్థానంలో నల్సార్ లా యూనివర్సిటీ ఉంది. అగ్రికల్చర్ విభాగంలో 37వ స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నిలిచింది. పైన పేర్కొన్న ర్యాంకుల్లో ఉన్న యూనివర్సిటీలు, ఇతర విద్యా రీసెర్చ్ సంస్థల్లో ఎక్కువ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్నవే. రాష్ట్ర పరిధిలోని యూనివర్సిటీలు, కాలేజీలు చాలా తక్కువున్నాయి. రాష్ట్ర యూనివర్సిటీల పట్ల చాలా ఏళ్లుగా ప్రభుత్వం ప్రదర్శిస్తున్న తీవ్ర నిర్లక్ష్య వైఖరితో తాజా పరిస్థితి నెలకొందన్న విమర్శలు వస్తున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీలను భర్తీ చేయకపోవడం, తగిన నిధులను ఇవ్వకపోవడంవంటి కారణాలతో యూనివర్సిటీల్లో నాణ్యత తగ్గిపోతోంది. వైస్ చాన్స్‌లర్ (వీసీ) పోస్టుల నియామకాల విషయంలోనూ ప్రభుత్వాలు నాన్చుడు ధోరణి అవలంబిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనూ చాలా ఏళ్లు ఇన్‌చార్జీ వీసీలతోనే వర్సిటీల పాలన కొనసాగింది. ప్రస్తుతమూ రెగ్యులర్ వీసీలు లేరు.

అలాగే యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులు 5వేలకు పైనే ఉంటాయని అంచనా. ఇందులో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులున్నాయి. ఈ పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం కామన్ నియామక బోర్డును ఏర్పాటు చేసింది. హెల్త్ యూనివర్సిటీ మినహా మిగిలిన 15 యూనివర్సిటీల్లోని బోధన, బోధనేతర పోస్టుల ఖాళీలను ఈ బోర్డు ద్వారా భర్తీ చేసేలా దీన్ని రూపొందించారు. ఈ బోర్డుకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో బిల్లును ఆమోదించారు. ఈ బిల్లు గవర్నర్ ఆమోదం లభించలేదు. రాష్ట్రపతి పరిశీలన కోసం ఈ బిల్లును పంపారు. దాంతో దీనిపై ముందుకు, వెనక్కి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

వర్సిటీల్లో బోధన పోస్టులు, ఖాళీల వివరాలు..

వర్సిటీ పేరు	మొత్తం పోస్టులు	ఖాళీలు
ఉస్మానియా	1,268	848
కాకతీయ	403	295
తెలంగాణ	150	75
మహాత్మాగాంధీ	150	115
శాతవాహన	120	100
పాలమూరు	150	130
బీఆర్ అంబేడ్కర్	84	58
జేఎన్ఏ అండ్ ఎఫ్ఏ	115	24
జేఎన్‌టీయూ	410	232
పొట్టి శ్రీరాములు	115	97

ఏడేళ్లుగా పూర్తి కానీ భర్తీ ప్రక్రియ

యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి ఉమ్మడి రాష్ట్రంలో 2005లో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యయనం చేసి రాష్ట్రంలోని ఖాళీలను రెండు దఫాలుగా భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి నుంచి 2013వరకు కొన్ని నియామకాలను పూర్తి చేశారు. అయితే ఈ నియామకాలన్నీ 2005లో గుర్తించిన ఖాళీ పోస్టులు మాత్రమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2016లో మరో హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనలో భాగంగా 2017లో 1,061 పోస్టుల భర్తీకి ఉత్తర్వులు (జీవో నంబరు 34) జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నియామకాలు ఇప్పటికీ పూర్తి కాలేదు.

వర్సిటీ పేరు	భర్తీ చేయాల్సిన పోస్టులు
ఉస్మానియా	415
కాకతీయ	136
శాతవాహన	40
తెలంగాణ	59
పొట్టి శ్రీరాములు	07
జేఎన్‌టీయూహెచ్	186
మహాత్మాగాంధీ	34
బీఆర్ అంబేడ్కర్	10
పాలమూరు	63
ఆర్‌జీయూకే (బాసర)	96
జేఎన్ఏ అండ్ ఎఫ్ఏ	15

యువతి ప్రాణాలను కాపాడిన పోలీసుల అప్రమత్తత

» ప్రేమలో మోసపోయి ఇంటి నుంచి వెళ్లి ఆత్మహత్యకు యత్నించిన యువతి
» శ్రీశైలం వద్ద సెల్‌ఫోన్ సిగ్నల్ గుర్తింపు
» బోయిన్‌పల్లి పోలీసుల సమాచారంతో యువతిని కాపాడిన అక్కడి పోలీసులు

బోయిన్‌పల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి మోసపోయి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతిని బోయిన్‌పల్లి పోలీసులు అందించిన సమాచారంతో శ్రీశైలం, దోమలపెంట, ఈగలపెంట పోలీసులు కాపాడారు. వనపర్తి జిల్లాకు చెందిన యువతి(24) ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐదేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో వనపర్తి జిల్లా జెట్రోలుకు చెందిన ఖాదర్ పాషా(22) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో యువతి వెంట పడిన పాషా.. ఆమెను తన గదికి పిలిచి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు పెళ్లి చేసుకోవాలని అడగడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. మతం మారితేనే పెళ్లి చేసుకుంటానని బాధితురాలిని కులం పేరుతో దూషించాడు. దీనిపై యువతి ఫిర్యాదు మేరకు బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. ఈ ఘటనలతో మనస్తాపం చెందిన యువతి.. "నేను గర్భవతినని తెలిసి ఖాదర్, అతని తండ్రి నన్ను చంపాలని చూశారు. నాకోసం వెతక్కండి" అని లేఖ రాసి ఇంటినుంచి వెళ్లిపోయింది. ఆదివారం అర్ధరాత్రి శ్రీశైలం సమీపంలోని వంతెన వద్ద యువతి సెల్‌ఫోన్ సిగ్నల్‌ను గుర్తించిన బోయిన్‌పల్లి పోలీసులు వెంటనే ఈగలపెంట, దోమలపెంట, శ్రీశైలం పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. ఆత్మహత్యకు యత్నిస్తున్న ఆమెను అక్కడి పోలీసులు కాపాడారు.

చైనా ఆదేశాలతోనే రాహుల్ మౌనం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ఆ మహనీయుల ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటు పడాలన్న సంకల్పంతో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నెహ్రూ కుటుంబానికి రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలను కాంగ్రెస్ నేతలు తెరమరుగు చేస్తున్నారని సంజయ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలన్న డిమాండ్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కుల, మత ప్రాంతాల పేరుతో ప్రజలను చీల్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. నెహ్రూ అనాలోచిత విధానాల వల్ల దేశ విభజన గాయాలు ఇంకా వెంటాడుతున్నాయని చెప్పారు. ఆర్టికల్ 370 పేరుతో కశ్మీర్‌ను దేశంలో అంతర్భాగం కాకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తే.. ప్రధాని మోదీ ఆ ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని నిరూపించారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కాంగ్రెస్ కోసం కాదని, రాజ్యాంగ ఫలాలు నెహ్రూ కుటుంబం కోసం మాత్రమే కోసమే కాదని, దేశంలో ప్రతీ ఒక్కరికి రాజ్యాంగ ఫలాలు అందాలని సంజయ్ అభిప్రాయపడ్డారు.

వైద్య విద్య.. నాణ్యత మిథ్య

ప్రైవేటులో పుట్టగొడుగుల్లా మెడికల్ కాలేజీలు.. ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 60కి చేరిన సంఖ్య

» మెజారిటీ కాలేజీల్లో అధ్యాపకులే లేరు
» రోగులు లేకుండానే ప్రాక్టికల్స్ పూర్తి



హైదరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్యలో నాణ్యత మిథ్యగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి వైద్య కళాశాలల సంఖ్య 60కి చేరిందని సంబరపడుతున్నా.. అందుకు తగినట్లుగా ప్రొఫెసర్లు, సదుపాయాలు లేకపోవడంతో.. వైద్య విద్యలో ప్రమాణాలు పడిపోతున్నాయి. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలను ఏ ఒక్క కాలేజీ కూడా పాటించడం లేదన్నది జగమెరిగిన సత్యం. ఇప్పటికే కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. విద్యార్థులు కళాశాలల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

70 శాతం ఫ్యాకల్టీ బోగస్..

వైద్య విద్యకు మేటిగా భావించే సర్కారీ మెడికల్ కాలేజీల్లోనే ఫ్యాకల్టీ ఉండటం లేదు. వైద్య విద్య సంచాలకుల పరిధిలో 11,499 మంజూరైన పోస్టులుండగా.. అందులో 56 శాతం ఖాళీలున్నట్లు కాగ్ నివేదికలో వెల్లడైంది. ఇక ప్రైవేటులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కొన్ని కాలేజీల్లో 70 శాతం మేర ఫ్యాకల్టీ ఉండటం లేదు. ప్రొఫెసర్లను కేవలం కాగితాలపైనే చూపుతున్నారు. ఎన్ఎంసీ బృందాలు తనిఖీలకు వచ్చినప్పుడు వారిని మేనేజ్ చేస్తున్నారు. దీంతో ఫ్యాకల్టీకి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అటెండెన్స్(ఎబాస్)ను ఎన్ఎంసీ ప్రవేశపెట్టింది. అయితే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఫ్యాకల్టీ వేలిముద్రలను క్లోనింగ్ చేసి ఎబాస్ అటెండెన్స్ వేసేస్తున్నాయి. మరికొన్ని కాలేజీలు తమకు సమీపంలో సమీపంలో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులను ఫ్యాకల్టీగా చూపుతున్నాయి. ఎబాస్‌లో వారి చేత వేలిముద్రలను వేయిస్తున్నాయి. మెజారిటీ కాలేజీల్లో ఇదే తంతు నడుస్తోంది. ప్రొఫెసర్లు లేకుండానే కాలేజీలను నడిపించేస్తున్నారు. కొన్ని కాలేజీలు సాయంత్రం నాలుగు గంటలకే తాళాలు వేసి వెళ్లిపోతున్నట్లు సమాచారం. వాస్తవానికి అనుబంధ ఆస్పత్రుల్లో రోగులుండాలి. ప్రస్తుతం సర్కారీ మెడికల్ కాలేజీల సంఖ్య భారీగా పెరగడంతో ప్రైవేటు మెడికల్ కాలేజీలకు వెళ్లే రోగుల సంఖ్య భారీగా తగ్గింది. దాంతో ప్రైవేటులో రోగులు ఉండటం లేదు. కొన్ని కాలేజీలు లేని రోగులను ఉన్నట్లు రికార్డులో చూపుతున్నట్లు సమాచారం. మరి కొన్ని కాలేజీల్లో అసలు ప్రసవాలే జరగకున్నా.. ఆ లెక్కలు చూపుతున్నట్లు తెలిసింది. ప్రైవేటు కాలేజీల్లో చదివే వారిలో ఒక్క ఆపరేషన్ చేయకుండానే మాస్టర్ ఆఫ్ సర్జరీ కోర్సు చేసి బయటకు వస్తున్న వారు కూడా ఉంటున్నారని వైద్య విద్య ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఎన్ఎంసీ ద్వంద్వ వైఖరి..

కాలేజీల విషయంలో ఎన్ఎంసీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందన్న విమర్శలున్నాయి. ప్రైవేటులో ఫ్యాకల్టీ లేకున్నా.. ఏ ఒక్క కాలేజీకి కూడా జరిమానా విధించడం లేదు. అదే సర్కారీ కాలేజీల్లో తనిఖీలు చేసి రూ.10-20 లక్షల వరకు జరిమానాలు విధిస్తోంది. ప్రైవేటు కళాశాలలు ఎన్ఎంసీని మేనేజ్ చేస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రతీ మెడికల్ కాలేజీ విధిగా వార్షిక నివేదికలను ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అందులో కాలేజీలోని ప్రొఫెసర్లు, ఓపీ, ఐపీ, సర్జరీల గణాంకాలను అప్‌లోడ్ చేయాలి. అధికారులు తనిఖీలు చేసినపుడు ఆ గణాంకాలు సరిపోలాలి. కానీ ప్రైవేటులో తనిఖీలు చేసిన తర్వాత కాలేజీలపై తీసుకున్న చర్యలేమీ లేవు. సీట్ల కోత ఉండటం లేదు. నిబంధనలను పాటించని కాలేజీల గుర్తింపు రద్దయ్యే పరిస్థితి కూడా చాలా తక్కువగా ఉంటోంది. మన రాష్ట్రంలో మెజారిటీ మెడికల్ కాలేజీలు రాజకీయ నాయకులకు చెందినవే ఉన్నాయని, అందుకే చర్యలు ఉండటం లేదన్న విమర్శలున్నాయి.

ఇంజనీరింగ్ విద్యలా మారుతోందా..?

మన రాష్ట్రంలో 60 మెడికల్ కాలేజీల్లో 8,715 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఇంకా కాలేజీల సంఖ్యను పెంచుతున్నారు తప్ప.. వాటిలో నాణ్యమైన విద్య అందుతుందా..? అన్న దానిపై పర్యవేక్షణ ఉండటం లేదు. ప్రభుత్వ ప్రైవేటులో వైద్య విద్య నాణ్యతను పర్యవేక్షించే బాధ్యత హెల్త్ యూనివర్సిటీపై ఉంటుంది. కానీ వర్సిటీ దీన్నేం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మరో నాలుగేళ్ల తర్వాత రాష్ట్రంలో ఏటా పదివేల మంది వరకు ఎంబీబీఎస్ చదివి బయటకు వస్తారు. వారిలో ఎంత మందికి ఉపాధి దొరుకుతుందన్న దానికి గ్యారెంటీ లేదు. కేవలం ఎంబీబీఎస్ చేస్తే సరిపోదు, పీజీ చేయాలి. మన దగ్గర 2,544 పీజీ సీట్లున్నాయి. అంటే ప్రస్తుతం ఉన్న ఎంబీబీఎస్ సీట్ల ప్రకారం కేవలం 29 శాతం మందికే పీజీ సీట్లు దక్కుతాయి. మరోవైపు ఏటా పోటీ కూడా పెరుగుతుంటుంది. దాంతో రానురాను సీటు దక్కించుకునే అవకాశాలు మరింత సన్నగిల్లుతాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు సరైన అవకాశాల్లేక రూ.25 వేలకే ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. దీంతో వైద్య విద్య మరో ఇంజనీరింగ్ విద్య అవుతుందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాలేజీ గురించి ముందే తెలుసుకోవాలి

విద్యార్థులు దరఖాస్తుకు ముందే ఒక్కసారి ఆయా కాలేజీలను సందర్శించడంతో పాటు వాటిలో చదివే సీనియర్ విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అక్కడ ఫ్యాకల్టీ ఉందో.. లేదో..? చెక్ చేసుకోవాలి. ఎన్ఎంసీ మేరకు ప్రమాణాలు పాటిస్తున్నారా.. లేదా.. రోగుల సంఖ్య ఎలా ఉంది..? అన్న విషయాలను తెలుసుకోవాలి. రోగులు లేకుంటే నేర్చుకునేది ఏమీ ఉండదు. ఓపీ, ఐపీతో పాటు డెలివరీలు, సర్జరీలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకోవాలి. ఇవన్నీ ఉన్న కాలేజీలనే ఎంచుకోవాలి. అప్పుడే నాణ్యమైన విద్య లభిస్తుంది.

- డాక్టర్ పుట్ట శ్రీనివాస్, మాజీ వైద్య విద్య సంచాలకులు

అమరావతికి అండగా ప్రపంచ బ్యాంకు

» మళ్లీ తెరపైకి రుణ ప్రణాళిక
» ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన బృందం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి అండగా నిలిచేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చింది. వైసీపీ నేతల పితూరీల కారణంగా ఆగిపోయిన రుణ ప్రణాళిక మళ్లీ తెరమీదకు వస్తోంది. శనివారం నుంచి అమరావతి ప్రాంతంలో పర్యటిస్తున్న నలుగురు సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు బృందం సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసింది. అమరావతి నిర్మాణానికి అందించాల్సిన ఆర్థిక సహాయ సహకారాలపై ముఖ్యమంత్రి వీరితో చర్చించారు. ప్రపంచబ్యాంకు ఉన్నతాధికారుల బృందం మరోసారి రాష్ట్రానికి వస్తుందని, ఆ తర్వాత అమరావతికి రాబోయే రుణంపై ఒక స్పష్టత వస్తుందని సీఆర్‌డీఏ అధికారులు చెప్పారు. తాజా చర్చల్లో భాగంగా... 2050 నాటికి అమరావతి జనాభా 35 లక్షలకు చేరుకుంటుందని, వీరందరికీ ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులను రుణంగా ఇవ్వాలని రాష్ట్ర అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. డ్రైనేజీలు, రోడ్ల కనెక్టివిటీ, మంచినీరు, ట్రంక్ ఇన్‌ఫ్రాల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చేందుకు నిధులు అవసరమైనప్పటికీ... మొదటి దశలో రూ.15,000 కోట్లు కావాలని ప్రభుత్వం భావిస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ • మంగళవారం 13 ఆగస్టు 2024

ఏఐసీటీఈ సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్

ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)- 'సాక్షమ్ స్కాలర్‌షిప్ స్కీమ్'ను ప్రకటించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్‌పై దివ్యాంగులకు ఆసక్తిని కలిగించి, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. దీని ద్వారా కనీసం 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. అభ్యర్థులు పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి మూడేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ఐటీఐ కోర్సు పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నాలుగేళ్ల వ్యవధి గల టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. డిప్లొమా పూర్తిచేసి లేటరల్ ఎంట్రీ ద్వారా డిగ్రీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి రూ.50,000 చెల్లిస్తారు. డిప్లొమా అభ్యర్థులకు మూడేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు నాలుగేళ్లు స్కాలర్‌షిప్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీకైతే డిప్లొమా అభ్యర్థులకు రెండేళ్లు, డిగ్రీ అభ్యర్థులకు మూడేళ్లు స్కాలర్‌షిప్ అందిస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఏటా అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ఇందుకోసం బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డ్ తప్పనిసరి. ఫీజు, వసతి, పుస్తకాలు, కంప్యూటర్ తదితర ఖర్చుల కోసం ఈ స్కాలర్‌షిప్ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఏటా చదువులో చూపిన ప్రతిభ ఆధారంగా తరవాతి సంవత్సరాలకు వీటిని కొనసాగిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **అప్లికేషన్ వెరిఫికేషన్:** నవంబరు 15న
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్:** నవంబరు 30న
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** ఐటీఐ/పదోతరగతి/ఇంటర్/డిప్లొమా సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; స్టడీ/బోనఫైడ్ సర్టిఫికెట్; ఆదాయ ధ్రువీకరణ పత్రం; రెన్యువల్ సందర్భంలో ప్రమోషన్ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.



క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్ఎల్ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- అడ్మిషన్ ఫీజు: రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

సీసీఎంబీలో పీహెచ్‌డీ



హైదరాబాద్-హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)- పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లో భాగంగా మోడరన్ బయాలజీకి సంబంధించిన అంశాల్లో పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్ లేదా రిమోట్ ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పరిశోధనాంశాలు: సెల్ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, జినోమిక్స్, డెవలప్‌మెంటల్ బయాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ, కన్జర్వేషన్ బయాలజీ, ఎకాలజీ, ప్రొటీన్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, బయాలజీ ఆఫ్ మాక్రో మాలిక్యూల్స్, బయాలజీ ఆఫ్ ఇన్ఫెక్షన్, ఇమ్యూనాలజీ, ఎపిజెనెటిక్స్, క్రొమాటిన్ బయాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని సైన్స్ విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/డీఎస్‌టీ నుంచి వ్యాలిడ్ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ లేదా డీబీటీ-బీఈటీ/ఇన్‌స్పయిర్/ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి ఫెలోషిప్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **రిటెన్/ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 29
- **ఇంటర్వ్యూలు:** హైదరాబాద్‌లో
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

ఏపీ గిరిజన వర్సిటీలో డిగ్రీ

విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (ఏపీసీటీయూ)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ, బీటీఏ, బీకాం ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన సీయూఈటీ(యూజీ) 2024లో సాధించిన ర్యాంక్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఇవి ఆనర్స్/ఆనర్స్ విత్ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు.

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(బోటనీ), బీఎస్సీ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), బీఎస్సీ(జియాలజీ), బీటీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్), బీకామ్(ఒకేషనల్).

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సీయూఈటీ(యూజీ) 2024 అర్హత తప్పనిసరి.



- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- ★ **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16
- ★ **మొదటి మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 19
- ★ **అడ్మిషన్స్ కౌన్సెలింగ్:** ఆగస్టు 26
- ★ **తరతులు ప్రారంభం:** సెప్టెంబరు 9
- ★ **వెబ్‌సైట్:** www.ctuap.ac.in

తెలంగాణ బీసీ మహిళా గురుకులాల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్

మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. వనపర్తి అగ్రికల్చరల్ కాలేజ్, కరీంనగర్ అగ్రికల్చరల్ కాలేజ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఒక్కో కాలేజ్‌లో 120 సీట్లు ఉన్నాయి. రాష్ట్రానికి చెందిన మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. బీసీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం, ఓసీ/ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా తెలంగాణ ఈఏపీసెట్ 2024 స్కోర్ ప్రకారం 85 శాతం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లను అగ్రిసెట్ 2024 స్కోర్ ద్వారా భర్తీ చేస్తారు. ఇందుకు విడిగా మరో నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థి వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్ విండో ఓపెన్:** సెప్టెంబరు 1 నుంచి 2 వరకు
- **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

జాబ్ కార్నర్

ఐసర్‌లో ఫ్యాకల్టీ

బరంపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల సంఖ్య: 5

1. ప్రొఫెసర్(కెమికల్ సైన్సెస్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ-1(ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కంప్యూటర్ సైన్సెస్/బయోలాజికల్ సైన్సెస్): **4 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయోఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ, స్ట్రక్చరల్ బయాలజీ, న్యూరో బయాలజీ తదితరాలు

జీతం: నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,59,100; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://iiserbpr.ac.in/

గెయిల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఖాళీలు 391

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

- నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు: 391(యూఆర్-174, ఈడబ్ల్యూఎస్-29, ఓబీసీ-89, ఎస్సీ-60, ఎస్టీ-39)

1. జూనియర్ ఇంజనీర్(కెమికల్): **2 పోస్టులు**
2. జూనియర్ ఇంజనీర్(మెకానికల్): **1**
3. ఫోర్‌మన్(ఎలక్ట్రికల్): **1**
4. ఫోర్‌మన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **14**
5. ఫోర్‌మన్(సివిల్): **6**
6. జూనియర్ సూపరింటెండెంట్(ఆఫీషియల్ లాంగ్వేజ్): **5**
7. జూనియర్ కెమిస్ట్: **8**
8. జూనియర్ అకౌంటెంట్: **14**
9. టెక్నికల్ అసిస్టెంట్(ల్యాబొరేటరీ): **3**
10. ఆపరేటర్(కెమికల్): **74**
11. టెక్నీషియన్(ఎలక్ట్రికల్): **44**
12. టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **45**
13. టెక్నీషియన్(మెకానికల్): **39**
14. టెక్నీషియన్(టెలికాం అండ్ టెలిమెట్రీ): **11**
15. ఆపరేటర్(ఫైర్): **39**
16. ఆపరేటర్(బాయిలర్): **8**
17. అకౌంట్స్ అసిస్టెంట్: **13**
18. బిజినెస్ అసిస్టెంట్: **65**

అర్హతలు: పోస్టును అనుసరించి పదోతరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ, బీఎస్సీ, బీకాం, బీటీఏ, బీబీఎస్, బీబీఎం, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంకాం, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతభత్యాలు: జూనియర్ ఇంజనీర్ పోస్టులకు రూ.35,000 - రూ.1,38,000. జూనియర్ సూపరింటెండెంట్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టులకు రూ.29,000 - రూ.1,20,000. మిగిలిన పోస్టులకు రూ.24,500 - రూ.90,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.50. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 7

వెబ్‌సైట్: https://gailonline.com/

ఐఎంయూలో అసిస్టెంట్ ఉద్యోగాలు

ఖాళీలు 27

చెన్నైలోని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కిందన పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **అసిస్టెంట్:** 15 పోస్టులు
- **అసిస్టెంట్(ఫైనాన్సింగ్):** 12 పోస్టులు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉండాలి.

జీతం: నెలకు రూ.5,200 నుంచి రూ.20,200 వరకు

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.700, ఇతరులకు రూ.1000.

పని ప్రదేశం: చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం, కొచ్చి

పరీక్ష కేంద్రాలు: న్యూఢిల్లీ, లఖ్‌నవూ, పట్నా, కోల్‌కతా, గువాహటీ, హైదరాబాద్, చెన్నై, కొచ్చిన్, బెంగళూరు, ముంబయి, భోపాల్, జైపూర్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 30

వెబ్‌సైట్: www.imu.edu.in/imunew/

రీబస్




సరైన చోటు

పాంచాల పురాన్ని పాలించే విక్రముడు అనే రాజు ఆనందుడు అనే ముని పుంగవుని వద్ద విద్యాభ్యాసం చేశాడు. ఆ గురువు శిక్షణలో అన్ని విద్యల్లో ఆరితేరి, మంచి పరిపాలనాదక్షుడిగా పేరు తెచ్చుకున్నాడు. ఒక గురుపూర్ణిమ రోజు విక్రముడికి తన గురువును దర్శించుకొని తనను అంత వాడిని చేసినందుకు ధన్యవాదాలు చెప్పాలి అనిపించింది. గురువు దగ్గరకు వెళుతూ తనతోపాటు విలువైన పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు వజ్రాలు కూడా తీసుకువెళ్లి, కానుకగా స్వీకరించమని అర్థించాడు. ఆనందుడు తన శిష్యుడిని నిరాశ పరచడం ఇష్టం లేక వాటిని స్వీకరించాడు. ఆ మర్నాడు విక్రముడికి దారి పక్కన చెట్ల కింద నివాసం ఉండే కొందరు పేదవారి దగ్గర విలువైన బంగారు నగలు పట్టు బట్టలు కనిపించాయని భటులు చెప్పారు. అవి వారికి ఎలా వచ్చాయో కనుక్కొని రమ్మని భటులను పంపాడు రాజు.

ఆ బట్టలు నగలను అంతకు ముందు రోజు ఆనందుడు అనే ముని తమకు దానంగా ఇచ్చినట్లు చెప్పారు ఆ పేదవారు. అది విన్న విక్రముడికి కొంచెం కోపం వచ్చింది. తాను ఎంతో గౌరవంతో గురువుగారికి ఇచ్చిన కానుకలను అలా కడు పేద వారికి ఎలా దానం చేశాడని గురువు పట్ల చిరాకు పడి తరువాతిరోజు మరలా గురువు గారి ఆశ్రమానికి వెళ్లి, ఎందుకిలా చేశారని గురువు గారిని అడిగాడు. దానికి ఆనందుడు 'విక్రమా.. సర్వ సంగ పరిత్యాగినైన నేను ఈ విలువైన దుస్తులు నగలను ఏం చేసుకుంటాను? అదే మంచి తిండికి కూడా నోచుకోని ఆ పేదవారు ఒక్క నగలేదా విలువైన వస్త్రం అమ్ముకున్నా వారి కుటుంబాలు కడుపు నిండా భోజనం చేయగలుగుతాయి, కాబట్టి నాకన్నా వాటి అవసరమున్న వారి దగ్గర ఉండటమే ఆ కానుకలకు సరైనచోటు' అన్నాడు ఆనందుడు.

ఆ మాటలలో నిజాన్ని గమనించిన విక్రముడు తన రాజ్యంలో పేద వారందరికీ పని కల్పిస్తాననీ అందరికీ కనీస సౌకర్యాలు ఉండేటట్లు చూస్తాననీ గురువుకు మాట ఇచ్చి, ఆ ప్రకారమే చేసి ధర్మప్రభువు అనే పేరు తెచ్చుకున్నాడు.


దారి కనుక్కోండి



సరైన నీడను కనుక్కోండి




10 తేడాలు కనుక్కోండి





ఎన్ని కోళ్లు ఉన్నాయి



డైలీ సుడోకు - 382

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 381 సమాధానం

2	5	4	3	1	6
1	3	6	5	4	2
5	1	3	2	6	4
4	6	2	1	3	5
3	4	5	6	2	1
6	2	1	4	5	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.